www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కర్ణాటక సీఎంపై లోకాయుక్తలో కేసు

ఏ1గా ముఖ్యమంత్రి, ఏ2గా ఆయన భార్య పార్వతి, ఏ3గా బావమరిది

ట్రస్టు పేరిట భూ కుంభకోణం.. ఖర్గే కుటుంబంపైన ఫిర్యాదు




నేడు ఆయన.. రేపు ఎవరో!

సీఎం ఎవరైనా పార్టీనే ముఖ్యం 14

సిద్దరామయ్య భవితవ్యంపై ఖర్గే నర్మగర్భ వ్యాఖ్యలు

శనివారం | 28-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 182 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి మ. 2.50 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఆశ్లేష తె. 3.38 తదుపరి మఖ; వర్జ్యం: మ.3.21-5.06; దుర్ముహూర్తం: ఉ.6.08-7.43; అమృతఘడియలు: రా.1.52-3.38; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.02 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



వరద బాధితుల కోసం సీఎంకు రూ.20కోట్ల చెక్కు ఇస్తున్న రిలయన్స్ ప్రతినిధులు

హైటెక్‌సిటీలో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్

త్వరలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కొత్తగా 5 వేల మంది ఇంజనీర్లకు ఉద్యోగాలు

స్కిల్ యూనివర్సిటీలో హెచ్‌సీఎల్ భాగస్వామ్యం

సీఎంతో హెచ్‌సీఎల్ చైర్‌పర్సన్ రోష్నీ సమావేశం

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మరో దిగ్గజ ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ హైదరాబాద్‌లో తన భారీ విస్తరణ ప్రణాళికను ప్రకటించింది. హైటెక్ సిటీలో తన నూతన కార్యాలయాన్ని త్వరలో ప్రారంభించనుంది. నోయిడా ప్రధాన కేంద్రంగా ఉన్న హెచ్‌సీఎల్ 60 దేశాల్లో విస్తరించి ఉండగా.. 2.20 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. భారత్‌లో ఇప్పటికే హైదరాబాద్‌తోపాటు 16 నగరాల్లో కార్యాలయాలు కలిగి ఉంది. తాజాగా మరో కొత్త కార్యాలయం హైటెక్‌సిటీలో సిద్ధమైంది. దీనిని ప్రారంభించాల్సిందిగా హెచ్‌సీఎల్

మిగతా 13వ పేజీలో...

చారిత్రక భవనాలకు

పర్యాటక కళ

జూబ్లీహాల్, హైకోర్టు, సిటీ కాలేజీ, పురానాపూల్ బ్రిడ్జి పరిరక్షణకు చర్యలు 13

సంక్షేమమే కాదు.. పర్యాటకంపైనా దృష్టి: సీఎం

మెట్ల బావుల పునరుద్ధరణకు సీఐఐతో ఒప్పందాలు

హైడ్రాతో వ్యతిరేకత?

మారుతున్న ప్రజాస్పందన!.. ప్రభుత్వానికి నివేదించిన వివిధ శాఖలు

దూకుడుగా వెళితే చట్టపరమైన సమస్యలు

ఉన్న అనుమతుల్ని పరిగణనలోకి తీసుకోవాలి

ఆక్రమణలకు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతుల్ని రద్దు చేశాకే చర్యలు చేపట్టాలి

తొలుత చెరువుల సరిహద్దుల లెక్క తేల్చాలి

ఎఫ్‌టీఎల్‌లో ఉంటే ముందుగా నోటీసులివ్వాలి

సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారంపై..

దీటైన వ్యూహంతో ముందుకెళ్లడం అవసరం



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా చర్యలపై ఓవైపు ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తుండడం, మరోవైపు బాధితుల నుంచి ఆవేదన వ్యక్తమవుతున్న నేపథ్యంలో కూల్చివేతలపై సమీక్షించుకోవాలన్న సూచనలు ప్రభుత్వానికి అందుతున్నాయి. ప్రజా స్పందనపై ప్రభుత్వం వివిధ శాఖల నుంచి నివేదికలు తెప్పించుకోగా.. పలు అంశాన్ని సూచించినట్లు తెలిసింది. ఇందులో.. హైడ్రా కూల్చివేస్తున్న పలు నిర్మాణాలకు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ వంటి సంస్థలు అనుమతులు ఇచ్చాయని, తగిన వ్యవధితో నోటీసులు లేకుండా వాటిని కూల్చితే చట్టపరమైన సమస్యలు వచ్చే అవకాశం ఉందని నివేదికల్లో పేర్కొన్నట్లు సమాచారం. అనుమతులు చట్టవిరుద్ధమైనవైతే ముందుగా వాటిని రద్దు చేయాలని, చెరువుల ఎఫ్‌టీఎల్ విషయంలోనూ ముందుగా లెక్కలు తేల్చాలని, ఆ తరువాతే కూల్చివేతలు చేపట్టాలని సూచించినట్లు తెలిసింది. పేదలు, మధ్యతరగతి వర్గాలపై దూకుడుగా వెళ్లకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడినట్లు సమాచారం. హైడ్రా కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ ప్రభావితమయ్యే అవకాశం ఉందన్న విషయాన్ని కూడా గుర్తించాలని సూచించినట్లు తెలిసింది. హైడ్రా విషయంలో ప్రజల్లో

మిగతా 2వ పేజీలో...

స్టే ఉండగా ఎలా కూల్చుతారు? 2

కోర్టు ఉత్తర్వులు ఉన్నా పట్టించుకోరా?

హైడ్రా కమిషనర్ రంగనాథ్, అమీన్‌పూర్ తహసీల్దార్ హాజరై వివరణ ఇవ్వాలి: హైకోర్టు

కూకట్‌పల్లిలో మహిళ ఆత్మహత్య

కూల్చివేతల భయంతోనేనన్న కుటుంబీకులు

హైడ్రాకు సంబంధం లేదన్న రంగనాథ్ 13

మా ఇళ్లు కూల్చొద్దు.. గో బ్యాక్!.. మూసీ పరీవాహక ప్రాంతాల్లో బాధితుల ఆందోళన, ధర్నాలు 2



కాళేశ్వరం ఎవరి మానస పుత్రిక?

ప్రాజెక్టు గురించి తెలియకుండానే పదవులు అనుభవించారా?

అలాగైతే మీరు రాజీనామా చేయాలి.. కొందరిని రక్షిస్తున్నారా?

ఈఎన్‌సీ, కార్పొరేషన్ ఎండీ హరిరామ్‌కు జస్టిస్ ఘోష్ ప్రశ్నలు

మేడిగడ్డ బ్లాక్-7 కుంగుబాటుకు కారణం ఏమిటో చెప్పలేను

రుణాల కోసం రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌ల తాకట్టు: అధికారి

హైదరాబాద్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'కాళేశ్వరం ఎవరి మానస పుత్రిక (బ్రెయిన్ చైల్డ్)నో తెలియకుండానే పదవులు అనుభవించారా? అలాగైతే మీరు రాజీనామా చేయాల్సి ఉంటుంది. వాస్తవాలు చెప్పకుండా కొందరిని రక్షించే యత్నం చేస్తున్నారా? కంపెనీల చట్టం ప్రకారం కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్‌కు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) ఉండాలి.. మరి ఆయనెవరు?' అంటూ కాళేశ్వరం (గజ్వేల్) ఈఎన్‌సీ, మేనేజింగ్ డైరెక్టర్ బి.హరిరామ్‌పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. శుక్రవారం ఆయన విచారణకు హాజరవగా 90కి పైగా ప్రశ్నలు సంధించింది. కాగా, హరిరామ్

మిగతా 11వ పేజీలో...

పెద్ద వెంచర్లన్నీ పెండింగ్‌లోనే!



2 వేల చ.గజాలకు పైబడిన స్థలాల్లో భవనాలకు, 5 ఎకరాల పైనున్న లేఔట్లకు అనుమతుల ఆలస్యం

భవన నిర్మాణ, లేఅవుట్, ఆక్యుపెన్సీకి సంబంధించి 1012 ఫైళ్లు పెండింగ్.. డెవలపర్ల పడిగాపులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లో భారీ బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు, పెద్ద లే అవుట్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి! 2వేల చదరపు గజాలలోపు విస్తీర్ణం ఉన్న జాగాలో భవనాల నిర్మాణాలకు, ఐదెకరాలలోపు లే అవుట్లకు అనుమతులు త్వరగానే వస్తున్నాయిగానీ.. అంతకు మించినవాటికి సంబంధించిన దస్త్రాలు మాత్రం మూణ్నెల్లుగా (మే నుంచి) వివిధ దశల్లో అధికారుల వద్దే నిలిచిపోతున్నాయి!! దీంతో డెవలపర్లు, బిల్డర్లు అనుమతుల కోసం పడిగాపులు కాస్తున్నారు. నిజానికి.. దేశంలోని ఇతర రాష్ట్రాలు, మెట్రోపాలిటన్ నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లో భవన నిర్మాణ అనుమతులు సులువుగా, త్వరగా వస్తాయనే పేరుంది. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తొలిసారిగా ఆన్‌లైన్‌లోనే భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులిచ్చేందుకు డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డీపీఎంఎస్)ను హెచ్ఎండీఏ తొమ్మిదేళ్ల క్రితమే అమల్లోకి తేవడం ఇందుకు ప్రధాన కారణం. ఈ విధానాన్ని అనుసరిస్తూ టీఎస్‌బీపాస్‌ను తీసుకొచ్చారు. సత్వర అనుమతుల విధానం రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం దూసుకుపోయేందుకు దోహదపడింది. దేశంలోని పలు రియల్ ఎస్టేట్ సంస్థలను, డెవలపర్లను ఆకర్షించింది. రాష్ట్రంలోని డెవలపర్లు, సంస్థలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన నిర్మాణ సంస్థలు

మిగతా 3వ పేజీలో...

ఇదేం దేశం.. ఇదేం హిందుత్వం?



దర్శనానికి వెళ్తే డిక్లరేషన్ అడుగుతారా!?

ఎలాంటి లౌకిక వాదమిది?.. నా మతం మానవత్వమని రాస్కోండి


నాలుగ్గోడల మధ్య బైబిల్ చదువుతా.. బయట ఇతర మతాలను గౌరవిస్తా!

ఏనాడూ కోరని డిక్లరేషన్ ఇప్పుడెందుకు?.. లడ్డూపై చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే!

లడ్డూలకు కల్తీ నెయ్యి వాడలేదు: జగన్.. తిరుమల పర్యటన ఆకస్మికంగా రద్దు

అమరావతి/తిరుపతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'మనం ఎలాంటి దేశంలో నివసిస్తున్నాం? ఆలయంలో ప్రవేశించే వ్యక్తి తన మతమేంటో చెప్పాలా? ఇదేం దేశం.. ఇదేం హిందూయిజం' అని వైసీపీ అధినేత జగన్ ప్రశ్నించారు. లడ్డూ వివాదం నేపథ్యంలో ఆకస్మికంగా తిరుమల యాత్ర తలపెట్టిన ఆయన.. తన పర్యటనను అంతే ఆకస్మాత్తుగా రద్దుచేసుకున్నారు. షెడ్యూలు ప్రకారం శుక్రవారం తిరుమలకు వెళ్లాల్సిన ఆయన.. ఆ ప్రయత్నమే చేయకుండా తాడేపల్లి ప్యాలె‌స్‌లో 'ఎంపిక చేసిన' మీడియాతో మాట్లాడారు. శ్రీవారి దర్శనానికి వెళ్లాలంటే డిక్లరేషన్ ఇవ్వాలని తనను డిమాండ్ చేయడంపై

మిగతా 11వ పేజీలో...



మేం వెళ్లొద్దన్నామా?

సాకులు వెతుక్కుని జగనే తిరుమల వెళ్లకపోతే మేమేం చేస్తాం 11

డిక్లరేషన్ ఇవ్వలేకే మానేశారు: బాబు

మంత్రి పొంగులేటి ఇంట్లో

ఈడీ సోదాలు

కుమారుడు హర్షరెడ్డికి చెందిన 'రాఘవ గ్రూప్' ఆఫీసుల్లోనూ తనిఖీలు 3

రాష్ట్ర పోలీసులకు సమాచారమివ్వని ఈడీ

హర్షరెడ్డి లగ్జరీ వాచీలపై కస్టమ్స్ కేసు

రూ.7 కోట్ల విలువైన 7 వాచీలు!

మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు

పలు పత్రాలు, డిజిటల్ ఆధారాలు స్వాధీనం

సోదాలు జరుగుతున్నా యథావిధిగా విధులకు మంత్రి పొంగులేటి హాజరు



సోమశిల, నిర్మల్‌కు జాతీయ అవార్డులు 13

ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రాలుగా ఎంపిక

పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం

మూలధన వ్యయం తగ్గింది!



- నిరుటి కంటే రూ.10 వేల కోట్లు తక్కువ
- ఐదు నెలల్లో ఖర్చు పెట్టింది రూ.8,327 కోట్లే
- 5 నెలల్లో రాష్ట్ర రాబడులు రూ.61,618 కోట్లు
- అప్పుల రూపంలో మరో 29,449 కోట్ల రాక
- రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యయం 85,467 కోట్లు
- ఆగస్టు ఆదాయ, వ్యయాలపై 'కాగ్' నివేదిక

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం వెచ్చించే మూలధన వ్యయం తగ్గిపోతోంది. గత ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలలతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో పెట్టిన ఖర్చు భారీగా తగ్గడం గమనార్హం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు నాటికి మూలధన వ్యయం కింద ప్రభుత్వం రూ.18,432 కోట్లు ఖర్చు చేసింది. అప్పటి బడ్జెట్‌లో అంచనా వేసిన రూ.37,524 కోట్లలో ఇది 49.12 శాతంగా నమోదైంది. కానీ, ఈ ఆర్థిక సంవత్సరం ఆగస్టు నాటికి 5 నెలల్లో కేవలం రూ.8,327 కోట్లే ఖర్చు

మిగతా 11వ పేజీలో...

రక్షణశాఖ కమిటీలో ప్రతిపక్ష నేత రాహుల్

కమ్యూనికేషన్ల కమిటీలో కంగన, మహువా

కొత్తగా 24 పార్లమెంటరీ స్థాయీ సంఘాలు

పలువురు తెలుగు ఎంపీలకు కమిటీల్లో చోటు

విదేశాంగ వ్యవహారాలు- డీకే అరుణ, లక్ష్మణ్, ఒవైసీ

రసాయనాలు-ఈటల, ఆరోగ్యం- కడియం కావ్య

గృహ, పట్టణ కమిటీ చైర్మన్‌గా మాగుంట శ్రీనివాసులురెడ్డి, రైల్వే సారథిగా సీఎం రమేశ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రక్షణ శాఖకు చెందిన పార్లమెంటరీ కమిటీలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి సభ్యత్వం లభించింది. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు కమ్యూనికేషన్లు, ఐటీ కమిటీలో చోటు దక్కింది. ఇదే కమిటీలో తృణమూల్‌కు చెందిన ఫైర్‌బ్రాండ్ ఎంపీ మహువా మొయిత్రాకు స్థానం లభించడం విశేషం. పార్లమెంటరీ స్థాయీ సంఘాలను పునర్ వ్యవస్థీకరిస్తూ 24 కొత్త కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ వివరాలను శుక్రవారం లోక్‌సభ సెక్రటేరియట్ వెల్లడించింది. కీలకమైన రక్షణశాఖ కమిటీ

మిగతా 14వ పేజీలో...



క్యాన్సర్ చికిత్సకు 5 రీజినల్ కేంద్రాలు

కొత్తగూడెం, ఆదిలాబాద్, పాలమూరు, సంగారెడ్డి, కరీంనగర్‌లలో

ఒక్కో కేంద్రం 50 కోట్లతో.. ఏటేటా పెరుగుతున్న క్యాన్సర్ బాధితులు

ప్రస్తుతం ఎంఎన్‌జేలోనే చికిత్స.. సేవల విస్తరణకు సర్కారు నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్యాన్సర్ బాధితులు ఏటేటా పెరుగుతుండడంతో క్యాన్సర్ వైద్య సేవలను జిల్లాలకు కూడా విస్తరింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటిదాకా ప్రభుత్వ ఆధ్వర్యంలో క్యాన్సర్ చికిత్స కేవలం హైదరాబాద్‌లోనే అందుబాటులో ఉండగా.. ఇకపై జిల్లా కేంద్రాల్లో క్యాన్సర్ రీజినల్ సెంటర్లను ఏర్పాటు చేయనుంది. మొదటి దశలో కొత్తగూడెం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, కరీంనగర్‌లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో కేంద్రాన్ని రూ.50 కోట్లతో ఆధునిక వసతులతో నిర్మించనున్నారు. ఆ తర్వాత దశలవారీగా మిగిలిన జిల్లా కేంద్రాల్లోనూ అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం, స్క్రీనింగ్ చేయడం, ఆయా జిల్లాల్లో ఉన్న క్యాన్సర్ రోగులకు హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రి వైద్యులు సూచించిన చికిత్సనందించడం వంటివి ఈ సెంటర్ల

మిగతా 13వ పేజీలో...

బాస్మతి ముసుగులో పారాబాయిల్డ్ బియ్యం!

గుజరాత్‌లో రూ. 7 కోట్ల విలువైన తెలంగాణ బియ్యం పట్టివేత

దుబాయ్‌కి తరలిస్తుండగా గాంధీధామ్ ఓడరేవులో సీజ్ 11

ఎగుమతిదారుడు, బినామీ సుధాకర్ సహా ముగ్గురి అరెస్ట్

మూఢనమ్మకంతో బాలుడిని బలిచ్చారు!

యూపీలో ఓ ప్రైవేటు స్కూల్లో దుర్మార్గం

హాస్టల్ నుంచి కిడ్నాప్.. బడి వద్ద హత్య

స్కూలు బాగా నడవాలని ఈ దుశ్చర్య

యజమాని, డైరెక్టర్, ప్రిన్సిపల్, ఇద్దరు ఉపాధ్యాయుల అరెస్టు 14

స్టే ఉండగా ఎలా కూల్చుతారు?

జోక్యం చేసుకోవద్దని కోర్టు ఉత్తర్వులు ఉన్నా పట్టించుకోరా?



- ఆదివారం కూల్చొద్దని సుప్రీం చెప్పింది
- బాధితులకు అవకాశం ఇవ్వకపోవడం అక్రమం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్, అమీన్‌పూర్ తహసీల్దార్ హాజరై వివరణ ఇవ్వాలన్న హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలంటూ ఆగమేఘాల మీద భవనాలను కూల్చివేస్తున్న హైడ్రా తీరును హైకోర్టు తప్పుపట్టింది. ఏ అధికారంతో కూల్చివేస్తున్నారో చెప్పాలని హైడ్రా కమిషనర్‌ను ఆదేశించింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ భవనాన్ని ఎలా కూల్చారని నిలదీసింది. ఏ అధికారం, ఏ చట్టప్రకారం ఇళ్ల కూలివేతలు చేపడుతున్నారో చెప్పాలంటూ హైడ్రాకు ఆదేశాలు జారీచేసింది. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండగా, జోక్యం చేసుకోవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు ఉన్నప్పటికీ సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్ పంచాయతీ శ్రీకృష్ణ నగర్ ప్లాట్ నెంబర్ 92 (సర్వే నంబరు 165, 166)లో ఉన్న ఓ ప్రైవేట్ హాస్పిటల్ భవనాన్ని ఈ నెల 22న కూల్చివేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఆదివారం నాడు కూల్చివేతలు చేపట్టరాదని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినప్పటికీ బాధితులకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఉదయం 7.30 గంటలకు కూల్చివేతలు చేపట్టడం అక్రమమని పేర్కొంది. ఏ అధికారంతో ఇలా చేస్తున్నారో స్వయంగా వివరణ ఇవ్వాలని హైడ్రా కమిషనర్‌ను ఆదేశించింది. కమిషనర్ రంగనాథ్, అమీన్‌పూర్ తహసీల్దార్ ప్రత్యక్షంగా గానీ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గానీ ఈ నెల 30న హాజరు కావాలని ఆదేశాలు జారీచేసింది. అన్ని అనుమతులు పొంది, ఆస్తులు విక్రయించి, అప్పులు తెచ్చి హాస్పిటల్ కోసం ఐదంతస్తుల భవనాన్ని నిర్మించామని.. భూ ఆక్రమణ చట్టం-1905 కింద 48 గంటల నోటీసు ఇచ్చి 13 గంటల్లో భవనాన్ని కూల్చేశారని పేర్కొంటూ మహమ్మద్ రఫీ, ఎన్.వెంకటరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున జి.నరేందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 1985లో వేసిన లేఅవుట్‌లో రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా స్థలం కొని, అన్ని అనుమతులతో భవనం నిర్మించామని.. నాలుగు నెలల కిందే నూతన భవనంలో హాస్పిటల్ ప్రారంభించామని తెలిపారు. ఈ ఆస్తి విషయంలో జోక్యం చేసుకోరాదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు అమలులో ఉన్నాయన్నారు. అక్రమ నిర్మాణాలని పేర్కొంటున్న రెవెన్యూ అధికారులు సదరు భూముల్లో సర్వే చేయకుండా, హద్దులు గుర్తించకుండా కూల్చివేతలు చేపట్టినట్లు చెప్పారు. తహసీల్దార్ తప్పుడు తేదీతో నోటీసు సిద్ధం చేసి, కేవలం 48 గంటల ముందు అందజేశారని.. దానిపై వివరణ ఇచ్చినా పట్టించుకోకుండా కూల్చివేశారని వాపోయారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడానికి పరిహారం క్లెయిం చేసుకోవాలని పిటిషనర్‌కు సూచించింది. తహసీల్దార్ సూచన మేరకు పత్రాలేవీ పరిశీలించకుండానే హైడ్రా రంగంలోకి దిగడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. హైడ్రా ఏర్పాటు జీవోలో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధంగా హైడ్రా ఎలా ముందుకు వెళ్తుందని? అసలు ఏ అధికారంతో కూల్చివేతలు చేపడుతుందో చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు హైడ్రా కమిషనర్, తహసీల్దార్ హాజరుకావాలని పేర్కొంటూ విచారణను 30కి వాయిదా వేసింది.

మేము నిర్మిస్తే కాంగ్రెస్ కూల్చేస్తోంది: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ విధానం నిర్మాణాలయితే కాంగ్రెస్‌ది విధ్వంసమని, తాము నిర్మిస్తే వారు కూల్చేస్తున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షల సంఖ్యలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మిస్తే హైడ్రా పేరిట కాంగ్రెస్ సర్కారు ఇళ్లను కూల్చేస్తోందంటూ ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. హైదరాబాద్‌లో కేసీఆర్ నిర్మించిన లక్ష డబుల్ బెడ్రూమ్ ఇళ్లనే మూసీనది నిర్వాసితులకు మంజూరు చేస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. లక్ష ఇండ్లు రాత్రికిరాత్రే ఎక్కడ నుంచి పుట్టుకొచ్చాయని ప్రశ్నించారు.

లోకం తీరు



చేతికి చిక్కాయి తాళాలు!

- డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి మూసీ నిర్వాసితులు
- ఒకేరోజు 23 కుటుంబాలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు
- వారిని ఇళ్లకు తీసుకెళ్లి పట్టాలు, తాళాలు అందజేత
- మూసీ గర్భంలో ఇప్పటిదాకా 1134 ఇళ్లకు మార్కింగ్



మూసీలో నిర్వాసితురాలికి డబుల్ బెడ్‌రూం ఇంటి తాళం అప్పగిస్తున్న అధికారి

హైదరాబాద్ సిటీ, చాదర్‌ఘాట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'ఇక్కడ ఖాళీ చేసి.. డబుల్ బెడ్‌రూం ఇంట్లోకి వెళ్తారా?' అని ప్రశ్నిస్తే కొందరు ఓకే చెబుతున్నారు. ఆ వెంటనే అధికారులు చకచకా పని కానిచ్చేస్తున్నారు. నిర్వాసితులుగా మారిన వారిని వెంటనే ఎంపిక చేసిన డబుల్ బెడ్‌రూం టవర్స్ వద్దకు ఫ్లాట్ తాళాలు, పట్టా కాగితాలు చేతిలో పెడుతున్నారు. ఫలితంగా ఏళ్లుగా ఉన్న ఇల్లు పోయినా.. చక్కని గూడైతే దొరికిందన్న తృప్తి బాధితుల్లో కనిపిస్తోంది. మూసీ సుందరీకరణలో భాగంగా ఆ నది ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్లను పడగొట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని సర్కారు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన నిర్వాసితులకు అదే నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న రెండు పడకల ఇళ్లు కేటాయిస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు పునరావాసం కల్పించే చర్యల్లో భాగంగా అక్కడి ప్రజలను మలకపేట నియోజకవర్గంలోని పిల్లిగుడిసెలో ఉన్న డబుల్ బెడ్‌రూం భవన సముదాయంలోకి తరలించినట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. హిమాయత్‌నగర్ మండలంలోని శంకర్‌నగర్ కాలనీకి చెందిన ఫాతిమా బేగం, ఎండీ సాదిక్, రేష్మబేగం, ఫర్జానా బేగం, గౌసొద్దీన్, అబ్దుల్ రహ్మాన్ (6 కుటుంబాలు), వినాయక వీధిలోని నాజనీమ్ బేగం, నూర్జహాన్, అహ్మద్ ఖురేషి (3 కుటుంబాలు), నాంపల్లిలోని నాగమణి, మల్లమ్మ, టి.పార్వతీ భాయి, పి.ఎల్లమ్మ, సంగీత, సి.రాజు, ఈ.పాండు, సి.యాదయ్య, ఎం.పార్వతమ్మ, బాలనర్సమ్మ, ఎమ్.బి.నాగమణి (11 కుటుంబాలు) మొత్తం 20 కుటుంబాలను తరలించినట్లు తెలిపారు. మలకపేట నియోజకవర్గం సైదాబాద్ మండలంలోని పిల్లిగుడిసెలు డబుల్ బెడ్‌రూం భవనసముదాయంలోకి 12 కుటుంబాలను, నాంపల్లి ఆసిఫ్‌నగర్ జియాగూడకు 11 కుటుంబాలను తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. శుక్రవారం రాత్రి 9.30 గంటల వరకు 23 కుటుంబాలు తరలించినట్లు హైదరాబాద్ ఆర్డీఓ మహిపాల్ పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లకు వెళ్తున్న వారికే అక్కడే డబుల్ బెడ్‌రూం పట్టాలు అందచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా హైదరాబాద్ జిల్లా పరిధిలో మూసీ నది గర్భంలో 1595 నిర్మాణాలు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. అందులో గురు, శుక్రవారాల్లో కలిసి సుమారు 1134 ఇళ్లకు రివర్ బెడ్ (ఆర్‌బి-ఎక్స్) మార్కింగ్ చేశారు.

డబుల్ ఇళ్ల సమీపంలోనే విద్యార్థులకు ప్రవేశాలు

మూసీ ప్రక్షాళనలో భాగంగా చేపట్టే నిర్వాసిత కుటుంబాల్లో విద్యార్థులు ఉంటే వారి విద్యా సంవత్సరానికి అంతరాయం కలగకుండా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దానకిషోర్ తెలిపారు. మూసీ నిర్వాసితుల కుటుంబాలలో అంగన్వాడీ కేంద్రాలకు వెళ్ళే చిన్నారుల నుంచి కళాశాలలకు వెళ్లే విద్యార్థుల వరకూ వివరాలను గుర్తించేందుకు ఈ నెల 28 నుంచి 2 రోజుల పాటు సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి సచివాలయంలో విద్యాశాఖ, సంక్షేమశాఖల అధికారులతో దానకిషోర్ సమావేశం నిర్వహించారు. ఎడ్యుకేషన్ డిస్టర్బ్ కాకుండా విద్యార్థులను వారికి కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ సముదాయల దగ్గరలోని స్కూళ్లలో విద్యార్థులను చేర్పించేలా మ్యాపింగ్ చేపట్టాలన్నారు.

మా ఇళ్లు కూల్చొద్దు.. గో బ్యాక్!

మూసీ పరీవాహక ప్రాంతాల్లో బాధితుల ఆందోళనలు, ధర్నాలు.. చైతన్యపురి డివిజన్, లంగర్‌హౌస్ పరిధిలో మార్కింగ్‌ను అడ్డుకున్న వైనం

దిల్‌సుఖ్‌నగర్, నార్సింగ్ సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మూసీ సుందరీకరణలో భాగంగా నది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న నివాసాలను కూల్చివేయాలని సర్కారు నిర్ణయించడం, ఆ ఇళ్లకు మార్కింగ్ చేస్తుండటంతో బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సర్వే కోసం, మార్కింగ్ కోసం వస్తున్న అధికారులను ఎక్కడికక్కడ బాధితులు అడ్డుకుంటున్నారు. 'మా ఇళ్లు కూల్చొద్దు.. గో బ్యాక్' అంటూ ధర్నాలు చేస్తున్నారు. శుక్రవారం మూసీ పరీవాహక ప్రాంతాల్లో మార్కింగ్ చేసేందుకు వచ్చిన అధికారులను బాధితులు అడ్డుకున్నారు. చైతన్యపురి డివిజన్ మూసీ పరీవాహక ప్రాంతంలోని వినాయకనగర్ కాలనీ, న్యూ మారుతినగర్, ఫణిగిరి కాలనీ, లక్ష్మీనర్సింహా కాలనీ, ఇందిరానగర్, గణేశ్‌పురి, ద్వారకాపురం, భవానీనగర్, సత్యనగర్, వెంకటసాయినగర్‌లో శుక్రవారం కూడా జీహెచ్‌ఎంసీ, ఆర్‌అండ్‌బీ, హౌజింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు సర్వే, మార్కింగ్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులకు, అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం తలెత్తింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నటువంటి ప్రతి ఇంటి వద్దకు వెళ్లి అధికారులు సర్వే చేయడంతోపాటు, మార్కింగ్ పనులు చేపట్టారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు వెళ్లేందుకు ఆసక్తి ఉందా? లేదా? అని ప్రశ్నించి ఆ వివరాలను కూడ నమోదు చేశారు. ఆసక్తి ఉన్నవారిని వెంటనే అక్కడకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆసక్తిలేని వారు తమకు ఇష్టం లేదని చెప్పడంతో రెవెన్యూ అధికారులు వారి కళ్లముందే ఆ సర్వే దరఖాస్తులో ఆసక్తిలేదు (నాట్ విల్లింగ్) అని నమోదు చేశారు. మూసీ పరీవాహక ప్రాంతాలను సందర్శించేందుకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక కార్పొరేటర్‌లు రంగా నర్సింహాగుప్తా, పవన్‌లతో కలిసి ఆయా కాలనీలలో పర్యటించారు. అన్ని కాలనీల్లో పర్యటించిన అనంతరం ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈటల రాజేందర్ న్యూ మారుతినగర్ కాలనీలో రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. కార్పొరేటర్ రంగా నర్సింహాగుప్తా వెంటనే తన అనుచరులతో కలిసి మార్కింగ్ చేస్తున్న స్థలం వద్దకు వెళ్లి 'గో బ్యాక్... గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో గండిమైసమ్మ తహసీల్దార్ మతీన్, కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తాల మధ్య తీవ్రవాగ్వివాదం నెలకొంది. నివాసితులను ఎందుకు బెదిరిస్తున్నారని నర్సింహాగుప్తా నిలదీయడంతో తోపులాట జరిగింది. ఆ తోపులాటలో ఆయన చొక్కా చిరిగింది. ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. కాగా లంగర్‌హౌస్ మూసీ పరీవాహక ప్రాంతాల్లో కార్వాన్ కేసరి హనుమాన్ పరీవాహక ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు ఎఫ్‌టీఎల్ హద్దులను గుర్తించారు. ఈ సందర్భంగా బాధితుల ఆందోళనతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. లంగర్‌హౌజ్ రింగ్‌రోడ్డు ప్రధాన రహదారి, కేసరి హనుమాన్ ప్రధాన రహదారిని స్థానికులు దిగ్బంధించారు. బాధితులు సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మూసీ పరివాహక ప్రాంతంలో నిర్వాసితులకు అండగా ఉంటానని ఉదయం నుంచి రోడ్డుపై బైఠాయించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఎట్టకేలకు శాంతించారు. ఈ రాత్రంతా ఫణిగిరి కాలనీ సాయిబాబా దేవాలయంలో బస చేసేందుకు ఈటల సన్నద్ధమవగా, పోలీసులు అప్రమత్తమయ్యారు. రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్‌కు ఫోన్‌చేసి నచ్చజెప్పడంతో ఆలయంలో కూర్చున్న ఆయన అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపోయారు.



ఒంటిపై శానిటైజర్ పోసుకొన్న బాధితుడిపై నీళ్లు చల్లుతున్న సీఐ వెంకటేశ్వర్లు

శానిటైజర్ పోసుకుని ఆత్మహత్యాయత్నం

చైతన్యపురి పరిధిలో అధికారులు ఇళ్లకు మార్కింగ్ చేస్తుండగా ఆందోళనకు గురైన ఓ ఇంటి యజమాని ఇంట్లో ఉన్న శానిటైజర్ ఒంటిపై పోసుకుని ఆత్మహత్యయత్నం చేశాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అతడిని అడ్డుకుని ఒంటిపై నీరు చల్లారు. ఇంటిని కూల్చివేయరని, ఎలాంటి ఆందోళన చెందొద్దని అతడిని నచ్చజెప్పారు.

లోన్ తీసుకుని మూడేళ్లు కూడ కాలేదు

తల్లిదండ్రులు సీనియర్ సిటిజన్‌లు, తమ కుటుంబమంతా కష్టపడి కూడబెట్టిన డబ్బుతో స్థలం కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్నాం. ఇంటికి డబ్బు చాలకపోవడంతో ఎస్బీఐ బ్యాంక్‌లో లోన్ తీసుకుని ఇంటిని నిర్మించుకున్నాం. లోన్ తీసుకుని మూడేళ్లు కూడ కాలేదు, ఇప్పుడు మా ఇంటిని కూల్చివేస్తే మా కుటుంబం రోడ్డున పడుతుంది. ఇంట్లోంచి వెళ్లగొట్టే బదులు మా కుటుంబ సభ్యులందరికీ కాస్త విషం ఇవ్వండి.

- ఘంటసాల చిరంజీవి, న్యూ మారుతినగర్.

రివర్ బెడ్ మేరకే మార్కింగ్

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని చైతన్యపురి డివిజన్, కొత్తపేట డివిజన్‌ల మూసీపరీవాహక ప్రాంతాల్లో శుక్రవారం కూడ ఇళ్ల మార్కింగ్ ప్రక్రియ చేపట్టారు. ఆందోళనల నేపథ్యంలో మధ్యాహ్నం వరకు మాత్రమే మార్కింగ్, సర్వే ప్రక్రియ చేపట్టారు. అయితే చైతన్యపురి, కొత్తపేట రెండు డివిజన్‌ల పరిధిలోని వినాయకనగర్ కాలనీ, న్యూ మారుతినగర్, ఫణిగిరి కాలనీ, లక్ష్మీనర్సింహా కాలనీ, ఇందిరానగర్, గణేష్‌పురి కాలనీ, ద్వారకాపురం, భవానీనగర్, సత్యనగర్, వెంకటసాయినగర్ కాలనీలోని పలు ఇళ్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించినట్లు అధికారులు ఇప్పటికే గుర్తించారు. ప్రస్తుతం రివర్ బెడ్ మేరకు మాత్రమే ఇళ్లకు మార్కింగ్ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. బఫర్‌జోన్‌లోని నిర్మాణాల జోలికి వెళ్లడం లేదన్నారు. శుక్రవారం సుమారు 180 ఇళ్లకు మార్కింగ్ చేశారు. రివర్ బెడ్ పరిధిలో మరో 50, 60 ఇళ్లు మాత్రమే ఉండొచ్చని తెలుస్తోంది.



చైతన్యపురి పరిధిలో తోపులాట సందర్భంగా సొమ్మసిల్లి పడిపోయిన మహిళను పక్కకు తీసుకెళుతున్న దృశ్యం

అర్హులకు పథకాలు.. ఉపాధికి ప్రణాళికలు

- మూసీ ప్రక్షాళనలో నిర్వాసితులకు ప్రభుత్వం పూర్తి అండ
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లకు అనుసంధానం
- సుందరీకరణకు ఎన్జీవోలు సహకరించాలి: ఎండీ దానకిశోర్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రక్షాళనలో నిర్వాసితులయ్యే కుటుంబాలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ దానకిశోర్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని ఎన్ఐయూఎంలో మూసీ పౌర సంస్థల ప్రతినిధులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. ఎన్జీవోల సూచనలు స్వీకరించారు. స్వయం సహాయక సంఘాలు మహిళలపై ప్రధానంగా దృష్టి పెడతాయని చెప్పారు. సెర్ప్ మేనేజర్ దివ్య, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్, ఎంఆర్‌డీసీఎల్ జాయింట్ ఎండీ గౌతమి సభ్యులుగా ఉన్న కమిటీ మహిళా శక్తి పేరుతో మెప్మా సభ్యుకు బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు అందేలా చూస్తుందన్నారు. ఉపాధి, శిక్షణ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఇష్టమైన వృత్తిని చేపట్టేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. ప్రతి నిర్వాసిత కుటుంబం జీవనోపాధిపై సర్వే జరుగుతోందని, కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే బఫర్ జోన్‌లో నిర్మాణాలపై సర్వే, మార్కింగ్ చేపడతామన్నారు. పట్టా ఉంటే చట్టప్రకారం అన్ని ప్రయోజనాలను అందించాకే నిర్మాణాలను తొలగిస్తామని చెప్పారు. నదీ గర్భంలో కూడా కొందరికి పట్టాలున్నాయని.. వారు పట్టాలను సంబంధిత జిల్లా కలెక్టర్‌కు ఇస్తే, అర్హులైతే పరిహారం అందజేస్తామన్నారు. నిర్వాసిత విద్యార్థులు చదువు దెబ్బతినకుండా డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలో ఉన్న పాఠశాలల్లో, ఆసక్తి ఉన్నవారిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో చేర్పిస్తామని చెప్పారు. పునరావాసం సజావుగా జరిగేలా ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. నిర్వాసిత కుటుంబాలను చైతన్యం చేయాలని ఎన్జీవోలను కోరారు. శంకరన్ స్ఫూర్తితో ఎన్‌జీవోలను, నిర్వాసిత కుటుంబాలతో చర్చించి వారి తరలింపు, పునరావాస కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ భవిష్యత్తును కాపాడాలంటే మూసీని పునరుద్ధరించాల్సిందేనని, మేధా పాట్కర్ సహా అనేకమంది సామాజిక కార్యకర్తలు సేవ్ మూసీ పేరుతో కార్యక్రమాలను నిర్వహించారని గుర్తుచేశారు.

హైడ్రాతో వ్యతిరేకత?

(మొదటిపేజీ తరువాయి)

సానుకూల స్పందన ఉందన్నమాట నిజమే అయినా.. అదే అందరి అభిప్రాయం కాదని చెప్పినట్లు సమాచారం. "హైడ్రాపై ప్రజల్లో సానుకూల స్పందన ఉంది. అయితే ఇటీవలికాలంలో అది వ్యవహరించిన తీరుతో వ్యతిరేకత పెరుగుతోంది. దూకుడు ఉండాలి కానీ.. మధ్యతరగతి ప్రజలపై, పేదలపై ప్రతాపం చూపించకూడదు. ఆ విషయాన్ని హైడ్రా గుర్తించాలి. నష్టనివారణ చర్యలు చేపట్టాలి" అన్న భావన ప్రభుత్వానికి అందిన నివేదికలో వ్యక్తమైనట్లు తెలిసింది.

పొరపాట్లతో సమస్యలు..

హైడ్రా కార్యకలాపాలు సరైన రీతిలో జరగకపోతే ఆ ప్రభావం రాష్ట్రం మొత్తమ్మీదా పడుతుందని పేర్కొన్నట్లు తెలుస్తోంది. హైడ్రా కూల్చివేతల సందర్భంగా కొన్నిసార్లు జరుగుతున్న పొరపాట్లు, తొందరపాట్లు చట్టపరమైన సమస్యలను తెచ్చిపెట్టే ప్రమాదముందని హెచ్చరించినట్లు సమాచారం. "ఎఫ్‌టీఎల్‌లో అనధికార నిర్మాణాలు తీవ్రమైన సమస్యే అయినప్పటికీ.. వాటి యజమానులు చట్టబద్ధమైన అనుమతులు కలిగి ఉన్న విషయాన్ని మర్చిపోకూడదు. ఇలాంటి విషయాలపై సరైన విధివిధానాలను సిద్ధం చేసుకోకుండా కూల్చివేతలు చేపట్టడం సమంజసం కాదు. చర్యలు తీసుకునే ముందు పూర్తి వివరాలను సమగ్రంగా పరిశీలించాలి. పేదలు, దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి వర్గాలపై దూకుడు ప్రదర్శించవద్దు. జీహెచ్‌ఎంసీ, స్థానిక సంస్థలు, హెచ్ ఎండీఏ విభాగాలు ఇచ్చిన అనుమతులను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అనుమతుల అనంతరం నిర్మాణాల్లో ఏమైనా తప్పులు దొర్లి ఉంటే.. వాటిని తొలుత గుర్తించి ఆ అనుమతుల్ని రద్దు చేసిన తర్వాతే చర్యలు తీసుకోవాలి" అంటూ పలు నివేదికలు ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది.

తగిన వ్యవధిలో నోటీసులివ్వాలి..

చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలపై చర్యలు తీసుకోవటానికి ముందు తగిన వ్యవధిలో నోటీసులు జారీ చేయాలని, దీంతోపాటు బాధితుల వివరణ కూడా తీసుకున్నాకే కూల్చివేతలపై నిర్ణయానికి రావాలనే అభిప్రాయాన్ని నివేదికలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రభుత్వ భూములు, ప్రభుత్వ పరిధిలోని ఖాళీ స్థలాల్లో ఏమైనా ఆక్రమణలు ఉంటే మాత్రం నోటీసుల అవసరం లేకుండానే హైడ్రా చర్యలు తీసుకోవటం తప్పేం కాదన్న సూచన ఇచ్చినట్లుగా తెలుస్తోంది. చెరువుల ఎఫ్‌టీఎల్ ఎంత అనే దానిని హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీలతో సమన్వయం చేసుకొని నిర్ధారించాలనే సూచన ఇచ్చినట్లు తెలిసింది. సరిహద్దుల లెక్క తేల్చిన తర్వాత నోటీసులిచ్చి ఎఫ్‌టీఎల్‌లోని అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని చెప్పినట్లు సమాచారం. ఇక హైడ్రా కూల్చివేతలపై వస్తున్న విమర్శల్లో ప్రధానమైనది.. రియల్ ఎస్టేట్ సంస్థలు చేసిన తప్పులకు కొనుగోలుదారులు బలి అవుతున్నారన్న అంశం. దీనిపై ప్రభుత్వం ఎందుకు ఆలోచించటం లేదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇదే అంశాన్ని పలు విభాగాల వారు ప్రస్తావించినట్లు సమాచారం. నిర్మాణం పూర్తయి.. ఇప్పటికే యజమానుల అధీనంలోకి వెళ్లిన భవనాలపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని వారు సూచించినట్లు తెలిసింది. భవనాలను కొన్నవారి ఆందోళనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని చెప్పినట్లు సమాచారం. బ్యాంకుల్లో రుణాలు పొంది కొనుగోలు చేసిన భవనాలను కూల్చివేస్తే.. యజమానులు ఆ రుణాలను ఎలా చెల్లించాలి? బ్యాంకులు ఎలా రాబట్టుకుంటాయి? అన్న ప్రశ్న కూడా ఉత్పన్నమవుతుందని పేర్కొన్నట్లు తెలిసిదిఇ.

సోషల్ మీడియాపై మరింత ఫోకస్..

హైడ్రా చర్యలు ప్రారంభించిన మొదట్లో సోషల్ మీడియా నుంచి సానుకూల స్పందన వచ్చింది. కూల్చివేతల్ని స్వాగతిస్తూ ప్రభుత్వ చర్యలను అభినందిస్తున్నట్లుగా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే తర్వాతి కాలంలో చోటుచేసుకున్న కూల్చివేతలతో సోషల్ మీడియా వైఖరి మారింది. ఇటీవల కాలంలో హైడ్రా కూల్చివేతలపై పెద్ద ఎత్తున వ్యతిరేక వాదనలు వినిపిస్తున్నాయి. పలువురు హైడ్రా తీరును ప్రశ్నిస్తున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి. బాధితుల ఆక్రందనలు, ఆవేదనలు, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న తీరు.. అంతకంతకూ ఎక్కువవుతోంది. ఇదే విషయాన్ని పలు నివేదికలు ప్రస్తావించినట్లు సమాచారం. ఈ వ్యతిరేక ప్రచారానికి దీటుగా ప్రభుత్వం తన వాదనను బలంగా వినిపించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పినట్లుగా తెలుస్తోంది. హైడ్రా చర్యలు తీసుకునే ప్రాంతాలకు అనుగుణంగా ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేయాల్సిన ఉంటుందన్న సూచన చేసినట్లు సమాచారం.

మూసీ అభివృద్ధిపై విషప్రచారమా..?

- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని సహించబోం..: పొన్నం

హైదరాబాద్/బేగంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మురికికూపంగా మారిన మూసీని అభివృద్ధి చేసి పూర్వవైభవం తేవాలని చూస్తుంటే కొన్ని శక్తులు విషప్రచారాలు చేస్తున్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. సోషల్ మీడియా ద్వారా లేనిపోని తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిని ఉపేక్షించొద్దని.. కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సీపీని ఆదేశించారు. శుక్రవారం సచివాలయం మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. మూసీలో అక్రమ కట్టడాలున్నాయని గత బీఆర్ఎస్ సర్కారు కూడా ఒప్పుకుందని.. మూసీ నిర్వాసితులకు పది వేల డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని స్వయంగా మాజీ మంత్రి కేటీఆరే చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు తాము అదే పని చేస్తుంటే పేదలకు అన్యాయం చేసినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. మూసీ పరీవాహకంలో ఇళ్లు కట్టుకున్న వారికి తాము తగిన పరిహారం ఇచ్చి ఖాళీ చేయిస్తామన్నారు. 'మా పాలనలో లోపాలుంటే మంత్రులు, అధికారులకు ఎత్తి చూపవచ్చు. లేదంటే ధర్నాచౌక్‌లో ఆందోళన చేయండి.. కానీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదు' అని హెచ్చరించారు. అంతకుముందు సచివాలయంలోని తన చాంబర్‌లో పొన్నం.. కరీంనగర్ స్మార్ట్ సిటీ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులు మందకొడిగా సాగుతుండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వేగంగా పనులు పూర్తి చేయాలని.. అవినీతికి ఆస్కారం లేకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు.

ప్రజాభవన్‌లో 'ప్రవాసీ ప్రజావాణి'..

గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ సర్కారు చిత్తశుద్ధితో పని చేస్తోందని పొన్నం అన్నారు. ప్రజాభవన్‌లో గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన 'ప్రవాసీ ప్రజావాణి' కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో కార్మికులు గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రవాసీ ప్రజావాణి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో రసాభాస

» చేర్యాలలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల నినాదాలు

» మంత్రి సురేఖ ప్రసంగిస్తుండగానే ఇరువర్గాల తోపులాట

చేర్యాల, సెప్టెంబరు 27: చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కుల పంపిణీలో రసాభాస జరిగింది. మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేసేందుకు శుక్రవారం సిద్దిపేట జిల్లా చేర్యాలలో నిర్వహించిన కార్యక్రమం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య గొడవకు కారణమైంది. ఇప్పటికే జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మధ్య ప్రోటోకాల్ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తుగానే భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. లబ్ధిదారులను మాత్రమే లోపలికి అనుమతించారు. దీనిపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో వారిని అనుమతించారు. తర్వాత కాంగ్రెస్ కార్యకర్తలు సభకు వచ్చారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులను పలకరిస్తున్న క్రమంలో 'జై కాంగ్రెస్, జై కొమ్మూరి' అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ వర్గీయులు సైతం 'జై పల్లా.. జైజై బీఆర్ఎస్' అంటూ నినాదాలు చేశారు. ఇదే సమయంలో మంత్రి వచ్చారు. సభలో ఎమ్మెల్యే ప్రసంగిస్తుండగా ఇరువర్గాలు పోటాపోటీ నినాదాలు చేశారు. మంత్రి సురేఖ కల్పించుకొని సంయమనం పాటించాలన్నారు. గొడవ సద్దుమణిగిందనుకుంటున్న సమయంలో బీఆర్ఎస్ నాయకులు కల్యాణలక్ష్మిలో ప్రకటించిన తులం బంగారం ఎప్పుడిస్తారంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రతిగా కాంగ్రెస్ వారు నినాదాలు చేస్తూ కుర్చీలు లేపి.. బీఆర్ఎస్ నాయకుల వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడుకున్నారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. గొడవ ముదురుతుండటంతో మంత్రి సురేఖ ప్రసంగం ముగించి, చెక్కుల పంపిణీని ప్రారంభించి వెళ్లిపోయారు.



తులం బంగారంపై ప్లకార్డులు చూపుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

పెద్ద వెంచర్లన్నీ పెండింగ్‌లోనే!

(మొదటి పేజీ తరువాయి)

కూడా హైదరాబాద్‌లో భారీ నిర్మాణ, లేఅవుట్ ప్రాజెక్టులు చేపడుతున్నాయంటే కారణం అదే. గత ప్రభుత్వ హయాంలో హెచ్ఎండీఏ నిబంధనలను ఉల్లంఘిస్తూ అనుమతులిచ్చారనే ఆరోపణల నేపథ్యంలో హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ అధికారులు వరుసగా సోదాలు జరిపారు. విజిలెన్స్ అధికారులు కీలక దస్త్రాలను పరిశీలించారు. దీంతో పలు అక్రమాలు వెలుగులోకి వచ్చినట్టు సమాచారం. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో భవన నిర్మాణ, లేఅవుట్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లకు సంబంధించిన 1012దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 788 దరఖాస్తులు టీజీబీపాస్‌లో వచ్చినవి కాగా 288 అప్లికేషన్లు హెచ్ఎండీఏ డీపీఎంఎస్ ద్వారా వచ్చినవి. వీటికి సంబంధించి అత్యధిక ఫైళ్లు ఉన్నతస్థాయి అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. డీపీఎంఎస్‌లో ఓపెన్ లేఔట్ డ్రాఫ్ట్, ఫైనల్ లేఅవుట్ దస్త్రాలు 87పెండింగ్‌లో ఉండగా.. అందులో 26 వరకూ హెచ్ఎండీఏ కమిషనర్ వద్దే కదలకుండా ఉన్నాయి. పది రోజుల నుంచి 81 రోజుల దాకా పెండింగ్‌లో ఉన్నాయి. ఇక టీజీబీపాస్‌లో 21 రోజులు దాటిన దరఖాస్తులు 525 వరకు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

బీవీఆర్ఐటీ బస్సులు ఢీ

» ఒక బస్సు డ్రైవర్ మృతి

» 20 మంది విద్యార్థులకు గాయాలు



డ్రైవర్ నాగరాజు

నర్సాపూర్, సెప్టెంబరు 27 : మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ బస్సు డ్రైవర్ మృతి చెందగా మరో డ్రైవర్‌తో పాటు 20 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రోడ్డుపై పట్టణ సమీపంలోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో చోటు చేసుకుంది. ఒక బస్సు హైదరాబాద్ నుంచి కళాశాలకు విద్యార్థులతో వెళ్తుండగా, మరో బస్సు విద్యార్థులను తీసుకురావడానికి నర్సాపూర్‌కు వస్తోంది. ఈ క్రమంలో పట్టణ సమీపంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద కళాశాలకు వెళ్తున్న బస్సు ముందు ఉన్న ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న బస్సును బలంగా ఢీకొంది. దీంతో ఓ బస్సు డ్రైవర్ నాగరాజు(50) బస్సులో ఇరుక్కుని తీవ్రంగా గాయపడగా స్థానికులు బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. మరో బస్సు డ్రైవర్‌తో పాటు గాయపడిన విద్యార్థులను అంబులెన్స్‌లలో కళాశాల ఆసుపత్రితో పాటు నర్సాపూర్, సంగారెడ్డి సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. కొందరిని హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు తరలించారు. బస్సులో 40 మంది విద్యార్థులు ఉండగా 20 మందికి గాయాలయ్యాయి. చనిపోయిన డ్రైవర్ నాగరాజు భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రధాన రోడ్డుపై ఈ ప్రమాదం జరగడంతో నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం తమ సిబ్బందితో వచ్చి క్రేన్ ద్వారా రెండు బస్సులను పక్కకు తీయించి ట్రాఫిక్ చక్కదిద్దారు.

మంత్రి పొంగులేటి ఇంట్లో ఈడీ సోదాలు!

కుమారుడు హర్షరెడ్డికి చెందిన 'రాఘవ గ్రూప్' ఆఫీసుల్లోనూ తనిఖీలు

హైదరాబాద్/నార్సింగ్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోదాలు నిర్వహించారు. రాష్ట్ర పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఢిల్లీ నుంచి వచ్చిన 15 ఈడీ బృందాలు.. జూబ్లీహిల్స్‌లోని పొంగులేటి నివాసంతో పాటు కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో సోదాలు జరిపాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి రాత్రి పొద్దుపోయే వరకు సోదాలు కొనసాగాయి. సీఆర్‌పీఎఫ్ భద్రత నడుమ ఈడీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. పొంగులేటి కుమారుడు హర్షరెడ్డికి సంబంధించిన రాఘవ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు చేశారు. రాఘవ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌తోపాటు పొంగులేటి కుటుంబ సభ్యులకు చెందిన సంస్థల ఆర్థిక లావాదేవీలపైనా ఆరా తీశారు. హర్షరెడ్డి ఆడిటర్ నుంచి ఈడీ అధికారులు వివరాలు సేకరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన ఫాంహౌస్‌లో కూడా ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. సైబరాబాద్ పోలీసులు ఫాంహౌస్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మీడియాను, ఇతరులను ఆ దరిదాపుల్లోకి రానివ్వలేదు.

ఈ సోదాలు ఎందుకంటే..

హాంకాంగ్‌లో నివాసం ఉండే మహ్మద్ ఫహెర్దీన్ ముబీన్ గత ఫిబ్రవరి 5న సింగపూర్ నుంచి చెన్నైకి వచ్చాడు. అతని వద్ద కస్టమ్స్ అధికారులు విదేశాలకు చెందిన పాటెక్ ఫిలిప్పె 5740, బ్రెగుయెట్ 2759 బ్రాండ్స్‌కు చెందిన రెండు విలాసవంతమైన గడియారాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ చేతి గడియారాల విలువ రూ.1.73 కోట్లుగా నిర్ధారించారు. మహ్మద్ ఫహెర్దీన్ ముబీన్‌ను కస్టమ్స్ అధికారులు విచారించగా మధ్యవర్తి నవీన్‌కుమార్ పేరు వెల్లడించాడు. నవీన్‌కుమార్ ద్వారా పొంగులేటి కుమారుడు హర్షరెడ్డికి రూ.7 కోట్లు విలువ చేసే ఏడు లగ్జరీ వాచీలు చేరినట్లు ప్రాథమికంగా గుర్తించారు. వాటికి క్రిప్టో కరెన్సీ, హవాలా రూపంలో మనీ లాండరింగ్ జరిగినట్లు కస్టమ్స్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు గుర్తించారు. విచారణలో భాగంగా మార్చి 28న చెన్నై కస్టమ్స్ అధికారులు హర్షరెడ్డికి నోటీసులు జారీ చేశారు. మనీలాండరింగ్ వ్యవహారం కావడంతో డీఆర్ఐ అధికారులు ఈడీకి సమాచారం ఇచ్చారు. కస్టమ్స్, డీఆర్ఐ నమోదు చేసిన కేసుల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ జరుపుతోంది. తాజా సోదాల్లో పలు కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలు, పెద్ద మొత్తంలో లెక్కల్లో చూపని నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న రికార్డులను పరిశీలించిన తర్వాత ఈడీ అధికారులు తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

రోజువారీ పనుల్లో మంత్రి..

శుక్రవారం తెల్లవారుజాము నుంచి మంత్రి పొంగులేటి ఇంట్లో ఈడీ సోదాలు చేపట్టాయి. అయినప్పటికీ మంత్రి, యథావిధిగా తన రోజువారీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈడీ సోదాల సమయంలో పలువురు రాజకీయ ప్రముఖులు మంత్రి నివాసానికి చేరుకున్నారు.

ఈడీ దాడులు కక్ష పూరితమే: మహేశ్‌కుమార్ గౌడ్

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో ఈడీ దాడులు రాజకీయ కక్ష పూరిత చర్యల్లో భాగమేనని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల లోపాయికారీ ఒప్పందంలో భాగంగా ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. 2014 నుంచి ఇప్పటి దాకా ఈడీ చేసిన దాడుల్లో 96 శాతానికి పైగా ప్రతిపక్ష నేతల మీదే జరిగాయని చెప్పారు. ప్రత్యర్థులను భయపెట్టేందుకు బీజేపీ.. కేంద్ర దర్యాప్తు సంస్థలను వాడుకుంటోందన్నారు. హైడ్రా ఆపరేషన్లలో నష్టపోతున్న పేద ప్రజల్ని తమ ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. బడాబాబులు, రియల్టర్లు ఆక్రమించిన ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకే హైడ్రా ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సిద్ధూపై లోకాయుక్తలో కేసు

ముడా ఇంటి స్థలాల వివాదంలో ఆయననే ఏ1

» ఏ2గా భార్య పార్వతి, ఏ3గా బావమరిది మల్లికార్జున

» ఈ రోజు సిద్దరామయ్య సీఎం.. రేపు ఉండకపోవచ్చు : ఖర్గే



బెంగళూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ముడా ఇంటిస్థలాల వివాదంపై విచారణ జరిపేందుకు హైకోర్టు, ప్రజా ప్రతినిధుల కోర్టులు అనుమతులు ఇవ్వడంతో మైసూరు లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సీఎం సిద్దరామయ్యను ఏ1గాను, ఆయన భార్య పార్వతి ఏ2గాను, బావమరిది మల్లికార్జున ఏ3గాను, భూయజమాని దేవరాజు ఏ4గానూ చేర్చారు. ఏ5గా ఇతరులను పేర్కొన్నారు. సీఆర్‌పీసీ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. అందుకు అనుగుణంగానే ఐపీసీ, అవినీతి నియంత్రణ చట్టం, బినామీ ఆస్తుల లావాదేవీలు, భూ ఆక్రమణల నిర్బంధ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐపీసీ 120బి, 166, 403, 420, 426, 465, 468, 340, 351 సెక్షన్ల కింద, అవినీతి నియంత్రణ చట్టం 1988 నిబంధనలకు అనుగుణంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సీఎంపై ఎఫ్ఐఆర్ నమోదు విషయంలో మైసూరు లోకాయుక్త ఎస్పీ ఆచితూచి వ్యవహరించారు. భారతీయ న్యాయ సంహిత లేదా సీఆర్‌పీసీల కింద నమోదు, కోర్టు నిబంధనలు... వంటి అంశాలపై లోకాయుక్త ఉన్నతాధికారులతో చర్చించేందుకు గురువారం బెంగళూరుకు వచ్చారు. సమగ్ర చర్చల అనంతరం శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మూడు రోజుల మైసూరు పర్యటనకు శుక్రవారం సీఎం సిద్దరామయ్య వెళ్లిన సమయంలోనే ఎఫ్ఐఆర్ నమోదైంది. లోకాయుక్త అధికారులు దర్యాప్తు ఎప్పుడు ప్రారంభిస్తారనేది తెలియాల్సి ఉంది. మరోవైపు 'సిద్దరామయ్య ఈ రోజు సీఎంగా ఉన్నారు.. రేపు ఉండకపోవచ్చు..! ఆయనపై వ్యక్తిగతమైన ఆరోపణలు వచ్చినా బీజేపీ ఏకంగా కాంగ్రెస్‌పార్టీని డ్యామేజ్ చేసే ప్రయత్నం చేస్తోంది' అని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే మండిపడ్డారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం ఎవరైనా పార్టీ ప్రతిష్ఠ ముఖ్యమన్నారు. పార్టీ ముందు ఎవరూ గొప్ప కాదని అన్నారు. సిద్దరామయ్యపై లోకాయుక్త విచారణకు సంబంధించి మాట్లాడుతూ గోధ్రా సంఘటన జరిగినప్పుడు నరేంద్రమోదీ సీఎం పదవికి రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. ముడా వివాదంలో చట్టపరంగా పోరాటం చేస్తామని అన్నారు. సిద్దరామయ్యకు పార్టీ అధిష్ఠానం మద్దతు ఎప్పుడూ ఉంటుందని, ఆయన పార్టీ ప్రతినిధి అని స్పష్టం చేశారు. కాగా, రాష్ట్రంలో నేరుగా సీబీఐ విచారణకు అనుమతి రద్దు చేయడం కొత్తేమీ కాదని, దేవరాజ్ సీఎంగా ఉన్నప్పుడు కూడా చేశారని అన్నారు. మరోవైపు, ముడా భూ కుంభకోణం నేపథ్యంలో కర్ణాటకలో కేసుల విచారణకు సీబీఐకి అనుమతి ఉపసంహరించుకుంటూ ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తప్పుపట్టింది. ఇది 'ప్రొఫెషనల్ దొంగ, ఓ అవినీతి పార్టీ' తీసుకున్న నిర్ణయమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా అభివర్ణించారు. 5 వేల కోట్ల ముడా స్కామ్‌లో సీఎం సిద్దరామయ్య సీబీఐ విచారణ నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు.

ఖర్గే కుటుంబంపై లోకాయుక్తకు ఫిర్యాదు

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కుటుంబం బెంగళూరులోని రెండు ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకుందని బీజేపీ నేత ఎన్ఆర్ రమేశ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. భూముల రికార్డులతో లోకాయుక్త ఐజీపీ సుబ్రమణ్యేశ్వరరావుకు శుక్రవారం ఈ ఫిర్యాదు చేశారు. ఖర్గే, ఆయన కుటుంబ సభ్యుల నేతృత్వంలోని సిద్ధార్థ విహార ట్రస్టు పేరిట భారీ భూకుంభకోణానికి పాల్పడ్డారని అందులో పేర్కొన్నారు. *2014లో బీటీఎం లే అవుట్ 4వ స్టేజ్‌లో 8002 చదరపు మీటర్ల (86,133 చదరపు అడుగులు) విస్తీర్ణంగల నివాస స్థలాన్ని విద్యాసంస్థ అవసరాల పేరిట బీడీఏ నుంచి 30 ఏళ్ల సిద్ధార్థ విహార ట్రస్టు సంస్థ లీజుకు పొందిందని అన్నారు. ఈ విషయాన్ని ప్రస్తావించకుండా, 2024 మార్చిలో యలహంక వద్ద ఉండే హైటెక్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ పార్క్, హార్డ్‌వేర్ పార్క్‌లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో నివాసస్థలాన్ని మంజూరు చేయించుకోవడం ద్వారా న్యాయ ఉల్లంఘనకు పాల్పడ్డారని అన్నారు.*

విద్యార్థుల కోసం 'తెలంగాణ దర్శిని'

» వారసత్వ చరిత్రపై అవగాహన కోసం ప్రత్యేక టూర్ ప్యాకేజీ

» లక్ష మంది విద్యార్థుల కోసం ప్రణాళిక: పర్యాటక శాఖ

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంస్కృతిక, చారిత్రక వారసత్వంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా 'తెలంగాణ దర్శిని' పర్యాటక ప్యాకేజీకి రూపకల్పన చేసింది. స్థానికంగా ఉన్న కోటలు, గడీలు, పురాతన ఆలయాలను ఉచితంగా సందర్శించడానికి, వాటి ప్రాశస్త్యాన్ని విద్యార్థులు తెలుసుకునేందుకు ప్రభుత్వం నూతన పథకాన్ని తీసుకువచ్చింది. 'తెలంగాణ దర్శిని'లో లక్ష మంది విద్యార్థులకు భాగస్వామ్యం కల్పించాలని పర్యాటక శాఖ నిర్ణయించింది. ఈ పథకం ద్వారా పర్యాటక రంగాన్ని ప్రోత్సహించి స్థానిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. దీని కోసం రూ.12.10 కోట్ల ఖర్చు చేయనున్నారు. విద్యా ప్రణాళికలో భాగంగా విజ్ఞాన, వినోద యాత్రల అవసరాన్ని గుర్తించి ప్రభుత్వం ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలు, గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ విద్యార్థులకు ఈ టూర్‌లో ఉచితంగా అవకాశం కల్పించనున్నారు.

పర్యాటక కేంద్రాలకు ప్రత్యేక ప్యాకేజీలు

సెలవులు, ఇతర రోజుల్లో ఆయా ప్రాంతాలను సందర్శించేందుకు అధికారులు టూర్ ప్యాకేజీకి ప్రణాళికలు రూపొందిస్తారు. 2 నుంచి 4వ తరగతి వరకు చదివే విద్యార్థులకు సమీప ప్రాంతాల్లోని వారసత్వ, పురాతన నిర్మాణాలను ఒక రోజులో సందర్శించేందుకు అనుగుణంగా టూర్‌ను ఏర్పాటు చేస్తారు. 5 నుంచి 8 వరకు చదివే విద్యార్థులకు 30 కి.మీ పరిధిలో, 9 నుంచి ఇంటర్ చదివే వారికి రెండు రోజుల పాటు 70 కి.మీ పరిధిలోని పర్యాటక కేంద్రాల వీక్షణకు అవకాశం ఉంటుంది. డిగ్రీ స్థాయి విద్యార్థులు పర్యాటక కేంద్రాలను సందర్శించేందుకు 4 రోజుల ప్యాకేజీని అమలు చేయనున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అసందర్భ వ్యాఖ్యలు

బాలీవుడ్ నటి, భారతీయ జనతాపార్టీ పార్లమెంట్ సభ్యురాలు కంగనా రనౌత్ ఇతరులమీద చేస్తున్న విమర్శల ప్రభావం ఏపాటిదో తెలియదు కానీ, తన దూకుడు వ్యాఖ్యలతో పార్టీకి మాత్రం నష్టం చేస్తున్నారు. రద్దయిన సాగుచట్టాలను తిరిగి తీసుకురావాలంటూ ఆమె చేసిన కొన్ని వరుస వ్యాఖ్యల-మీద గురువారం హర్యానా బీజేపీ ప్రతినిధి విరుచుకుపడిన తీరు చూసినప్పుడు, ఈ హిమాచల్ ప్రదేశ్ మండీ ఎంపీ వ్యాఖ్యలతో హర్యానా రైతులకు బాగా మండిందని స్పష్టంగా అర్థమవుతుంది. హర్యానాని కాంగ్రెస్ వశం చేసుకోవడా-నికి మీరొక్కరు చాలు అని పార్టీ అభిమాన నెటిజన్లు ఆమెను వెంటాడుతున్నారు. పదిరోజుల్లో హర్యానాలో ఎన్నికలు ఉండగా ఆమె ఈ వ్యాఖ్యలతో ఏడాదిపాటు సాగిన సాగుచట్టాలవ్యతిరేక ఉద్యమాన్ని రైతులకు మళ్ళీ గుర్తుచేశారు. ఆ కాలంలో బీజేపీ పెద్దలంతా తమపట్ల ఎంత అమానుషంగా వ్యవహరించారో, ఎంతగా చులకనచేశారో రైతులకు గుర్తుకొచ్చి ఉంటుంది. మూడు వ్యవసాయ-చట్టాల విషయంలో పాలకుల అలనాటి కాఠిన్యానికి కంగన ఓ బలమైన ప్రతీక కనుక బీజేపీ ఇంతగా భయపడటం సహజం.

గతంలో బీజేపీ అధినాయకులు సదరు చట్టాలపై వెలిబుచ్చిన అభిప్రాయాలకు, ఇప్పుడు ఆమె చేసిన వ్యాఖ్యలు భిన్నమైనవేమీ కావు. ఆర్థికంగా బలంగా ఉన్న కొన్ని రాష్ట్రాలకు చెందిన కొద్దిమంది రైతులు మాత్రమే ఈ మూడుచట్టాలను వ్యతిరేకిస్తున్నారని, దేశవ్యాప్త రైతుల ప్రయోజనాలను రైతుల ముసుగులో ఉన్న కొన్ని దుష్ట శక్తులు బలిపెడుతున్నాయని వారు అప్పట్లో వాదించారు. ఖలిస్తానీ తీవ్రవాదులు ఉద్యమంలో వచ్చిచేరారన్న విమర్శలు సైతం చేశారు. రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో మకాం వేసుకొని, ఎండకు ఎండుతూ వానకూ తడుస్తూ పోరాడు-తూంటే సమస్త వ్యవస్థలూ సహాయ నిరాకరణ చేశాయి, విరుచుకుపడ్డాయి. ఉత్త-ర్‌ప్రదేశ్‌లోని లఖింపూర్‌లో కేంద్రమంత్రి కుమారుడు రైతులమీదకు తన కారుపో-నిచ్చి కొందరి ప్రాణాలు తీసిన ఘటన దేశాన్ని కుదిపేసింది. రైతుల నిరసనను కేంద్రపాలకులు తమపై తిరుగుబాటుగా, భావిస్తున్నారనేందుకు ఇటువంటి అనేక ఉదాహరణలు ఆ కాలంలో ఉన్నాయి. ఆ పోరాటాన్ని అణచివేసేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో, ముంచుకొస్తున్న పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్ ఎన్ని-కల్లో ఓటమి భయంతో ఆ చట్టాలను రద్దుచేస్తున్నట్టుగా ప్రభుత్వం ప్రకటించింది.

కేంద్రం వాటిని ఉపసంహరించుకున్నప్పటికీ, ఏడాదిపాటు సాగిన ఆ పోరా-టాన్ని రైతులు గుర్తుంచుకుంటారు. ఆ కాలంలో నిరసనకారులను ఉగ్రవాదు-లుగా, దానిని ఖలిస్తానీ ఉద్యమంగా అభివర్ణించిన కంగనా రనౌత్ వంటివారిని మరీనూ. అప్పటి అవమానాలను ఎన్నేళ్ళయినా మరిచిపోరనడానికి ఈ ఏడాది జూన్‌లో కంగనమీద చండీగఢ్ విమానాశ్రయంలో ఒక సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చేసిన దాడి ఓ ఉదాహరణ. సాగుచట్టాలకు వ్యతిరేకంగా రైతుల ఉద్యమం అలాగే కొనసాగితే భారత్‌లోనూ బంగ్లాదేశ్ తరహా పరిస్థితులు తలెత్తేవని కంగన మరో వ్యాఖ్యచేశారు. మళ్ళీ సాగుచట్టాల ఊసుతెచ్చి, పార్టీ ఒత్తిడిమేరకు వెనక్కుతీసు-కొని, ఆమె క్షమాపణలు కోరుతూండవచ్చు, అది ఆమె వ్యక్తిగత అభిప్రాయ-మంటూ పార్టీ కూడా చేతులుదులుపుకొనే ప్రయత్నం చేస్తుండవచ్చు. కానీ, మూడోమారు అధికారంలోకి రావాలనుకుంటున్న బీజేపీకి జాట్లు ఇప్పటికే దూర-మైనారని విశ్లేషణలు వెలువడుతున్నాయి. మహిళా మల్లయోధుల ఉద్యమం పట్ల కేంద్రప్రభుత్వ వైఖరి కూడా ఇందుకు దోహదం చేసింది. హర్యానా అసెంబ్లీ ఎన్ని-కల్లో కంగన వ్యాఖ్యల ప్రభావం ఏ మేరకు ఉంటుందన్నది వేరే విషయం. కానీ, గతంలో బీజేపీ ప్రతినిధి ఒకరు ఓ టీవీ చర్చలో మహమ్మద్ ప్రవక్తమీద దూకుడు వ్యాఖ్యలు చేసి దౌత్యసమస్యలు తెచ్చిపెట్టిన ఉదాహరణ కూడా ఉన్నది కనుక కంగనవంటివారిని కంట్రోల్‌లో ఉంచడం అందరికీ మంచిది.

పొరుగు దేశాలకు ప్రథమ ప్రాధాన్యమేదీ?

మన ఇరుగు పొరుగు దేశాలలో ఒకటైన చైనాతో మనకు 3,448 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ఉన్నది. అయినా చైనాను మన దేశంలో ఎందుకనో ఎవరూ ఒక పొరుగు దేశంగా భావించరు. ఆశ్చర్యకరమైన విషయమిది. మరో రెండు పొరుగు దేశాలు పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో కూడా మన పొలిమేరలు చాలా దీర్ఘ-మైనవి. పశ్చిమాన పాక్‌తో ఉన్న సరిహద్దు (3,310 కిలోమీటర్లు), తూర్పున బంగ్లా-దేశ్‌తో ఉన్న సరిహద్దు (4,096 కిలోమీటర్లు) పొడవునా పూర్తిగా కంచె నిర్మించు-కున్నాం. భారత్, నేపాల్‌లు 'తెరిచిన సరిహద్దు' (ఓపెన్ బోర్డర్) విధానాన్ని అనుసరి-స్తున్నాయి. అడపాతడపా ఏవో కొన్ని కీచులాటలు మినహా ఉభయ దేశాల మధ్య వస్తు సేవల రవాణా, ప్రజల నిర్నిబంధ రాకపోకలకు ఆ స్వేచ్ఛా సరిహద్దు విధానం ఇతోధికంగా తోడ్పడుతోంది. చిన్న దేశమైన భూటాన్‌తో మనకు 578 కిలోమీటర్ల సరి-హద్దు ఉన్నది. మనకు వ్యూహాత్మక ప్రాధాన్యమున్న భౌగోళిక నెలవులో ఉన్న పొరుగు దేశం భూటాన్. ఆ చిన్న దేశంతో స్నేహ సంబంధాలకు న్యూఢిల్లీ అమిత ప్రాధాన్యమిస్తోంది. శ్రీలంక ఒక సన్నని జలసంధితో భారత భూభాగం నుంచి వేరుపడి ఉంది చారిత్రక, సాంస్కృతిక కారణాల రీత్యా మనకు ఎంతో ప్రాధాన్యమున్న దేశమది. అయినప్పటికీ ఈ పొరుగు దేశం నుంచి కూడా మనకు తరచు సమస్యలు ఏర్పడుతూనే ఉన్నాయి. మాల్దీవులు కొంచెం దూరంగా ఉన్న పొరుగు దేశం. ఆ దేశ విధానాలపై చైనా ప్రభావం పెరుగుతున్నప్పటికీ మాల్దీవులతో మంచి సంబంధాలు నెరపడానికి మనం ప్రయత్నిస్తున్నాం. 1988లో మాల్దీవులలో అధికారాన్ని కబళించడానికి ఒక సైనిక ముఠా చేసిన ప్రయత్నాలను మనం విఫలం చేశాం. ఇప్పుడు ఆ 'ఆపరేషన్ కాక్టస్'ను గుర్తు చేసుకునేవారు భారత్‌లో ఎవరైనా ఉన్నారా అనేది నాకు సందేహమే. ఇరుగు పొరుగు దేశాలలో మనకు చాలా చిన్న సరిహద్దు ఉన్న దేశం ఆఫ్ఘానిస్తాన్. కేవలం 106 కిలోమీటర్లు మాత్రమే ఉన్న సరిహద్దు అది. సరే ఆ దేశంతో మన సంబంధాలు వసంత కాలంలో వర్ధిల్లితే హేమంత రుతువులో క్షీణించిపోవడం అనేక దశాబ్దాలుగా ఒక పరిపాటిగా ఉన్నది. చైనా మినహా ఇతర పొరుగు దేశాలన్నీ దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం (సార్క్)లో సభ్యత్వాన్ని కలిగి ఉన్నాయి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఈ పొరుగు దేశాల పట్ల భారత్ ఎలా వ్యవహరిస్తోంది? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి రాగానే తన అలవాటు ప్రకారం శబ్ద పటాటోపంతో తమ విదేశాంగ విధానం లక్ష్యం 'నైబర్‌హుడ్ ఫస్ట్' (పొరుగు దేశాలకు మొదటి ప్రాధాన్యత)గా ప్రకటించారు. ఇరుగు పొరుగున ఉన్న దేశాల పట్ల ప్రధానమంత్రి వ్యక్తిగత శ్రద్ధ ఎంత ప్రగాఢమైనదో తెలుసుకోవాలని కుతూహల పడుతున్నాను. సార్క్ సభ్య దేశాలలో నరేంద్ర మోదీ చివరిసారి ఎప్పుడు పర్యటించారు? 'పిఎమ్ ఇండియా' వెబ్ సైట్‌లో ఆ వివరాలను కనుగొన్నాను: 2024 మార్చిలో భూటాన్, 2022 మేలో నేపాల్, 2021 మార్చిలో బంగ్లాదేశ్, 2019 జూన్‌లో మాల్దీవులు, 2019 జూన్‌లో శ్రీలంక, 2016 జూన్‌లో ఆఫ్ఘానిస్తాన్, 2015 డిసెంబర్‌లో పాకిస్థాన్‌ను నరేంద్ర మోదీ చివరిసారి అధికారికంగా సందర్శించారు. గత పది సంవత్సరాలలో మోదీ ఐదు సార్లు నేపాల్‌ను, మూడు సార్లు భూటాన్‌ను, మూడు సార్లు శ్రీలంకను, రెండు పర్యాయాలు బంగ్లాదేశ్‌ను, రెండు సార్లు మాల్దీవులును, రెండు సార్లు ఆఫ్ఘాన్‌ను, ఒకసారి పాకిస్థాన్‌ను సందర్శించారని కూడా ఆ వెబ్ సైట్ ప్రకారం తెలుసుకున్నాను. నరేంద్ర మోదీ గత పదేళ్లలో మొత్తం 82 విదేశీపర్యటనలు చేశారు. ఆ పర్యటనల్లో భాగమే ఇరుగు పొరుగు దేశాలకు ఈ 18 సందర్శనలు. 2024లో భూటాన్‌లో ఒకరోజు పర్యటన మినహా మరే ఇతర పొరుగు దేశంలోనూ ఆయన రెండు సంవత్సరాలకు పైగా పర్యటించనే లేదు!



ఈ ఏడాది మార్చిలో భూటాన్‌లో ఒకరోజు పర్యటన మినహా మరే ఇతర పొరుగు దేశంలోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు సంవత్సరాలకు పైగా పర్యటించనే లేదు! దక్షిణాసియాలో భారత్ ప్రభావ ప్రాబల్యాలు అంతకంతకూ తగ్గి పోతున్నాయి. ఇది మనం స్వయంగా కొనితెచ్చుకున్న దుస్థితి. మోదీ సర్కార్ నైబర్ హుడ్ ఫస్ట్ విధానం వాస్తవంగా పొరుగు దేశాలకు చివరి ప్రాధాన్యాన్ని మాత్రమే ఇస్తూ భారత్ పట్ల ఆ దేశాల స్నేహశీలత, సుహృద్భావాన్ని క్షీణింపజేసింది.

18వ సార్క్ శిఖరాగ్ర సదస్సు 2014లో నేపాల్ రాజధాని ఖాట్మండ్‌లో జరిగింది. 19వ సార్క్ శిఖరాగ్రం నవంబర్ 2016లో పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జర-గవలసి ఉంది. అయితే భారత్ ఆ శిఖరాగ్ర సదస్సును బాయ్‌కాట్ చేసింది. భారత్‌ను అనుసరించి మరో నాలుగు దేశాలు కూడా ఆ శిఖరాగ్రానికి హాజరు కాలేదు. దరి-మిలా సార్క్ శిఖరాగ్ర సదస్సు జరగనే లేదు. సార్క్ 'ఒక సంపూర్ణ వైఫల్యం' అని జస్వంత్ సింగ్ (వాజపేయి ప్రభుత్వంలో విదేశాంగ మంత్రి) అభివర్ణించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా సార్క్‌పై జస్వంత్ మాటే తుది మాటగా అంగీకరించింది.

ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత నరేంద్ర మోదీ 2015– జూన్, 2018 మధ్య చైనాలో ఐదుసార్లు పర్యటించారు. మియన్మార్‌ను రెండు సార్లు, మారిషస్‌ను ఒక పర్యాయం సందర్శించారు. చైనా తన చేతలతో మోదీకి కోపం తెప్పించింది. చైనాకు దీటుగా మోదీ ప్రతిస్పందించలేక పోయారు. విశ్వసనీయ వర్గాల ప్రకారం మోదీ నిస్సహాయుడై పోయారు. సరిహద్దుల్లో ఎదురెదురుగా మొహరించిన సైనిక దళాల ఉపసంహరణ విషయమై చర్చలకు చైనానే ఎజెండాను నిర్దేశిస్తోంది. ఆ చర్చలు పదే పదే జరుగుతూనే ఉన్నాయి. అయినా సత్ఫలితాలు ఎండమావులుగా ఉన్నాయి. వాస్తవాధీన రేఖ వెంబడి తన సైనిక దళాల మొహరింపును చైనా ఇతోధి-కంగా పెంచింది. సరిహద్దు ప్రాంతాలలో రోడ్లు వేస్తోంది, వంతెనలు నిర్మిస్తోంది, జనావాసాలను ఏర్పాటు చేస్తోంది, ఆయుధాల నిల్వకు భారీ వసతులను అభివృద్ధి పరుస్తోంది.

ఇరుగు పొరుగు దేశాల పట్ల నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించినందుకు మనం భారీ మూల్యమే చెల్లించాము నేపాల్‌లో ప్రభుత్వం మారగలదని మనం ఊహించలేక పోయాం. కె.పి.శర్మ ఓలి మళ్లీ ప్రధానమంత్రి అయ్యారు. షేక్ హసీనా ఉన్న పాటున బంగ్లాదేశ్ నుంచి శరణార్థిగా భారత్‌కు రావలసి వస్తుందనే విపత్కర పరిస్థితిని ముందే పసిగట్టడంలో మనం పూర్తిగా విఫలమయ్యాం. రానిల్ విక్రమసింఘెకు ఎనలేని ప్రాధాన్యమిచ్చాం. అనూర దిస్సనాయకెను ఉపేక్షించాం. ఇప్పుడు దిస్సనాయకె 42.3 శాతం ఓట్లతో శ్రీలంక అధ్యక్ష పీఠం అధిష్ఠించారు. మాల్దీవుల అధ్యక్షుడుగా ఎన్నికైన మొహమ్మద్ మయిజ్జు తొలి చర్య తమ దేశంలోని భారతీయ సైనిక సలహాదారులను వెనక్కి వెళ్లిపొమ్మని ఆదేశించడమే. ఇక పాకిస్థాన్ విషయా-నికి వస్తే మోదీ ప్రభుత్వం విధానాలను దేశీయ రాజకీయ పరిస్థితులు ప్రభావితం చేస్తున్నాయనే అభిప్రాయం కలుగుతోంది.

చెప్పవచ్చిన దేమిటంటే దక్షిణాసియాలో భారత్ ప్రభావ ప్రాబల్యాలు అంత-కంతకూ తగ్గి పోతున్నాయి. ఇది మనం స్వయంగా కొనితెచ్చుకున్న దుస్థితి. ప్రపంచ వ్యవహారాలలో భారత్‌కు శాంతి నిర్మాతగా ప్రతిష్ఠ సమకూర్చేందుకు మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానం ఆరాటపడుతోంది. రష్యా, ఉక్రెయిన్, అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాల నాయకులతో మోదీ తరచు సమావేశమవడం, మోదీ సర్కార్ శాంతి సాధన ప్రయత్నాలకు తార్కాణాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ శాంతిని కాపాడేందుకు మోదీ కృషి సఫలం కావాలని కోరుకుంటున్నాం. అయితే పొరుగు దేశాలకు మొదటి ప్రాధాన్యం అనే విధానం వాస్తవంగా పొరుగు దేశాలకు చివరి ప్రాధాన్యం మాత్రమే ఇస్తుందని, భారత్ పట్ల ఆ దేశాల స్నేహశీలత, సుహృద్భావాన్ని అంతకంతకూ క్షీణింపజేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నిష్కర్షగా చెప్పక తప్పడం లేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

చింతచెట్టు కింద పాఠాలతో హైదరాబాద్ అభివృద్ధి

సెప్టెంబర్ 28 ఈ తేదీ రాగానే 1908లో హైదరాబాద్‌ను ముంచెత్తిన వరదలే గుర్తుకొస్తాయి. అప్పట్లో ఈ వరదలు నాటి నగరంలో అధికభాగాన్ని జలమయం చేశాయి. వేలాది మందిని నిరాశ్రయులుగా మార్చాయి. అఫ్జల్ గంజ్ పార్క్ (నేడు ఉస్మానియా ఆసుపత్రిలో భాగం)లో ఉన్న ఓ చింత చెట్టు నాటి జ్ఞాపకాలను నేటికీ గుర్తు చేస్తూనే ఉంటుంది. ఈ ఏడాది సైతం సెప్టెంబర్ 28న 10.30 గంటలకు ఈ చింతచెట్టు కింద జరిగే సమావేశం ఒకనాటి బీభత్సాన్ని గుర్తు చేసుకుంటూ, నేటి నగరాభివృద్ధికి నిపుణులు చేసే సూచనలకు వేదిక కానున్నది.

1908లో మూసీ నదికి వచ్చిన వరద కనివిని ఎరుగనిది. మరో మూడేళ్లకు చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ గద్దెనెక్కారు, సమస్యను గుర్తించారు. సిటీ ప్లాన్ రూపొందించాలని సంకల్పించారు. 1914లో సిటీ ఇంప్రూవ్‌మెంట్ బోర్డు (సిఐబి) ఏర్పాటు చేశారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య మార్గదర్శకత్వంలో, ఇంజనీర్ అలీ నవాజ్ జంగ్‌తో సీఐబి పని చేసింది. హైదరాబాద్ పట్టణానికి ఎగువభాగాన మూసీ ప్రవాహాన్ని అరికట్టడానికి 1920లో ఉస్మాన్ సాగర్, 1927లో హిమయత్ సాగర్ జంటజలాశయాల నిర్మాణాలు జరిగాయి. మంచినీటి సరఫరా వ్యవస్థ, కాలనీల నిర్మాణం, నూతన డ్రైనేజీ వ్యవస్థ, రివర్ ఫ్రంట్ వాల్ నిర్మాణం, రాష్ట్ర హైకోర్టు, విక్టోరియా మెటర్నిటీ హాస్పిటల్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, స్టేట్ లైబ్రరీ, ఆర్టీసీ బస్ డిపో, నయాపూల్ ఇతర పౌర సదుపాయాలపై ప్రతిపాదనలు అమలయ్యాయి. అప్పట్లో నగర ప్రణాళిక బాగ్ (ఉద్యానవనాలు), బౌలి (బావులు), తలాబ్ (చెరువులు)తో ముడిపడి ఉండింది.

గత వందేళ్లలో నగరం ఊహకు అందని విధంగా విస్తరించింది. దీంతో ఒకనాటి పరిస్థితులే తిరిగి ఏర్పడుతున్నాయన్న భయాలు కూడా కలుగుతున్నాయి. అనేక ప్రాంతాలు ఓ మోస్తరు వర్షానికే జలమయమైపోతున్నాయి. పుట్టగొడుగుల్లా మురికివాడలు వెలుస్తున్నాయి. చక్కగా ప్లాన్ చేసిన ప్రాంతాలు సైతం ఇరుకిరుగ్గా మారుతున్నాయి. అక్రమ నిర్మాణాలను చట్టబద్ధం చేస్తూ రావడం కూడా ఇందుకు ఓ కారణం. ఈ నేపథ్యంలోనే ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్, సెంటర్ ఫర్ దక్కన్ స్టడీస్ సంస్థ, చత్రి, కోవా, మూసీ పరిరక్షణ కమిటీ, తెలంగాణా రిసోర్స్ సెంటర్, R.W.As ఇతర ఎన్జీఓలతో కలసి అర్బన్ ప్లానింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వానికి, నగరాభివృద్ధితో ముడిపడిన సంస్థలకు అనేక సూచనలు చేసింది. 1908 నాటి వరదల పరిస్థితికి ప్రత్యక్షసాక్షిగా నిలిచిన చింతచెట్టు నీడలో ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ ఎన్నో కార్యక్రమాలను నిర్వహించింది. 2008 సెప్టెంబర్ 28 నుంచి కూడా ఏటా ఈ కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. నగరాభివృద్ధికి సూచనలు, వాటి అమలుకు కార్యాచరణ రూపకల్పన లాంటి అంశాలన్నీ ఈ సమావేశాల్లో చర్చకు వస్తుంటాయి. ఈ చింత చెట్టు అప్పట్లో కొన్ని వందలమందిని కాపాడింది. అలాంటి చెట్టు నేటికీ పచ్చగా ఉంది. ఈ చెట్టును, ఆ స్థలాన్ని నగర సహజ వారసత్వంలో భాగంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. అప్పట్లో భారీ వరదలకు పెద్ద పెద్ద కట్టడాలు (మసీద్–ఎ–బర్త్‌జంగ్, పేట్ల బుర్జు లాంటివి) ఎంతమేరకు మునిగిపోయాయో తెలిపే సూచికలు ఇప్పటికీ ఆ వరదల తీవ్రత నేటి తరానికి తెలియచేస్తున్నాయి. అంతే కాదు, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ నిజామత్ జంగ్, అలీ నవాజ్ జంగ్, దాంగోరియా లాంటి ప్రముఖ ప్లానర్లు, అడ్మినిస్ట్రేటర్ల గుర్తులను భద్రపర్చుకోవాలి. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ లాంటి జలాశయాలతో పాటు, కాకతీయుల, కుతుబ్ షాహీల నాటి మరెన్నో గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను కాపాడుకోవాలి. నేడు హైదరాబాద్‌లో పలు కాలనీలు కొద్దిపాటి వర్షాలకే మునిగిపోతున్నాయంటే, అవన్నీ ఒకనాటి చెరువుల్లో, నీటి ప్రవాహ మార్గాల్లో, నాలాల్లో నిర్మించినవే. చింతచెట్టు కింద జరిగిన సమావేశాల్లో ఈ విధమైన ఎన్నో అంశాలు చర్చకు వచ్చాయి. ప్లానర్లు, అడ్మినిస్ట్రేటర్లు చేసిన తప్పిదాలను గుర్తించి, వాటికి పరిష్కారాలు అన్వేషించే ప్రయత్నాలు జరిగాయి. రకరకాల కారణాలతో అవేవీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయంపై శ్రద్ధ వహించాలి. 1908 తరువాత కూడా పలు సందర్భాల్లో మూసీ నదికి వరదలు వచ్చాయి. 1970లో ఉస్మాన్ సాగర్‌కు భారీగా వరద నీరు చేరింది. చెరువు కట్టకు ముప్పు ఉందని గేట్లు ఎత్తేయడంతో వరద నీరు నగరాన్ని ముంచెత్తింది. ఆ తరువాతి కాలంలో మూసీ వరద కాకున్నా పట్టణ వరదలు ప్రధాన సమస్యగా మారాయి. వీటిని తట్టుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి. హైదరాబాద్ నగరం నేడు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది. వర్షాకాలంలో కాల్వలుగా మారుతున్న రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు మునిగిపోవడం, పెరిగిపోతున్న ట్రాఫిక్, వాహన కాలుష్యం, భూగర్భ జలాల కాలుష్యం, మంచినీటి సమస్య డ్రైనేజీ ఇక్కట్లు, ప్రజా రవాణా, మూసీ కలుషితం కావడం.. ఈ జాబితాకు అంతు ఉండదు. వీటిలో చాలా వాటిని పరిష్కరించేది చక్కటి సిటీ ప్లానింగ్. ఆ విషయంలో ఇప్పటికైనా శ్రద్ధ వహించాలి.



హైదరాబాద్ జనాభా కోటి దాటింది. దీనికి 100 కి.మీ. వెలుపల చిన్న పట్టణాల అభివృద్ధిని తీవ్రతరం చేయడం ద్వారా ఉపాధి, విద్యావకాశాల కోసం ప్రజలు హైదరాబాద్‌కు వలసరాకుండా చూడవచ్చు. హైదరాబాద్ యావత్ దేశపు గ్రోత్ ఇంజిన్లలో ఒకటి. దీన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్రప్రభుత్వం హైదరాబాద్ నగరానికి ఇతోధికంగా నిధులు మంజూరు చేయాలి. ముఖ్యంగా ప్రజారవాణా, డ్రైనేజ్ వ్యవస్థ, తాగునీరు, మూసీ ప్రక్షాళనకు ముందుకు రావాలి.

హైదరాబాద్ క్రమంగా విశ్వనగరంగా మారిపోయింది. కొన్నేళ్ల క్రితంతో పోలిస్తే తాగునీటి సదుపాయాలు, రహదారులు అభివృద్ధి చెందాయి. ఓఆర్ఆర్ వంటివి ఎన్నో వచ్చాయి, ఆరఆర్ఆర్ వంటివి మరింకెన్నో వస్తున్నాయి. ఎయిర్ పోర్ట్, మెట్రో విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. చెరువులు, నాలాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. ఏ నగరానికైనా మాస్టర్ ప్లాన్ అత్యంత కీలకం. హైదరాబాద్‌కు సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపకల్పన, అమలు విషయంలో కూడా ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాబోయే 50 ఏళ్లను పరిగణనలోకి తీసుకోవాలి. 1975 నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు వివిధ సంస్థల ద్వారా హైదరాబాద్‌కు ఆరు మాస్టర్ ప్లాన్లు వచ్చాయి. వాటిని కలిపి ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి.

నగరం ఎదుర్కొంటున్న మరో ముఖ్యమైన సమస్య డ్రైనేజీ, వరదనీళ్లు. ఎక్కడికక్కడ మురుగునీటిని శుద్ధిచేసి ఆ నీటిని స్థానికంగా వినియోగించుకునేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలి. శుద్ధి అయిన మిగులు నీటిని చెరువుల్లోకి, మూసీనదిలోకి పంపించేలా చూడాలి. వరద నీటి కాల్వల నిర్వహణ, నిర్మాణంపై దృష్టిపెట్టాలి. ఐదేళ్లలోగా ఈ పనులు పూర్తయ్యేలా చూడాలి. వాన నీటిని ఒడిసిపట్టి వినియోగించుకునేలా చేయాలి. ఈ విషయంలో భవన నిర్మాణ నిబంధనలను కఠినం చేయాలి. ఘనవ్యర్థాల సేకరణ, ప్రాంతాల వారీగా సెపరేషన్, రీసైకిల్ చేసి పూర్తి స్థాయిలో వినియోగించుకొనే వ్యవస్థను ఏర్పరుచుకోవాలి. హైదరాబాద్ జనాభా కోటి దాటింది. మొత్తం తెలంగాణ జనాభాతో పోలిస్తే నాలుగో వంతు ఈ నగరంలోనే ఉన్నట్లయింది. రాజధానికి 100 కిలోమీటర్ల వెలుపల కౌంటర్ మాగ్నెట్స్‌గా చిన్న పట్టణాల అభివృద్ధిని తీవ్రతరం చేయాలి. తద్వారా ఉపాధి, విద్యావకాశాల కోసం హైదరాబాద్‌కు ప్రజలు వలస రాకుండా చూడవచ్చు. హైదరాబాద్ యావత్ దేశపు గ్రోత్ ఇంజిన్లలో ఒకటి. దీన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్రప్రభుత్వం కూడా హైదరాబాద్ నగరానికి ఇతోధికంగా నిధులు మంజూరు చేయాలి. మరీ ముఖ్యంగా ప్రజా రవాణా వసతులు, పట్టణ డ్రైనేజ్ వ్యవస్థ, తాగునీరు, మూసీ నది ప్రక్షాళనకు ముందుకు రావాలి. శీతోష్ణస్థితి మార్పుల ప్రభావానికి హైదరాబాద్ లోనవుతోంది. అతి తక్కువ సమయంలోనే అత్యంత భారీస్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. ఇలాంటి మార్పులను తట్టుకునేందుకు నగరం సిద్ధంగా ఉన్నదా? బెంగళూరు, ముంబై లాంటి నగరాలు ఇటీవలి కాలంలో మౌలిక వసతుల కొరతకు గురయ్యాయి. అలాంటి దుస్థితి మన హైదరాబాద్‌కు రావద్దనుకుంటే తక్షణమే నడుం బిగించాలి. నగరాభివృద్ధి అనగానే కొన్నిసార్లు అధికారులు అత్యుత్సాహంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న భవనాలను కూడా కూల్చేస్తుంటారు. వందేళ్ల క్రితం సిఐబి హయాంలో చారిత్రక ప్రాధాన్యం ఉన్న కట్టడాలెన్నో కనుమరుగైపోయాయి. అలాంటి పొరపాట్లే ఇప్పుడు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలి.


కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరాన్ని ఆకుపచ్చ నగరంగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడు మాత్రమే అభివృద్ధి ఫలితాలు అందుకోగలుగుతాం. అభివృద్ధి, ప్రజానివాస హక్కులు, చెరువులు, కుంటల పరిరక్షణ, ప్రజారవాణా, చారిత్రక వారసత్వ కట్టడాల సంరక్షణ లాంటివన్నీ కలసికట్టుగా కొనసాగాలి. ఆ దిశలో ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ లాంటి సంస్థలెన్నో కృషి చేస్తున్నాయి, చేస్తాయి కూడా.

● **వేదకుమార్ మణికొండ**
చైర్మన్, ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్

విద్యార్థిలోకపు పోరుపతాక

విద్యార్థి ఉద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది పీడీఎస్‌యు చరిత్ర. ఎన్నో పోరాటాలనూ, సమరశీలతనూ, త్యాగాలనూ, రాజకీయ పనిరీతిని తనలో ఇముడ్చుకుని తెలుగు నేలను ముఖ్యంగా విద్యార్థి సమాజాన్ని చలింప చేసినది. జ్వలింప చేసినది పీడీఎస్‌యు. 1974 అక్టోబర్ 12, 13 తేదీలలో మొదటి మహాసభలో పీడీఎస్‌యుగా నిర్మాణాన్ని సంతరింపచేసుకున్న ఆ సంస్థకు 2024 అక్టోబర్‌కు 50 ఏండ్లు నిండాయి. ఒక విద్యార్థి సంఘం, అందునా పోరాటాల చరిత్ర, విప్లవోద్యమ దృక్పథం గల సంస్థ ఇంతకాలం కాలానికి ఎదురీదుతూ నిలబడటం అరుదైన సందర్భమే. ఈ సందర్భంగా ఈ సంస్థలో కృషి చేసినవారు, అమరులైన వారు వారి జీవిత మధురిమలను ఉద్యమంలోనే చవిచూశారు. త్యాగాలతో పునీతమైన ఆ చరిత్రను మననం చేసుకోవడానికి 2024 సెప్టెంబర్ 30న ఉస్మానియా యూనివర్సిటీలోని టాగూర్ ఆడిటోరియంలో పీడీఎస్‌యు స్వర్ణోత్సవం జరుపుకుంటున్నది. ఆ 50 వసంతాల పోరాట స్ఫూర్తిని ఈ సందర్భంగా మననం చేసుకోవడం ఎంతో సముచితం. అవసరం కూడా.

1960వ దశకం ప్రపంచంలో, ముఖ్యంగా భారత దేశంలో అల్లకల్లోలంగా నడిచింది. అధిక ధరలు, నిరుద్యోగం, పనిభారం, రుణభారం, ఆశ్రిత పక్షపాతం, నిరంకుశత్వం ఇవన్నీ సమాజాన్ని పట్టి పీడించాయి. అస్వతంత్రత పెద్ద ఎత్తున కొనసాగింది. ఈ నేపథ్యంలోనే 1968లో ఫ్రాన్స్‌లో డీగాల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థి ఉద్యమం ప్రజ్వరిల్లింది. అది భద్రత కోసం, ప్రజాస్వామ్యం కోసం నినదించింది. ఈ పోరాటం ప్రపంచవ్యాప్తంగా దాని ప్రభావాన్ని ప్రసరింప చేసింది. భారతదేశ విద్యార్థి లోకంపై కూడా ఆ ప్రభావం పడింది. ఆ క్రమంలోనే అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వియత్నాం ప్రజలు, విద్యార్థులు చేసిన దేశభక్తియుత గెరిల్లా పోరాటం, పుస్తకాలు వదిలేసి విద్యార్థులు సైతం నేల మాళిగల్లోకి దూరి చేసిన గెరిల్లా పోరాటం ఉత్తేజాన్ని కలిగించింది. మరోవైపు చేగువేరా సాహసాలు, క్యూబా విముక్తి తరువాత లాటిన్ అమెరికాలో విప్లవం కోసం ఆయన చేసిన త్యాగాలు చెరగని ముద్రను వేశాయి. ఈ సందర్భంలోనే నక్సల్బరీ, శ్రీకాకుళ గోదావరిలోయ ప్రజల పోరాటాలు, సాయుధ సంఘర్షణలు తెలుగు సీమను పులకింపచేశాయి.



ఈ సందర్భంలోనే ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ న్యూక్లియర్ ఫిజిక్స్ చదువుతూ, గోల్డ్‌మెడల్ సాధించిన జార్జిరెడ్డిని సమాజ చింతకుడిగా రూపుదిద్దుకోవడానికి ప్రేరణ అయ్యాయి. యూనివర్సిటీలోని ర్యాగింగ్, ఆశ్రిత పక్షపాతం, హాస్టల్స్‌లో సౌకర్యాల లేమి, మెస్‌లో దందాలు, అధికారుల ఆగడాలు, గ్రామీణ విద్యార్థుల పట్ల జరిగే అవహేళన ఇవన్నీ కదిలించాయి. ఈ సమస్యలన్నీ జార్జిని పోరాట వీరునిగా మలిచాయి. ఆ క్రమంలోనే నీలం రామచంద్రయ్య (ఉపాధ్యాయ ఎమ్మెల్సీ) సహచర్యంతో రాజకీయ నిర్మాణ పరిణతి పొంది జార్జిరెడ్డి రాజకీయ, నిర్మాణ దక్షకుడయ్యాడు. విద్యార్థులకు సమరశీల పోరాట వేదిక వుండాలని భావించి, సహచరులను సమన్వయ పరిచి పీడీఎస్ అనే సంస్థను స్థాపించాడు. అది యూనివర్సిటీలో విద్యార్థుల పోరాట పతాకగా మారింది. మతోన్మాదులకూ, ఛాందసవాదులకూ సింహస్వప్నంగా మారింది. ఎన్నో పోరాటాలు చేసి, ఎన్నెన్నో విజయాలు సాధించింది. ఈ ఫలితాలను మింగలేని మతోన్మాద మూకలు 1972 ఏప్రిల్ 14న జార్జిని కత్తులతో పొడిచి హత్య చేశారు. ఈ పోరాటాల క్రమంలో 1975 జూన్ నుంచి 1977 మార్చి వరకు ఎమర్జెన్సీ నియంతృత్వాన్ని ఎదుర్కొన్నది. రహస్యంలోకి నాయకత్వం పోవాల్సి వచ్చింది. సంస్థ కార్యకలాపాలకు, ఉద్యమాలకు బ్రేకు పడింది.

ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత తిరిగి పునర్నిర్మాణం జరిగింది. మిగిలిన వారు, ఉద్యమబాట పట్ల ఆసక్తి వున్న వారితో కార్యక్రమాలు, నిర్మాణ రూపం ఆరంభించారు. అనతి కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా పీడీఎస్‌యు బలమైన సంస్థగా ఎదిగింది. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో సౌకర్యాల కోసం, వారిని గౌరవంగా చూడాలనే అంశంపై ఎన్నో పోరాటాలు చేసి, విజయాలు సాధించింది. మహిళలకు, విద్యార్థినులకు సమాన హక్కుల కోసం నినదించింది. ర్యాగింగ్‌పై కన్నెర్ర చేసింది. వివిధ కళాశాలల్లో గూండాగిరి, రౌడీ గ్యాంగ్‌లపై పోరాడి, వారి కీళ్ళు విరిచింది. కళాశాల సీట్లు పెంచాలని, సౌకర్యాలు మెరుగుపరచాలని, అధ్యాపకుల నియామకం కోసం ఎన్నో పోరాటాలు చేసింది. నిరుద్యోగం, అధిక ధరలను నిరసించింది. నిర్బంధాల శిబిరాల నుంచి, ఆంక్షల చట్రాల నుంచి, ఛాందసభావాల నుంచి, అభివృద్ధి నిరోధకత్వం నుంచి దాడులను, ఉక్కు చట్రాలను ఎదుర్కొని 5 దశాబ్దాలుగా పీడీఎస్‌యు పురోగమిస్తున్నది. ఈ క్రమంలోనే 1972–73 లో డీఎస్‌గా, 1974లో ఆర్ఎస్‌యుగా, 1984 నుంచి 2013 దాకా మరో రెండు మూడు విభజనలను ఎదుర్కొని సైతం తన సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ, పోరాట కృషిని కొనసాగిస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి లోకపు పోరు పతాకగా నిశ్చలంగా నిలబడింది.

○ **పోటు రంగారావు**
పీడీఎస్‌యు పూర్వ ప్రధాన కార్యదర్శి
(సెప్టెంబర్ 30న ఉస్మానియా యూనివర్సిటీలో

దళితుల ఐక్యతను కోరిన జాషువ

కాలంతో పోటీ పడి జీవించే మహాకవి గుర్రం జాషువ. ప్రతినిత్యం ప్రజల నాలుకల మీద ప్రతిధ్వనించే జాషువ పద్యాలు ఎప్పుడు చదివినా తాజాగా ఉంటాయి. మానవ మనుగడకు అడ్డు వచ్చే విద్రోహాలను, జీవించే హక్కును కాలరాచే కుట్రలను వ్యతిరేకించి వాటిని ఎదుర్కొనే శక్తి యుక్తులను తన కవిత్వం ద్వారా జాషువ ప్రచారం చేశాడు. విశ్వనాథ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ లాంటి ఉద్దండ కవి పండితులు ఏర్పరచిన సాహిత్య దృక్పథాలకు భిన్నంగా, ప్రత్యామ్నాయ కవితాతత్వాన్ని ఆవిష్కరించాడు. బుద్ధుడు, క్రీస్తు, మహాత్మా-గాంధీ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వంటి మహనీయులు అందించిన ఉమ్మడి భావజాల స్ఫూర్తికి జాషువా కవిత్వం అక్షర దర్పణంగా నిలుస్తుంది. 'అకలంకంబగు హేతువాదము', 'సత్యాన్వేషణాసక్తి', 'సాంఘిక కళ్యాణ పిపాస', దేశభక్తి, దళితుల సర్వతోముఖ ప్రగతి, మహిళాభ్యుదయ చింతన, తదితర అంశాలను ఆయన ఆర్ద్రంగా కవిత్వీకరించాడు. అందువల్ల జాషువ ఈనాటి అస్తిత్వ ఉద్యమాలకు మార్గదర్శిగా కనిపిస్తాడు. వర్తమాన చైతన్యానికి ఊతమిచ్చే ఎన్నో అంశాలను, సమకాలీన సమాజాభివృద్ధికి అవసరమైన సాంస్కృతిక విలువలను జాషువ ఆనాడే తన కవిత్వంలో పొందుపరచి నవయుగ కవి చక్రవర్తిగా విమర్శకుల నీరాజనాలందుకున్నాడు. జాషువ కవిత్వం వెన్నెల తుఫాన్. ఆ వెన్నెల్లో అంటరాని గబ్బిలాలు ఆవేదనతో భాషించాయి. ఆ తుఫాన్‌లో నాలుగు పడగల హైందవ నాగరాజులు ఉలిక్కి పడ్డాయి. ఈ కవికోకిల సాహిత్యం ఒక కన్నీటి సునామీ. అవిచ్ఛిన్నమైన ఆ సృజనవాహిని ఒక్క కుల సమస్య దగ్గరే ఆగిపోలేదు. మనిషిని పీడించే అనేకరకాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను తడుముతూ నిమ్నోన్నతాలను సమం చేస్తూ జీవితపు సన్నని పార్శ్వాల్లోగుండా ప్రవహించింది. కులీన వర్గాల ఆధిపత్యం నిరాఘాటంగా కొనసాగుతున్న సాహిత్యంలో తక్షణం కవిగా నిలబడటానికి తొలిదశలో జాషువ పౌరాణిక నాటకాలు రాసినప్పటికీ ఆ ప్రభావం నుండి బయటపడి సామాజిక బాధ్యతతో విశిష్టమైన ఖండ కావ్యాలను, సందేశాత్మకమైన లఘు కావ్యాలను వెలువరించాడు. భారతీయ సమాజంలో వేళ్లూనుకున్న కులపీడనను తీవ్రంగా నిరసిస్తూ ఆయన రాసిన గబ్బిలం కావ్యం గత సహస్రాబ్దిలో వెలువడిన ఐదు గొప్ప పుస్తకాల్లో ఒకటిగా (ప్రముఖ ఆంగ్ల దినపత్రిక పయనీర్ సర్వే ప్రకారం) ప్రఖ్యాతిగాంచింది. గబ్బిలం స్వరూపం– దేశారాధన.. స్వభావం– దళిత వేదన. ఈ రకమైన అపూర్వ శిల్పవ్యూహంతో రచించడం వల్లనే ఈ కావ్యం సంప్రదాయ పండితులతో పాటు అధునాతన కవులకు కూడా ప్రీతిపాత్రమయింది.

జాషువ కవిత్వం వెన్నెల తుఫాన్. ఆ వెన్నెల్లో అంటరాని గబ్బిలాలు ఆవేదనతో భాషించాయి. ఆ తుఫాన్‌లో నాలుగు పడగల హైందవ నాగరాజులు ఉలిక్కిపడ్డాయి. ఈ కవికోకిల సాహిత్యం ఒక కన్నీటి సునామీ. అవిచ్ఛిన్నమైన ఆ సృజనవాహిని ఒక్క కుల సమస్య దగ్గరే ఆగిపోలేదు. మనిషిని పీడించే అనేకరకాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను తడుముతూ నిమ్నోన్నతాలను సమం చేస్తూ జీవితపు సన్నని పార్శ్వాల్లోగుండా ప్రవహించింది.



తెలుగు సాహిత్యంలో ఘనత వహించిన చాలామంది కవులు, రచయితలు వీధిలో తిష్టవేసిన చెత్త గురించి మాట్లాడారు కానీ తమ ఇంటిని ఆవరించిన బూజు గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. ఇందుకు భిన్నంగా జాషువ స్వీయ లోపమ్ములను అర్థం చేసుకొని, సాంఘిక దురన్యాయాలను ఖండిస్తూ గొప్ప సాహిత్యాన్ని సృష్టించాడు. సామాజిక అసమానతలను ఎంత తీవ్రంగా ప్రశ్నించాడో అంతే పదునుగా దళితుల మధ్య రగులుతున్న అంతర్గత ఉప కుల భేదాలను కూడా విమర్శించాడు. 'ఇంటి గుట్టు', 'పంచముడు' వంటి ఖండికలతో పాటు గబ్బిలం తదితర కావ్యాలలో కూడా అనేక సందర్భాలలో ఈ వైరుధ్యాలను తీవ్రంగా వ్యతిరేకించాడు. మాల మాదిగల నడుమ బుసలు కొట్టే కుల, మత శాఖాపరమైన విభేదాలను, వివాదాలను కుండబద్దలు కొట్టినట్లు తన కవిత్వంలో తేటతెల్లం చేశాడు. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ అనే భావనతో అనునిత్యం సంఘర్షణలు రగులుతూనే ఉంటాయి. అణగారినవర్గాలు కూడా దీనికి అతీతం కాదు. "కలదమ్మా ప్రణమంటరానితన మాకర్షింపు-మీయిండియాపొలమమందుంగల మాలమాదిగలకున్" అంటూ జాషువ సామాజికరోగాన్ని గూర్చి తెలియజేశాడు. ఇలాంటి పెను రోగంతోనే మాల-మాదిగలు పరస్పరం దూషించుకుంటున్నారని, కృష్ణులు, క్రీస్తులు ఎంతమంది దేవుళ్ళు జన్మించినా ఈ రెండు జాతుల మధ్య ఐక్యతను సాధించలేరని జాషువ ఆవేదన చెందాడు. అంతఃకలహాలలో సతమతమవుతూ సమాజంలో తమకు జరుగుతున్న అన్యాయాలను వారు ఎదిరించలేక పోతున్నారని జాషువ మధన పడ్డాడు. "పంచముల లోన మాదిగవాడ నేను/ పంచమీయులలో మాలవాడ-తండు/ ఉభయులము క్రైస్తవ మతాన నొదిగినాము/ సోదరత గిట్టుబాటు కాలేదు మాకు" అని దళితుల మధ్య ఉన్న వైషమ్యాలను జాషువ నిరసించాడు. 'సిగ్గు విడిచి హెచ్చు తగ్గుల కోసమై తన్నుకొనుట మాకు తప్పు గాదు" అని వ్యంగ్యంగా నిందించాడు. 'బియేలె మేలు' విద్యాబిరుదుల్ సాధించామని గర్వపడే మాలలు, మాదిగలు కుల మహాలోభంతో, తగాదాలతో తెగలుగా విడిపోతున్నారని జాషువ ఆవేదన చెందాడు. 'కులకక్ష్యాభ్రష్ట దుర్గాతి' అని తన జాతి జనులను ఆయన తీవ్రంగా మందలించాడు. "మాల యేసుక్రీస్తు, మాదిగలకు గాడు / మాదిగేసుక్రీస్తు మాకూ గాడు" అంటూ కరుణామయునికి కూడా వర్ణ పంకిలము పులుముతున్నారని, 'కాకులందు మాలకాకి, మాదిగ కాకి' వారి విరోధములను బహిర్గతం చేస్తున్నాయని ఇరువర్గాలను చూసి ఆ కవిచక్రవర్తి విస్మయంతో బాధ పడ్డాడు. ప్రాబల్య వర్గాల, సవర్ణ హిందువుల ఆధిపత్యాన్ని అవహేళన చేస్తున్నారు కానీ దళితులు తమ తప్పులను తెలుసుకోవటం లేదని జాషువ హితవు చెప్పాడు. రోదసీలోకి కూడా సునాయాసంగా ప్రయాణం చేసే ప్రజ్ఞాశాలియైన మానవుడు 'పరస్పర విద్వేష విషాద చండశిఖ'ను ఆర్పలేక పోతున్నాడని వ్యాఖ్యానించాడు. "చండా లత్వంబొక పక్క/ గుండెలు తిని వేయుచుండ గొప్పల కొరకై/ యొండొరులుకలహమాడుచు/ నుండెదరా" అని జాషువ దళితుల దయనీయమైన పరిస్థితిని సూటిగా దూషించాడు. బహుజనుల మధ్య రగులుతున్న అంతర్గత వైషమ్యాలను కూడా జాషువ విమర్శించాడు. "మా చాకలి వారు మంగలియు జాతుల గొప్పదనాల కోసమై /బాకులు బట్టి నిల్చెదరు పంచమజాతియున్ రెండు ముక్కలై/ తాకదు ముట్టదని' దళితులతో పాటు బహుజనులకు ఆయన లెక్కలేని చివాట్లు పెట్టాడు. ఒక్కొక్క కులానికి ఒక్కొక్క పదవి కట్టబెట్టటం ద్వారా ఆ కుల చైతన్యాన్ని నీరుగార్చవచ్చునని రాజకీయ నాయకులు భావిస్తారని, ఈ పదవుల వలలో చిక్కుకోవద్దని దళితులకు జాషువ సూచించాడు. "ఐకమత్య బలవర్ధన రజ్జువు నుండి భిన్నమై తొలగిన నూలు పోగులకు తోరపు చిక్కులు రాకపోవునే" అని జాషువ హెచ్చరించాడు.

◆ **డాక్టర్ కోయి కోటేశ్వర రావు**
ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్

(నేడు గుర్రం జాషువ జయంతి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com



అత్యాశే చేటు

- సులభ రీతిలో డబ్బు సంపాదనకు కక్కుర్తి
- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్న అమాయకులు
- లక్షల రూపాయలు కోల్పోతున్న వైనం
- ఇటీవల కమిషనరేట్‌లో పెరుగుతున్న సైబర్ నేరాలు
- ఆరు నెలల్లో 126 కేసులు నమోదు
- రూ.9కోట్లకు పైగా కాజేసిన మోసగాళ్లు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 27: కష్టపడకుండా, సులువుగా పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించాలనే అత్యాశతో పలువురు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి నష్టపోతున్నారు. అత్యాశపరులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు గాలం వేస్తూ లక్షల్లో కాజేస్తున్నారు. వివిధ రకాలుగా ప్రలోభాలకు గురిచేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. రోజుకో కొత్తరకం మోసంతో అత్యాశపరులను మోసం చేస్తున్న సంఘటనలు ప్రస్తుతం విరివిగా సాగుతున్నాయి. దేశ వ్యాప్తంగా మోసాల పరంపర కొనసాగుతుండగా వరంగల్ కమిషనరేట్ పరిధిలో సైబర్ మోసాలకు బలవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. సైబర్ మోసాలను అరికట్టేందుకు రాష్ట్ర పోలీసు శాఖ సైబర్ పోలీస్ స్టేషన్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినప్పటికీ నేరాలను కట్టడి చేయలేని స్థాయిలో మోసాలు పెరుగుతున్నాయి. సైబర్ నేరాలపై వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నిరంతర సమీక్షలు జరుపుతున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. సైబర్ పోలీస్‌స్టేషన్‌కు విరివిగా ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. ఫిర్యాదులు ఇస్తున్న బాధితుల్లో ఎక్కువమంది రూ.లక్షల్లో మోసపోతున్నవారే ఉన్నారు. వారిలో చిరువ్యాపారుల నుంచి ఐటీ ఉద్యోగుల వరకు ఉంటున్నారు.

మోసాల్లో ప్రధానంగా..

సైబర్ నేరగాళ్లు పలు రకాల మోసాలతో లక్షలు కాజేస్తున్నారు. టెక్నాలజీని వాడుకుంటూ రోజుకో కొత్తరకం మోసాన్ని తెరపైకి తీసుకువస్తున్నారు. పెట్టిన పెట్టుబడికి రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశచూపి లక్షలు కాజేస్తున్నారు. కొందరు ఫేక్ వెబ్‌సైట్ సృష్టించి పలు ఫోన్‌నంబర్లకు లింక్‌లు పంపుతారు. పెట్టిన పెట్టుబడికి రెట్టింపు సంపాదించవచ్చని ఆశ చూపుతారు. లింక్ లాగిన్ అయ్యాక కొంత మొత్తం జమ చేయాలని మెసేజ్ వస్తుంది. ఇందుల్లో నేరగాళ్లకు సంబంధించిన సభ్యులుండి.. వారిలో ఒకరికి రెట్టింపు డబ్బులు వచ్చినట్లు చూపిస్తారు. అది చూసిన వారు డబ్బులు పంపుతారు. లాగేకాడికి లాగాక వెబ్‌సైట్‌ను తీసేస్తారు. అలాగే మరికొందరు ధని లోన్, ఇండియా బుల్స్ లోన్స్ పేరిట పేస్‌బుక్‌లో అడ్వర్టైజ్‌మెంట్ ఇస్తారు. ఇది చూసిన వారు లోన్ ప్రయత్నించగానే ప్రాసెసింగ్ ఫీజు చెల్లించమంటారు. డబ్బులు చెల్లించాక ఫేక్ అకౌంట్ క్లోస్ చేస్తారు. రూ.5లక్షల లోన్ కోసం రూ.3లక్షల వరకు చెల్లించిన బాధితులున్నారు. మరో మోసంలో ఫోన్ నంబర్లకు వీడియో కాల్ వస్తుంది. కాల్ లిఫ్ట్ చేయగానే న్యూడ్‌గా ఒక అమ్మాయి పోటో కనిపిస్తుంది. కాల్ కట్ చేసి అమ్మాయి ఫొటో ట్యాగ్ చేసి గ్రూపుల్లో పెడుతామని బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు గుంజుతారు. ఇదేకాక సిమ్ స్వాపింగ్ మోసం ఒక పద్ధతి. మన సిమ్ నేరగాళ్ల వద్ద యాక్టివేట్ అవుతుంది. ఓటీపీ పంపుతారు. ఓపెన్ చేయగానే ఫోన్ నంబర్ ద్వారా అకౌంట్ నంబర్ తెలుసుకుని ఖాతాలోని డబ్బులు కాజేస్తారు. ఇంకోరకరంలో వాట్సాప్‌కు ఏపీకే ఫైల్ వస్తుంది. క్లిక్ చేయగానే మన నంబర్ హ్యాక్ అవుతుంది. హ్యాక్ అయిన నంబర్‌కు సంబంధించిన వ్యక్తి బ్యాంక్ ఖాతా, అందులో ఉన్న డబ్బుల వివరాలు తెలుస్తుంది. మొత్తం కాజేస్తారు.

ఆరు మాసాల్లో 126 కేసులు

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 2వ తేదీ ఏప్రిల్ 2024న సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ కమిషనరేట్ ఆవరణలో ప్రారంభమైంది. బాధితుల ఫిర్యాదు కోసం 1930 నంబర్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభమైన ఆరు మాసాల్లో కమిషనరేట్ పరిధిలో 126 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో రూ.9కోట్ల 73లక్షలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. పోలీసులు ఇప్పటి వరకు 17మంది నేరగాళ్లను అరెస్టు రూ.9లక్షల 74వేలు బాధితులకు అందించారు. పలు కేసుల్లో నేరస్తులను పట్టుకుని విచారిస్తున్నారు. చాలానేరాల్లో ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించినవే. ప్రస్తుతం కమిషనరేట్ పరిధిలో విరివిగా సైబర్ నేరాల ఫిర్యాదులు అందుతున్నాయి.

నేరాల్లో కొన్ని...

- హనుమకొండకు చెందిన ఐటీ ఉద్యోగి జూలై మాసంలో రూ.85లక్షలు ఇన్వెస్ట్‌మెంట్ పేరిట మోసపోయాడు.
- పర్వతగిరికి చెందిన ప్రైవేటు ఉద్యోగి రూ.71లక్షల 58వేలు జూలై మాసంలో ఇన్వెస్ట్‌మెంట్ పేరిట మోసపోయి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.
- హనుమకొండ సుబేదారి ప్రాంతానికి చెందిన ఐటీ ఉద్యోగి ఇన్వెస్ట్‌మెంట్ పేరిట రూ.6లక్షల 6వేలు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయాడు.
- జనగామకు చెందిన ప్రైవేటు ఉద్యోగి మే మాసంలో లోన్ వస్తుందనే ఆశతో రూ.20లక్షలు మోసపోయాడు.
- కాజీపేటకు చెందిన ప్రైవేటు ఉద్యోగి జూలైలో సిమ్ స్వాపింగ్ మోసానికి గురై రూ.8లక్షల 9వేలు పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- జనగామకు చెందిని ప్రభుత్వ ఉద్యోగి ఏపీకే ఫైల్ ఓపెన్ చేసి తన ఖాతాలోని రూ.11లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ నేరం ఆగస్టులో జరుగగా బాధితుడు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



కె.విజయ్‌కుమార్, ఏసీపీ, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్

సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలి. విద్యాసంస్థల్లో, పబ్లిక్ గ్యాదరింగ్ ప్రదేశాల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నేరం జరిగిన వెంటనే 1930 నంబర్‌కు గంటలోపు (గోల్డన్ అవర్) కాల్ చేయడం శ్రేయస్కరం. గంటలోపు కాల్‌చేస్తే సైబర్ నేరస్తుడు బాధితుల బ్యాంక్ నుంచి డబ్బులు విత్‌డ్రా చేసుకోవడం నిలిపివేసే అవకాశం ఉంటుంది. కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాల కట్టడి చర్యలు తీసుకుంటున్నాం. ఫిర్యాదులు అందిన వెంటనే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తున్నాం. పలు కేసులను ఛేదించగలిగాం.

చెస్ దిగ్గజాలకు సీఎం ప్రోత్సాహం

- జిల్లా క్రీడాకారుడు ఇరిగేసి అర్జున్‌కు రేవంత్‌రెడ్డి అభినందన
- రూ. 25లక్షల నజరానా అందజేత



అంతర్జాతీయ చెస్ దిగ్గజం ఇరిగేసి అర్జున్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో హారిక, మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే నాయిని

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 27: హంగేరిలోని బుడాపెస్ట్‌లో ఇటీవల జరిగిన 45వ ప్రపంచ చెస్ ఒలంపియాడ్‌లో భారత్‌కు స్వర్ణ పతకాలు అందించడంలో కీలక భూమిక పోషించిన హనుమకొండకు చెందిన చెస్ గ్రాండ్ మాస్టర్ ఇరిగేసి అర్జున్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ప్రపంచచెస్ ఒలింపియాడ్‌లో ఎత్తుకు పైఎత్తు వేస్తూ జిల్లాకు చెందిన అర్జున్, ఏపీలోని గుంటూరుకు చెందిన ద్రోణవల్లి హారిక స్వర్ణ పతకాలు సాధించి స్వదేశానికి తిరిగి వచ్చారు. ఈ క్రమంలో అర్జున్, హారిక శుక్రవారం జూబ్లీహిల్‌లోని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మార్యద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కీర్తి, ప్రతిష్ట లను విశ్వవ్యాప్తం చేసిన వారిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించి జ్ఞాపికలు అందజేయడంతో పాటు ఒక్కొక్కరి రూ.25లక్షల చొప్పున నజరానా అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) చైర్మన్ కె.శివసేనారెడ్డి, సాట్ ఎండీ సోనీబాలాదేవి, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

గొప్ప ప్రజ్ఞాశాలి కొండా లక్ష్మణ్ బాపూజీ

- ఎంపీ కడియం కావ్య
- ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి
- కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి నివాళులర్పించిన ఎంపీ



కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య, కలెక్టర్ ప్రావీణ్య, తదితరులు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 27: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించి రాజకీయ నాయకుడిగానే కాకుండా రాజనీతిజ్ఞుడిగా విశేష కీర్తి పొంది చరిత్ర పుటల్లో స్వయం కృషితో తన పేరును లిఖించుకున్న గొప్ప ప్రజ్ఞాశాలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యలు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలుచల్లి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీ కావ్య మాట్లాడుతూ.. బాపూజీ ఉద్యమాలే జీవితంగా బతికి తన సర్వస్వాన్ని ప్రజల కోసం ధారపోసిన ధీశాలి అన్నారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకోవడమే కాకుండా తెలంగాణ వచ్చే వరకు ఏ ఒక్క పదవిని తీసుకోనని చెప్పి ఆచరించిన మహా నిష్ఠాగరిష్ఠుడు అన్నారు. అనంతరం ఎంపీ కావ్యను జిల్లా పద్మశాలీ సంఘం నాయకులు శాలువా కప్పి సన్మానించారు. జయంతి వేడుకలలో డీఆర్‌వో వై.వి.గణేష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు జి.రాంరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బచ్చు ఆనందం, శ్రమశక్తి అవార్డు గ్రహీత కుసుమ శ్యాంసుందర్, పద్మశాలీ సంఘం నాయకులు, కులస్థులు, వివిధ బీసీ కులస్థులు పాల్గొన్నారు.



వరంగల్ మెడికల్, సెప్టెంబరు 27: కాకతీయ మెడికల్ కాలేజీ ఉత్సవం ఉత్కర్ష -24 శుక్రవారం ముగిసింది. చివరిరోజు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వైద్యవిద్యార్థులు ప్రదర్శనలు అందరినీ అలరించాయి. అనంతరం బహుమతి ప్రదానం నిర్వహించారు. కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, మాజీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఏఎస్‌ఆర్ లక్ష్మీ, డాక్టర్ రమేశ్‌రావు, ఫ్యాకల్టీ, అలుమినీ డాక్టర్లు పాల్గొని విద్యార్థులు ప్రోత్సహించారు.

ప్రభుత్వ భూముల నివేదిక అందజేయాలి

- అక్రమ మైనింగ్ జరగకుండా చర్యలు చేపట్టాలి
- ధర్మసాగర్, వేలేరు మండలాల అభివృద్ధికి అధికారులు సహకరించాలి
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 27: ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా భూముల వివరాలపై నివేదికను అందజేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వి ఎసీ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యతో కలిసి ఎమ్మెల్యే శ్రీహరి ధర్మసాగర్, వేలేరు మండలాలకు సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. భూముల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. వేలేరు మండలానికి సంబంధించి తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వస్థలాన్ని గుర్తించి నివేదిక అందజేయాలన్నారు. మండలాల్లోని గురుకులాల పాఠశాలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే ప్రతిపాదనలు కలెక్టర్‌కు అందజేస్తే అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా నిధులు కేటాయిస్తారన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో మెరుగైన సదుపాయాలను కల్పిస్తూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటమే తన ధ్యేయమన్నారు. మిషన్ భగీరథలో తాగునీటి సౌకర్యం కల్పించాలని, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే దసరా, దీపావళి పండగల సందర్భంగా రహదారులు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేలేరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఉన్నతీకరించడానికి తగిన ప్రతిపాదనలను అందజేయాలన్నారు. పెద్దపెండ్యాల, మల్లికుదుర్ల గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా మార్చడానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖలకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలన్నారు. ధర్మసాగర్, వేలేరు మండలాలకు వివిధ శాఖల అధికారులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, సమన్వయం, నిబద్ధతతో పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. రెండు మండలాల పరిధిలో అక్రమ మైనింగ్ జరగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. వేలేరులోని కస్తూర్బా పాఠశాల భవనంపై మరో అంతస్థు నిర్మాణం చేయాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ కోరగా, వెంటనే ఎమ్మెల్యే స్పందించి నిర్మాణానికి కావాల్సిన నిధులను అందించాలని కలెక్టర్‌కు సూచించారు.

కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ.. ధర్మసాగర్, వేలేరు మండలాల అభివృద్ధికి కావాల్సిన నిధులను అందజేస్తామన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను నాణ్యతగా, వేగవంతంగా పూర్తిచేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ సమీక్షలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి, డీఈవో వాసంతి, వివిధ శాఖల ఉన్నతాధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

కాకతీయుల కట్టడాలను పరిరక్షించాలి

- వారి గొప్పదనం విద్యార్థులు తెలుసుకోవాలి
- ఎంపీ నిధులతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి
- ప్రపంచ పర్యాటక దినోత్సవంలో ఎంపీ కడియం కావ్య
- కోటలో ఘనంగా కార్యక్రమం

వివరాలు 7లో..

కేటీఆర్ వ్యాఖ్యలపై మహిళా కాంగ్రెస్ నిరసన

దమ్ముంటే నగరాభివృద్ధిపై ఎమ్మెల్యే నాయినితో చర్చకు రావాలని సవాల్

నయీంనగర్ బ్రిడ్జి వద్దే ప్రజాసమక్షంలో చర్చిద్దామంటూ వెల్లడి



నిరసన తెలుపుతున్న మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సరళాదేవి, తదితరులు

హనుమకొండ సిటీ, సెప్టెంబరు27: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు నిరసన తెలిపారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ నయీంనగర్ బ్రిడ్జి వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సరళాదేవి మాట్లాడుతూ.. మాజీ మంత్రి కేటీఆర్ పరోక్షంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిపై విమర్శలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. పశ్చిమ నియోజవర్గంలో అభివృద్ధి తమ హయాంలోనే జరిగిందని, వాటికి తన ఘనతగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చాటుకుంటున్నారనే ధోరణిలో కేటీఆర్ వ్యాఖ్యలు చేశారని సరళాదేవి చెప్పారు. పదేళ్ల పాలనలో హనుమకొండ నయీంనగర్ బ్రిడ్జిని బీఆర్‌ఎస్ ఎందుకు పూర్తి చేయలేదో ఆ పార్టీ నేతలు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఏం చేశాడో కేటీఆర్ వివరించాలన్నారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో పశ్చిమ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. ఈ వర్షాకాలంలో వరదలు వచ్చినా హనుమకొండ ప్రాంతం ముంపునకు గురికాలేదనేది గుర్తించాలన్నారు. మాజీ కేటీఆర్‌కు దమ్ముంటే నగరాభివృద్ధిపై ఈ నెల 30న చర్చకు రావాలని సవాల్ విసిరారు. ప్రజాసమక్షంలో నయీంనగర్ బ్రిడ్జి వద్దే ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చర్చకు సిద్ధంగా ఉంటారని తెలిపారు. సవాల్‌ను కేటీఆర్ స్వీకరించాలని, లేకుంటే అవాస్తవ విమర్శలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు స్రవంతి, మేరి పాల్గొన్నారు.

దళారులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు

- ఉల్లి, వెల్లుల్లి ధరలను నియంత్రించండి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు
- కాళోజీ జంక్షన్‌లో ఆందోళన



కాళోజీ జంక్షన్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

బాలసముద్రం, సెప్టెంబరు 27: నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించకుండా దళారులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ము కాస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఆరోపించారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ జంక్షన్ వద్ద ఉల్లిగడ్డ, అల్లం వెల్లుల్లి, నిత్యావసర ధరల పెరుగుదలను నిరసిస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి 3వసారి మోదీ అధికారంలోకి వచ్చినప్పటికీ ధరలను నియంత్రించకపోవడం శోచనీయమన్నారు. దేశంలో ఉల్లి, వెల్లుల్లి కొరత లేకున్నా దళారులు కృత్రిమ కొరత సృష్టించి ధరలు భారీగా పెరగడానికి కారణమవుతున్నారని, అలాంటి దళారులు, బ్లాక్ మార్కెట్‌దారులపై చర్యలు తీసుకోకుండా వారికి కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వలు చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా నిత్యావసరధరలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, లేకుంటే ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు అశోక్ స్టాలిన్, మండ సదాలక్ష్మీ, జిల్లా నాయకులు మునిగాల భిక్షపతి, సంతోష్, కర్రె లక్ష్మణ్, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, బత్తిని సదానందం, మాలోతు శంకర్‌నాయక్, నిమ్మల మనోహర్, రాసమల్ల దీన, అనుకూరి అశోక్‌తోపాటు పెద్ద సంఖ్యలో సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేయూ భూముల వివాదంలో అశోక్‌బాబుకు షోకాజ్ నోటీసులు

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 27: కేయూ భూముల సర్వేపై వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారాలు చేసిన ఆర్ట్‌అండ్‌సైన్స్ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ (ఏఆర్) పెండ్లి అశోక్‌బాబుకు కేయూ రిజిస్ట్రార్ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కేయూ అధ్యాపక సంఘం (ఆకుట్), విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు సర్వేనెంబర్ 229లో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. 2020లో కేయూ భూముల పరిరక్షణ కమిటీ కన్వీనర్‌గా ఉన్న పెండ్లి అశోక్‌బాబుకు తన ఇళ్లు కేయూ భూమిలో ఉందని తెలిసి కూడా తనకు తాను కమిటీ నుంచి వైదొలగకుండా కమిటీతో ఉద్దేశకపూర్వకంగానే సన్నిహితంగా ఉన్నాడని నోటీసులో పేర్కొన్నారు. 2023లో ఆయన కమిటీ కన్వీనర్ బాధ్యతల నుంచి తొలిగించి విజిలెన్స్, మునిపాలిటీ, రెవెన్యూ ఆధ్వర్యంలో సర్వే చేయగా 229 సర్వేనెంబర్‌లో పెండ్లి అశోక్‌బాబుతోపాటు, మరి కొంత మంది నిర్మాణం చేసినట్లు గుర్తించారు. కాగా, బాధ్యతాయుతమైన ఉద్యోగిగా ఉండి కేయూ భూమిలో ఇళ్ల నిర్మాణం చేయడమే కాకుండా సర్వే సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టే విధంగా తప్పుడు ప్రచారాలు చేసిన అశోక్‌బాబుపై క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో మూడురోజుల్లో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసుల్లో పేర్కొన్నారు.

127 కిలోల గంజాయి పట్టివేత

గాలివారి గూడెంలో రూ.31.75 లక్షల విలువైన సరుకు స్వాధీనం



మరిపెడలో మాట్లాడుతున్న మానుకోట ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 27 : గంజాయిపై మహబూబాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగం ఎప్పటికప్పుడు హైఅలర్ట్‌గా ఉంటుందని ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ అన్నారు. మత్తుపదార్థాల విక్రయం, రవాణా చేసేవారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. శుక్రవారం మరిపెడ మండలం గాలివారిగూడెం ఏఎస్ఆర్ గార్డెన్ దగ్గర మరిపెడ ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ తన సిబ్బందితో వాహన తనిఖీ చేస్తుండగా ఓ కారులో సీలేరు నుంచి హైదరాబాద్‌కు 127 కిలోల శుద్ధి చేసిన గంజాయి తరలిస్తుండగా పట్టుబడింది. ఎస్పీ మరిపెడ పీఎస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా కుంటా మండలం అసీర్‌గూడెంకు చెందిన రెవెన్యూ ఉద్యోగి సోడి నాగేశ్వర్‌రావు క్విడ్ రినాల్ట్ కారులో శుద్ధిచేసిన 62 ప్యాకెట్లు (127 కిలోల) గంజాయిని సీలేరు నుంచి హైదరాబాద్ తరలిస్తున్నారు. ఈ క్రమంలో మరిపెడ పోలీసులకు చిక్కారు. గంజాయిని, ఆ కారు సీజ్‌చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.31.75 లక్షలు ఉంటుదని ఎస్పీ పేర్కొన్నారు. స్థానిక ఎస్సైలు సతీశ్‌గౌడ్, సంతోష్, ట్రైనీ ఎస్సై అశోక్‌ను ప్రశంసించి, రివార్డు అందచేశారు. పలువురు పీసీలకు సైతం నగదు పారితోషకం అందించారు. మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జూడో పోటీల్లో గురుకుల విద్యార్థులకు స్వర్ణ పతకాలు



బహుమతులు గెలుచుకున్న విద్యార్థినులు

మడికొండ, సెప్టెంబరు 27: వరంగల్ పోచమ్మమైదాన్‌లోని కెమిస్ట్రీ భవన్‌లో ఈనెల 25, 26 తేదీలలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి యా ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు స్వర్ణపతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వ రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 14 విభాగంలో జి. దీపిక, కె. సహజ, తహసీయత, హిమవర్షిణి స్వర్ణపతకాలు, కె. సహస్ర కాంస్య పతకం సాధించారన్నారు. స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థినులు అక్టోబరు 3 నుంచి 7 వరకు గుజరాత్‌లోని మెహసాన్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్పష్టం చేశారు. ఈసందర్భంగా జూడో శిక్షకులు నాగరాజు, పీడీ పద్మ, పీఈటీ సరిత సహకరించిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందాన్ని, పతకాలు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఎన్‌పీడీసీఎల్‌లో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం

సుదీర్ఘకాలం తర్వాత బదిలీలు.. జారీ అయిన మార్గదర్శకాలు

హనుమకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ నార్తరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) పరిధిలో పనిచేసే విద్యుత్ ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి శుక్రవారం మార్గదర్శకాలను జారీ చేశారు. ఒకే చోట రెండేళ్లకు మించి పనిచేస్తున్న ఉద్యోగులను మొత్తం క్యాడర్ స్ట్రెంత్‌లో 50శాతం మించకుండా బదిలీ చేస్తారు. వివిధ ఉద్యోగు సంఘాల్లో పని చేస్తున్న జిల్లా స్థాయి ప్రతినిధులు, ఇంకో ఏడాదిలో రిటైర్ అయ్యే ఉద్యోగులు, భార్యాభర్తలయిన ఉద్యోగులు (స్పౌజ్ కేసు), దివ్యాంగులైన ఉద్యోగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, ప్రత్యేకావసరాల పిల్లలు కలిగిన ఉద్యోగులకు బదిలీల్లో వెసులుబాటును కల్పించారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని పదహారు జిల్లాల్లో వివిధ కేడర్లలో బదిలీ అయ్యే అవకాశం ఉన్నవారి వివరాలతో కూడిన జాబితాను ఈనెల 28వ తేదీన అన్ని సర్కిల్ కార్యాలయాల్లో అలాగే ఎంప్లాయిస్ ట్రాన్స్‌ఫర్ పోర్టల్‌లో ప్రదర్శిస్తారు. ఇందుకు సంబంధించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 30వ తేదీ వరకు స్వీకరిస్తారు. ఉద్యోగుల నుంచి బదిలీల్లో ఐచ్ఛికాలను పేర్కొంటూ దరఖాస్తులను అక్టోబర్ 4వ తేదీ సాయంత్రం 5.30గంటల వరకు స్వీకరిస్తారు. అక్టోబర్ 7వ తేదీన బదిలీ ఉత్తర్వులను జారీ చేస్తారు. బదిలీ అయిన ఉద్యోగులంతా అక్టోబర్ 9వ తేదీలోగా రిలీవ్ కావలసి ఉంటుంది. బదిలీలపై నిషేధం మళ్లీ అక్టోబర్ 8వ తేదీ నుంచి అమలులోకి వస్తుంది. నిషేధం అమలులోకి వచ్చిన తర్వాత కొన్ని ప్రత్యేకమైన కేసుల్లో మినహా ఇక ఎలాంటి బదిలీలు ఉండవు.

బదిలీ అయ్యే ఉద్యోగులు

డివిజనల్ క్యాడర్ ఉద్యోగులు అయిన లైన్ ఇన్స్‌పెక్టర్లు మొదలు కొని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) ఉద్యోగులను వారు ప్రస్తుతం పనిచేస్తున్న సెక్షన్ నుంచి బయటి సెక్షన్‌కు డివిజనల్ ఇంజనీర్ బదిలీ చేస్తారు. సర్కిల్ కేడర్ ఉద్యోగులైన సబ్‌ఇంజనీర్లు, జేఏవో, ఎఫ్ఎం, ఎస్ఎల్ఐ, జనరల్ సర్వీస్‌లో పనిచేస్తున్న సిబ్బంది మొదలు అకౌంటింగ్ విభాగంలో పని చేసే ఉద్యోగులను అదే సర్కిల్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న సబ్ డివిజన్ నుంచి మరో డివిజన్‌కు సూపరింటెండింగ్ ఇంజనీర్ బదిలీ చేస్తారు. అలాగే హనుమకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న జేఏవోలు మొదలు.. సబ్ ఇంజనీర్ల వరకు వివిధ సెక్షన్లకు లేదా వివిధ ప్రదేశాలు, విభాగాలకు కార్పొరేట్ కార్యాలయం సంబంధిత ఉన్నతాధికారి బదిలీ చేస్తారు. 2024 జూన్ 30వ తేదీ నాటికి ఒకే చోట రెండేళ్లు పని చేసిన ఏఈ, ఏఏఈ, ఏడీఈ (ఎలక్ట్రికల్) క్యాడర్ ఉద్యోగులను సూపరింటెండెంట్ సర్కిల్‌పరిధిలోని వివిధ డివిజన్లకు, కార్పొరేట్ కార్యాలయం బయటి సర్కిల్‌కు బదిలీ చేస్తారు.

కార్పొరేట్ కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు అయిన ఏఈ, ఏఏఈ, ఏడీఈ (ఎలక్ట్రికల్) ఉద్యోగులను హెడ్‌క్వార్టర్ బయటకు, లేదా సర్కిల్ బయటకు బదిలీ చేస్తారు. అలాగే ఏఈ, ఏఏఈ (సివిల్) అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లను ఇదే సర్కిల్ లేదా వారి అభ్యర్థన మేరకు బయట సర్కిల్‌కు బదిలీ చేస్తారు. ఏఈఈ (సివిల్) డివిజనల్ ఇంజనీర్ ఉద్యోగులను వారు పని చేస్తున్న సర్కిల్ పరిధిలో లేదా బయట సర్కిల్‌లోని వేరే ప్రాంతాలకు బదిలీ చేస్తారు. అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ ఎకౌంట్స్ ఆఫీసర్లను సర్కిల్ బయట వేరు వేరు ప్రాంతాలకు బదిలీ చేస్తారు. పీఅండ్‌జీ సర్వీస్‌కు సంబంధించిన అసిస్టెంట్, జూనియర్ పర్సనల్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్రెటరీ ఉద్యోగులను కార్పొరేట్ కార్యాలయంలో లేదా సర్కిల్‌లోని వేరే సెక్షన్లలోకి బదిలీ చేస్తారు ఉద్యోగుల బదిలీలు నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా జరుగుతాయని, బదిలీల సందర్భంగా ఉద్యోగులు పైరవీలకు పాల్పడినా, లేదా ఎవరికైనా లంచాలు ఇచ్చినా అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్టు సీఎండీ వరుణ్‌రెడ్డి హెచ్చరించారు. ప్రలోభాలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.



భద్రకాళి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

భద్రకాళి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన సీఎం

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 27: ప్రసిద్ధిగాంచిన వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి ఆలయ ఈవో శేషు భారతి, అర్చకులు భద్రకాళి శేషు సీఎంను కలిసి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అక్టోబరు 3 నుంచి 12వరకు జరిగే దేవి శరన్నవరాత్రి మహోత్సవాల వాల్ పోస్టర్‌ను సీఎం ఆవిష్కరించారు. ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సీఎం ను కోరారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి

అఖిల భారత పద్మశాలీ సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం



బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఈగ మల్లేశం

ఆటోనగర్, సెప్టెంబరు 27: తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. గ్రేటర్ వరంగల్ కొత్తవాడలో బాపూజీ 109వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. మల్లేశం బాపూజీ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతూ లక్ష్మణ్ బాపూజీ ఆదిలాబాద్ జిల్లా వాంకిడిలో 1915వ సంవత్సరం సెప్టెంబరు 27న జన్మించాడని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో నిరంకుశ వ్యతిరేక ఉద్యమంలో బాపూజీ చురుకుగా పాల్గొన్నాడన్నారు. 1952లో ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ శాసనసభలకు ప్రాతినిధ్యం వహించి, ఆ తర్వాత కూడా శాసనసభ్యుడిగా ఎన్నికై 1971 వరకు కొనసాగారన్నారు. బాపూజీ 1969లో మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలివేశాడని కొనియాడారు. సెప్టెంబరు 21, 2012లో హైదరాబాద్‌లో బాపూజీ 97 సంవత్సరాల వయస్సులో మరణించాడని తెలిపారు. బాపూజీకి భారతరత్న దక్కాలని అవసరమైన సిఫారసులను తెలంగాణ ప్రభుత్వం చేపట్టడంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా అందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసినట్టు మల్లేశం తెలిపారు. భావి తరాలకు బాపూజీ జీవిత చరిత్ర తెలసే విధంగా పాఠ్యాంశాలలో పొందుపరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు గుండు ప్రభాకర్, వడ్నాల నరేందర్, గుండేటి నరేంద్రకుమార్, ఆడేపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 27: ఆవోపా హనుమకొండ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరానికిగాను బంగారు పతకాలను అందించనున్నట్లు ఆవోపా అధ్యక్షులు వల్లాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఇమ్మడి పుల్లయ్య, విద్యా కమిటీ చైర్మన్ దేసు సదానందంలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 2023- 24 విద్యాసంవత్సరంలో 10వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు 61 కోర్సులకు ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆవోపా హనుమకొండ సుబేదారిలో ఉన్న కార్యాలయంలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 9440636447, 9949875510 నెంబర్లలో సంప్రదించాలని వారు ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

'మేడిగడ్డ' నిర్మాణ సంస్థకు గుబులు

● బ్యారేజీ కంప్లీషన్ సర్టిఫికెట్ రద్దుతో కలవరం ● తొలుత మరమ్మతులను నిరాకరించిన ఎల్‌అండ్‌టీ
● రూ.500 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదన.. ● ఆతర్వాత రూ.155 కోట్లతో తాత్కాలిక మరమ్మతులు



మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 27: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ కంప్లీషన్ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం రద్దు చేయడంతో బ్యారేజీ నిర్మాణ సంస్థలో గుబులు మొదలైంది. ఇప్పటి వరకు బ్యారేజీ తాత్కాలిక మరమ్మతుల కోసం వెచ్చించిన రూపాయలతో పాటు శాశ్వత మరమ్మతుల భారం నిర్మాణ సంస్థపైనే పడుతుందనే ఆందోళనలో పడింది. తొలుత బ్యారేజీ కుంగుబాటుకు గురికాగా శాశ్వత ప్రాతిపదికన మరమ్మతుల కోసం రూ.500 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి నిర్మాణ సంస్థ ప్రతిపాదించింది. కానీ, నిర్మాణ సంస్థే ఖర్చులు భరించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే తాత్కాలిక మరమ్మతులు చేపట్టకపోతే కుంగుబాటు మరింత విస్తరించే అవకాశం ఉందని నిర్మాణ సంస్థ ఎల్ అండ్‌టీ భావించింది. తాత్కాలిక మరమ్మతులకు ఉపక్రమించి పనులు చేపట్టింది. అయితే తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.155 కోట్లు వెచ్చించడంతో పాటు ఇతర పరీక్షల నిమిత్తం ఆ మొత్తాన్ని విడుదల చేయాలని నిర్మాణ సంస్థ ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించింది. కంప్లీషన్ సర్టిఫికెట్‌ను రద్దు చేయడంతో ఆ భారం నిర్మాణ సంస్థే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కంప్లీషన్ సర్టిఫికెట్ రద్దు కావడంతో బ్యారేజీ శాశ్వత మరమ్మతుల భారం తమపైనే పడుతుందని నిర్మాణ సంస్థ ఆందోళనలో పడినట్లు తెలిసింది. అయితే.. అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ అఫ్కాన్ కంపెనీ, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణ సంస్థ నవయుగ కంపెనీ మరమ్మత్తుల కోసం పెట్టిన ఖర్చుల మొత్తాన్ని భరించాయి. కానీ, మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ మాత్రం తాత్కాలిక మరమ్మతులతో పాటు శాశ్వత మరమ్మతులకు అవసరమయ్యే మొత్తం నిధులు విడుదల చేయాలని కోరింది. ఇదిలా ఉంటే లింక్-1లోని సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో పరీక్షల నిమిత్తం ప్రభుత్వం రూ.5 కోట్లు మాత్రమే కేటాయించింది. కాగా, కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చిన ఇంజనీర్‌తో పాటు ఇతర అధికారులు ఎవరనే చర్చ మొదలైంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు ఘటనతో నిర్మాణ సంస్థ రూ.10వేల కోట్ల విలువ చేసే ప్రాజెక్టులను కోల్పోయినట్లు సమాచారం.

అధికారుల్లో ఆందోళన

మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు నేథప్యంలో సంబంధిత ఇంజనీర్లపై కాళేశ్వరం ఎంక్వైరీ కమిషన్ క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్న వార్తల నేపథ్యంలో అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఏఈఈ నుంచి ఈఎన్‌సీ వరకు సుమారు 20 మంది ఇంజనీర్లపై చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తుండటంతో టెన్షన్ నెలకొంది. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి పనులు పూర్తికాకున్నా అయినట్లు ఇచ్చిన కంప్లీషన్ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం రద్దు చేయడంతో ఇక తమపై చర్యలు తప్పవనే నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చిన ఇంజనీర్‌తో పాటు ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఎవరనే చర్చ మొదలైంది.

ఆర్‌అండ్‌బీలో లంచావతారులు

● పెట్రోల్ బంక్ ఎన్‌వోసీ కోసం లంచం డిమాండ్ ● డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన జనగామ ఈఈ, ఏటీవో



దొరికిన డబ్బులు

జనగామ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రోడ్లు, భవనాల శాఖలోని ఇద్దరు లంచావతారులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ఎన్‌వోసీ జారీ విషయంలో లంచం తీసుకుంటూ ఓ ఈఈ, ఏటీవో అడ్డంగా దొరికిపోయారు. ఈ సంఘటన జనగామ కలెక్టరేట్‌లో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, బాధితుడు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి చిర్ర సత్యపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లింగాలఘనపురం మండలం బండ్లగూడెం గ్రామానికి చెందిన చిర్ర సత్యపాల్ రెడ్డి సతీమణి నీల పేరిట లింగాలఘనపురంలో ఆరు నెలల క్రితం ఓ కంపెనీ పెట్రోల్ బంక్ మంజూరైంది. బంక్ ఏర్పాటు చేసేందుకు గానూ నిబంధనల ప్రకారం జిల్లా పంచాయతీ అధికారి, ఆర్‌అండ్‌బీ ఈఈ, జనగామ ఏసీపీ నుంచి 'నో అబ్జక్షన్'(ఎన్‌వోసీ) తీసుకురావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఎన్‌వోసీ కోసం ఆర్‌అండ్‌బీ ఈఈ చిలుకపాటి హుస్సేన్‌ను చిర్ర సత్యపాల్‌రెడ్డి ఇటీవల సంప్రదించగా ఎన్‌వోసీ జారీ చేయాలంటే రూ.17 వేలు ఇవ్వాలని హుస్సేన్ డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని సత్యపాల్‌రెడ్డి వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రకించారు. దాంతో ఏసీబీ అధికారుల పథకం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులో ఉన్న ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయంలో హుస్సేన్‌కు సత్యపాల్‌రెడ్డి రూ.12వేలు ఇవ్వగా.. కార్యాలయంలో పనిచేసే అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ రవీందర్‌కు కూడా రూ.2వేలు ఇవ్వాలని హుస్సేన్ సూచించారు. దీంతో సత్యపాల్ రెడ్డి ఇద్దరికీ లంచం ఇచ్చాడు. అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు హుస్సేన్, రవీందర్‌ను అదుపులోకి తీసుకుని, వారు సత్యపాల్‌రెడ్డి నుంచి లంచంగా తీసుకున్న డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. ఈఈ హుస్సేన్, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ రవీందర్‌పై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.


కాగా.. కలెక్టరేట్‌లో ఏసీబీ దాడులతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఆర్‌అండ్‌బీ అధికారులు హుస్సేన్, ఏటీవో రవీందర్ ఏసీబీకి చిక్కారన్న వార్తతో అధికారులు, ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.



మృతి చెందిన మల్లం యాకయ్య

మంత్రాల నెపంతో వృద్ధుడి దారుణ హత్య

మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలంలో ఘటన



మల్లం యాకయ్య (ఫైల్)

నెల్లికుదురు (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 27: మూఢవిశ్వాసాలు ప్రజల ప్రాణాలు తీస్తున్నాయి. అనారోగ్యానికి గురైనా, ఇంట్లో మంచి జరుగకపోయినా మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతో అమాయకులను చంపుతున్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారంలో శుక్రవారం జరిగిన ఓవృద్ధుడి హత్యే ఇందుకు నిదర్శనం. ఈ ఘటనకు సంబంధించి తొర్రూరు సీఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నముప్పారం గ్రామానికి చెందిన మల్లం యాకయ్య (70) ఏళ్ల వృద్ధుడు కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. అదే గ్రామానికి మల్లం రాజు అనే వ్యక్తి తరుచూ జ్వరంతో అనారోగ్యానికి గురవుతున్నాడు. ఈ అనారోగ్యానికి కారణం యాకయ్య అని, తనకు మంత్రాలు చేయడంతోనే రోగాల బారిన పడుతున్నానని, ఆయనను చంపాలని నిర్ణయించుకున్నాడు. చిన్నముప్పారం గ్రామశివారుకు వెళ్తున్న సమయంలో ఉదయం ముత్యాలమ్మగుడి వద్ద మాటువేసి, అటుగా వస్తున్న యాకయ్య తలపై మంచం కర్రతో కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన యాకయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐజగదీష్ వివరించారు. కాగా, రాజును గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మృతుడికి భార్య సోమక్క, కుమారుడు రమేష్, కుమార్తె ఉన్నారు. కుమారుడు రమేష్ ఫిర్యాదుమేరకు నిందితుడు రాజుపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. యాకయ్య మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు సీఐ జగదీష్ తెలిపారు.

పీఆర్‌సీ ఫిట్‌మెంట్ నివేదికను సమర్పించాలి

హనుమకొండటౌన్, సెప్టెంబర్ 27: 51శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ నివేదికను సమర్పించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్-గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం పీఆర్‌సీ కమిషన్ వేసి 5శాతం ఐఆర్ ప్రకటించిందన్నారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి నివేదిక సమర్పించలేదని, ఈ నెలాఖరు వరకు గడువు ఉన్నందున నివేదిక సమర్పించాలన్నారు. జోనల్ వ్యవస్థను రద్దుచేసి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన సీనియారిటీ లిస్టులు తయారు చేసి ఉద్యోగులు నష్టపోకుండా చూడాలన్నారు.

కాకతీయుల కట్టడాలను పరిరక్షించాలి

● ఎంపీ నిధులతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి
● ప్రపంచ పర్యాటక దినోత్సవంలో ఎంపీ కడియం కావ్య ● కోటలో ఘనంగా కార్యక్రమం



ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాలను పరిశీలిస్తున్న ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ సత్యశారద



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ కడియం కావ్య

ఖిలావరంగల్, సెప్టెంబరు 27: కాకతీయుల అద్భుత కట్టడాలు, కళాఖండాలను పరిరక్షించాలని, వాటి ఔన్నత్యాన్ని ముందుతరాలకు తెలియజేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య సూచించారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఖిలావరంగల్ మధ్యకోటలో వరంగల్ జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాకతీయ రాజులు దక్షిణ భారతదేశం, ఓరుగల్లు సామ్రాజ్యాన్ని సుమారు 300 ఏళ్లు పరిపాలించారన్నారు. వారికాలంలో పరిపాలనతోపాటు యుద్ధవిద్యలు, కళలు, అద్భుత కళాఖండాలను నిర్మించారన్నారు. కాకతీయుల చరిత్ర చాలా గొప్పదని, విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. తన నిధుల నుంచి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తానన్నారు.

కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థ, సాంస్కృతిక రంగాల్లో పర్యాటక రంగంపై అవగాహన కలిగి, సంస్కృతులను గౌరవించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. జిల్లాలోని పర్యాటక పర్యాటక ప్రాంతాలను విద్యార్థులు సందర్శించి కాకతీయుల అద్భుత కళాఖండాలు, శిల్పాసౌందర్యాల ప్రాశస్త్యంపై అవగాహన కలిగిఉండాలన్నారు. హాస్పిటాలిటీ సెక్టార్‌లో నైపుణ్యం కలిగిన టూరిస్టు గైడ్‌లుగా, వలంటీర్లుగా విద్యార్థులను తీర్చిదిద్దడం చాలా అవసరమన్నారు. ప్రతీ కళాశాల, పాఠశాలలో ఒక ప్రత్యేక టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసి, వాటి పనితీరుపై బాధ్యత వహించేలా ఫ్యాకల్టీ, స్టూడెంట్ కో-ఆర్డినేటర్‌లను ప్రోత్సహించాలన్నారు. అంతకుముందు కాకతీయ రాజుల కళాఖండాలు, శిల్పసౌందర్యాల గురించి కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖల సిబ్బంది శ్రీకాంత్, రవియాదవ్‌లను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఖిలావరంగల్‌కు వచ్చిన ఎంపీ కావ్యకు కలెక్టర్ స్వాగతం పలికారు. ఖుష్‌మహల్ నుంచి శిల్పాల వరకు కళాశాల, పాఠశాల విద్యార్థులు, అధికా రులు, టూరిజం యూత్ క్లబ్ సభ్యులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధారాణి, జిల్లా టూరిజం అధికారి శివాజీ, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి జ్ఞానేశ్వర్, ఖిలావరంగల్ మండల తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాధికారులు, వివిధ శాఖాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా ములుగు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ములుగు జిల్లాలోని విద్యార్థులను కాకతీయ కట్టడాలను శుక్రవారం సందర్శించారు. కోట, వేయిస్తంభాల దేవాలయం, భద్రకాళీ దేవాలయ తదితర ప్రాంతాలను టూరిజం ప్యాకేజీలో భాగంగా పర్యటించగా, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్ 80మంది విద్యార్థులకు కాకతీయుల చరిత్రను వివరించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



విజేందర్(ఫైల్)



తండ్రి అంత్యక్రియల్లో కూతుర్లు

శంభునిపేట, సెప్టెంబరు 27: ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన మామునూరులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణవేణి, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పర్వతగిరి మండలం చింతనెక్కొండకు చెందిన దబ్బెట వెంకటయ్య, కట్టమ్మ దంపతులకు ఐదుగురు కుమారులు. చిన్నకుమారుడు దబ్బెట విజేందర్ (32) 2012లో కానిస్టేబుల్‌గా ఎన్నికయ్యాడు. కుటుంబ సభ్యులతో రంగశాయిపేటలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న విజేందర్ ప్రస్తుతం తొర్రూర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున విజేందర్ విధులు ముగించుకొని తన ద్విచక్రవాహనంపై రంగశాయిపేటకు బయలుదేరాడు. తొర్రూరు మండలం దంతాలపల్లి నుంచి కర్రలోడుతో నగరానికి వస్తున్న ట్రాక్టర్‌లోని కొన్ని దుంగలు మామునూరు చెరువు కట్ట వద్ద కిందపడ్డాయి. ట్రాక్టర్ డ్రైవర్ బాధ్యతారాహిత్యంగా అలాగే ముందుకు వెళ్లి పోయాడు. దీంతో అదే సమయంలో వెనుకాలే ద్విచక్రవాహనంపై వస్తున్న విజేందర్‌రెడ్డి దుంగలను ఢీకొట్టి అదుపు తప్పి కిందపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మామునూరు ఎస్‌ఐ కృష్ణవేణి ఘటనా స్థలానికి చేరుకొని, పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. విజేందర్‌కు భార్య శ్రావణి, ఇద్దరు కూతుర్లు శాన్వి, విన్సీలు ఉన్నారు. శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ అధికారులపై రాడ్లతో దాడి

'పోడు'ను అడ్డుకునేందుకు వెళ్లిన క్రమంలో దుండగుల దుశ్చర్య

తాడ్వాయి మండలం దామెరవాయి వద్ద ఘటన

ఎక్స్‌కవేటర్ యజమాని సహా ఐదుగురి అరెస్టు



హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అటవీశాఖ అధికారులను పరామర్శిస్తున్న రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ

తాడ్వాయి / ములుగు/ ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 27: అటవీ ప్రాంతంలో ఎక్స్‌కవేటర్ సాయంతో పోడు చేస్తుండగా అడ్డుకున్న అటవీఅధికారులపై ఆ ఎక్స్‌కవేటర్ యజమాని, అతని అనుచరులు ఇనుప రాడ్లతో విచక్షణా రహితంగా దాడి చేసిన సంఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో ఓ సెక్షన్, ఓ బీట్ అధికారి తీవ్రంగా గాయపడ్డారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం దామెరవాయి సమీపంలో గురువారం రాత్రి 11.30గంటల సమయంలో జరిగిన ఈ ఘటన గురించి పోలీసులు, అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామెరవాయి సమీపంలోని అటవీ భూమిలో కొందరు వ్యక్తులు యంత్రాలతో చెట్లను తొలగించి పోడు చేస్తున్నారని తెలుసుకున్న సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారులు శరత్‌చంద్ర, సుమన్, బేస్‌క్యాంపు ఉద్యోగి ఎట్టి శ్రీను, డ్రైవర్ రాజేందర్ గురువారం రాత్రి ఆ ప్రాంతానికి జీపులో వెళ్లారు. ఈ క్రమంలో ఎక్స్‌కవేటర్‌తో యజమాని గంట సూరజ్‌రెడ్డి వారికి ఎదురురాగా.. అతడిని విచారించిన అధికారులు యంత్రాన్ని స్వాధీనం చేసుకుని తాడ్వాయి రేంజ్ కార్యాలయానికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ లోపు విషయం తెలుసుకున్న సూరజ్‌రెడ్డి అనుచరులు అక్కడకు చేరుకుని అధికారుల వాహనాలకు అడ్డు తగిలారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం మొదలై అది కాస్తా పెద్దదైంది. ఈ క్రమంలో సూరజ్‌రెడ్డి, అతని అనుచరులు ఇనుప రాడ్లతో అటవీశాఖ అధికారులపై దాడి చేశారు. ఈ ఘటనలో ఎఫ్‌ఎస్‌వో వినోద్‌కుమార్, ఎఫ్‌బీవో శరత్‌చంద్ర తలలు పగలడంతోపాటు చేతివేళ్లు విరిగాయి. అటవీశాఖకు చెందిన జీపును కూడా వారు ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న తాడ్వాయి పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి గాయపడ్డ అటవీ అధికారులను తాడ్వాయి పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తాడ్వాయి డిప్యూటీ రేంజ్ అధికారి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడ్డ గంట సూరజ్‌రెడ్డి, గంట శశిధర్, పాండవుల సాయి, నీరటి శ్రీకాంత్, మాదరి చంటిపై కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సంఘటనలో గంట శశిధర్ అనే వ్యక్తికి కూడా గాయాలవగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోడు చేసేందుకు ఉపయోగించారని అనుమానంతో పోలీసులు ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. ఇదిలా ఉంటే ఆ యంత్రంతో అటవీ ప్రాంతంలో చెట్లను తొలగించలేదని స్థానికులు చెబుతున్నారు. దామెరవాయికి చెందిన ఓ రైతు తన పట్టా భూమిలో గతంలో జామాయిల్ చెట్లను పెంచగా వాటిని కోసిన అనంతరం భూమిలో ఉన్న మోట్లను తొలగించి చదును చేసేందుకు ఆ యంత్రాన్ని కిరాయికి తెచ్చుకున్నాడని తెలిపారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత పని ముగించుకొని వస్తున్న క్రమంలో అటవీశాఖ అధికారులు అడ్డుకోగా అది ఘర్షణకు దారితీసిందని చెబుతున్నారు. అటవీశాఖ అధికారులపై దాడికి పాల్పడ్డ వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధికారులు డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సెక్షన్, బీట్ అధికారులను వారు పరామర్శించారు. ఇక నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు : ఎస్పీ, కలెక్టర్

విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై ఎవరైనా దాడికి పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రౌడీషీట్, పీడీ యాక్టు సైతం నమోదు చేస్తామని ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీష్ వేర్వేరు ప్రకటనల్లో హెచ్చరించారు. ఇక అటవీశాఖ అధికారులు, సిబ్బందిపై దాడి చేసిన కేసులో గంట సూరజ్‌రెడ్డి, గంట శశిధర్‌రెడ్డి, పాండవుల సాయి, నీరటి శ్రీకాంత్, మాదరి చంటి అనే వ్యక్తులను శుక్రవారం సాయంత్రం కాటాపూర్ క్రాస్‌వద్ద అరెస్టు చేసినట్లు ఎస్పీ శబరీశ్ వెల్లడించారు.

ఫోన్‌లో సీతక్క పరామర్శ

దామెరవాయి దగ్గర జరిగిన దాడి ఘటనలో గాయపడి చికిత్స పొందున్న అటవీశాఖ సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారి శరత్‌చంద్రలను మంత్రి సీతక్క శుక్రవారం ఫోన్‌లో పరామర్శించారు. సీసీఎఫ్, డీఎఫ్‌వోలతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకోవడంతో పాటు గాయపడిన అధికారులకు మెరుగైన వైద్యం అందించాలని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఫారెస్టు అధికారులకు మంత్రి సురేఖ పరామర్శ

రెడ్డికాలనీ, సెప్టెంబరు 27: ములుగు జిల్లా తాడ్వాయి రేంజ్ దామరవాయి బీట్ -2 అటవీ ప్రాంతంలో దుండగులు చేసిన దాడిలో గాయపడి ములుగురోడ్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ వినోద్‌కుమార్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ శరత్‌చంద్రలను అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పరామర్శించారు. శుక్రవారం ఆ ఆస్పత్రికి వెళ్లిన మంత్రి ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. దాడికి దారి తీసిన పరిస్థితులను డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్ మంత్రి సురేఖకు వివరించారు. అధికారులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అటవీ సంపద పరిరక్షణే ధ్యేయంగా సైనికుల్లా పోరాడుతున్న అటవీ అధికారులు, సిబ్బందిని ఇబ్బందులకు గురిచేసే వారు ఏ స్థాయి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. అటవీశాఖ అధికారులపై జరుగుతున్న దాడులు, వారు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నామని, ఈ దిశగా చేపట్టాల్సిన చర్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, అటవీశాఖ ఉన్నతాధికారులతో చర్చిస్తానని మంత్రి తెలిపారు.

నలుగురు వ్యక్తులపై ఫారెస్టు అధికారుల దాడి



ఫారెస్టు అధికారుల దాడిలో గాయపడ్డ మహాముత్తారం ఎస్సీ కాలనీ వాసులు

మహాముత్తారం ఎస్సీకాలనీకి చెందిన వ్యక్తికి తీవ్ర గాయం

మహాముత్తారం, సెప్టెంబరు 27: మహాముత్తారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన తోటపల్లి సమ్మయ్య, రామిండ్ల సురేష్, మంతెన రాజబాపు, గంధం ఎంకయ్య అనే వ్యక్తులపై శుక్రవారం మధ్యాహ్నం ఫారెస్టు అధికారులు దాడి చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... వంట చెరకు కోసం అడవికి వెళ్లిన తాము కట్టెలు పోగు చేసుకుంటుండగా ఇద్దరు ఫారెస్టు అధికారులు వచ్చి తమను అకారణంగా కర్రలతో కొట్టారని తెలిపారు. తాము కట్టెలు సేకరించేందుకు వెళ్లిన ప్రాంతంలో సుమారు వంద ఎకరాల్లో పోడు జరుగుతున్నా పట్టించుకోని ఫారెస్టు అధికారులు వంట చెరకు కోసం వెళ్లిన తమపై దాడి చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు ఫారెస్టు అధికారులపై మహాముత్తారం ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఏఎస్సై మహేందర్‌ను సంప్రదించగా ఫారెస్టు అధికారులు దాడి చేసినట్టు తమకు ఫిర్యాదు అందిందన్నారు. ఈ ఘటనలో తోటపెల్లి సమ్మయ్య చేయి విరగ్గా, మిగిలిన వారికి గాయాలవగా భూపాలపల్లి ఆస్పత్రికి తరలించామన్నారు.





బొడ్డెమ్మను పూజిస్తున్న నాయిని నీలిమారెడ్డి

బొడ్డెమ్మ సంబరాలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 27: హనుమకొండ 52వ డివిజన్ పరిధిలోని రాజాజీ నగర్‌లో ఈగ కవితరాజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో స్థానిక మహిళలు ఏర్పాటు చేసుకున్న బొడ్డెమ్మ (పూల పండుగ)లో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గౌరమ్మకు పూజ చేసి కొబ్బరికాయ కొట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోలుగురి సుగుణాకర్‌రెడ్డి, దొడ్డిపాటి రవి, అప్సర్, రాజ్‌కుమార్, మహేందర్, వేణు, పోలాస యాకయ్య, సబ్బు అనిల్, ఉమాదేవి, వనజ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించాలి

జూలైవాడ, సెప్టెంబ రు 27: రెడ్డి కార్పొరేషన్ కు చట్టబద్ధత కల్పించి నిధులు కేటాయించాలని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రెడ్డి సంఘం రాష్ట్ర ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటప్రకారం వంద రోజుల్లోనే రెడ్డి కార్పొరేషన్‌ను రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించింది కానీ నేటి వరకు ఎలాంటి విధివిధానాలు ప్రకటించలేదన్నారు. రెడ్డి కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించి నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపు జైపాల్‌రెడ్డి, నల్ల సంజీవరెడ్డి, బి.వెంకటేశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులు మార్గదర్శకులు

బాలసముద్రం, సెప్టెంబరు 27: వయోవృద్ధులు మార్గదర్శకులు అని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హను మకొండలోని బస్‌స్టేషన్ నుంచి నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణం వరకు వాక్‌థాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. వయోవృద్ధులు జ్ఞాన సంపన్నులు, వారి జీవిత అనుభవ సత్యాలే నేడు మార్గదర్శకంగా నిలిచాయని కొనియాడారు. ఆర్టీసీ ఆర్ఎం విజయభాను మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రతీ వయోవృద్ధుడికి వారికి కేటాయించిన సీట్లలో కూర్చో బెట్టేందుకు కండక్టర్లకు ఆదే శాలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ బెంచ్ మెంబర్ కరుకుల అనితారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి బి.రాజమణి, హనుమకొండ, వరంగల్ ఆర్టీసీ డిపో మెనేజర్లు ధరంసింగ్, మోహన్‌రావు, డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్, సూపరింటెండెంట్ లక్ష్మీ కాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఫెస్టివల్‌లో ఆకట్టుకున్న వంటకాలు

కాళోజీ జంక్షన్, సెప్టెంబరు 27 : వరల్డ్ టూరిజం డే సందర్భంగా శుక్రవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ వంటకాలు భోజనప్రియులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం లంచ్‌కు, సాయంత్రం డిన్నర్‌కు వచ్చిన వారంతా తెలంగాణ వంటల రుచులను ఆస్వాదించారు. ముఖ్యంగా నాటు కోడి కూర, బోటీ ఫ్రై, తలకాయకూర రుచులు బాగున్నాయని నిర్వాహకులను పలువురు ప్రశంసించారు. సల్లచారు, పచ్చి పులుసు, దోసకాయ పచ్చడి రుచులు శాఖహారులను ఆకట్టుకున్నాయి. ఇంకా తినుబండారాలైన సర్వపిండి, చెక్క గారెలు, సకినాలు, అరిశలు, మడుగూలు అందరు రుచి చూశారు.

రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్స్ ఎన్నికలు

కాజీపేట, సెప్టెంబరు 27: కాజీపేటలో తెలంగాణ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మొదటి దశ ఎన్నికలు శుక్రవారం రైల్వే కమ్యూనిటీ హాల్‌లో ప్రశాంతంగా జరిగాయి. ఉమ్మడి జిల్లాలు వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, సిద్దిపేట, యాదాద్రి జిల్లాల నుంచి 1100 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల ఇన్‌చార్జిగా జీకేరూపాస్, సంపత్ కుమార్, శ్రీనివాసరావులు వ్యవహరించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు జి. లింగమూర్తి, కాజీపేట అధ్యక్షులు టి. జగదీశ్వర్‌తోపాటు కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 27: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బల్దియా అదనపు కమిషనర్ చింతకుట్ల రాజేందర్‌రెడ్డి హాజరై బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, టీపీఆర్‌వో డాక్టర్ కోల రాజేశ్‌కుమార్, డిప్యూటి కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, జేఏవో సరితతో పాటు బల్దియా ఉద్యోగులు పాల్గొన్నారు.

● న్యూశాయంపేట: హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న నేత హాస్టల్ భవన్‌లో పద్మశాలీ ప్రముఖులు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

● వరంగల్ క్రైం: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని వరంగల్ కమిషనరేట్‌లో ఘనంగా నిర్వహించారు. కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హాజరై కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

● రాంనగర్: హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులి రజనీకాంత్, నార్లగిరి రమేశ్, మేకల బాబురావు, సల్వాజీ రవీందర్‌రావు, నయీమ్, పరుశరాములు, శ్రీనివాస్, బండి రజనీకాంత్, రాజు, రఘు, మహేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండా లక్ష్మణ్ బాపూజీకి హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ నివాళులర్పించారు. చెన్నై పర్యటనలో ఉన్న వినయభాస్కర్ అక్కడే శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● రెడ్డికాలనీ: కొండా లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమసంఘం అధ్యక్షుడు బత్తుల రమేశ్ బాబు అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి రెడ్డికాలనీలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గుర్రపు రమేశ్, నరెట్ల మహేందర్, కుమారస్వామి, నరేందర్‌బాబు, రమేశ్, రాజ్‌కుమార్, సురేశ్ పాల్గొన్నారు.



వ్యాసరచన, వక్తృత్వ పోటీ విజేతలతో సుందర్‌రాజ్ యాదవ్, ప్రిన్సిపాల్

● హనుమకొండ సిటీ: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమం హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్విట్ ఇండియా, ముల్కీ, తెలంగాణ ఉద్యమాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు, పోరాటతత్వాన్ని స్మరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బంక సరళాదేవి, అంబేద్కర్ రాజు, అబూ బాకర్, రజాలీ, శ్రీకర్, ప్రభాకర్, మల్లారెడ్డి, సంతోశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ(ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలని కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని మాస్టర్‌జీ డిగ్రీ కళాశాలలో కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతుల ప్రదానం జరిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ జిదామోదర్, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, రిటైర్డ్ డీఈవో చంద్రమోహన్, సీహెచ్ సూర్యనారాయణ, అరవింద శర్మ, ఎంఎం మూర్తి, కోమటి లక్ష్మీనారాయణ, బండ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పద్మశాలి సంక్షేమ సంఘం నాయకులు

● హనుమకొండ టౌన్: గాంధేయమార్గంలో నడిచి అందరికీ ఆదర్శంగా నిలిచిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని నక్కలగుట్టలోని కార్పొరేట్ ఆఫీస్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ బి.అశోక్‌కుమార్, వి. తిరుపతిరెడ్డి, టి. మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

● వేలేరు: మండల కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో శుక్రవారం ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షుడు కూరపాటి ప్రభాకర్ ఆధ్వర్యంలో లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కుడా డైరెక్టర్ బిల్ల యాదగిరి, నాయకులు కూరపాటి శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మహేందర్, రాజు, శ్రీనివాస్, రమేష్, నరేష్, శ్రీకాంత్, పృథ్వీరవి, విజయ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన కలిగి ఉండాలి

కలెక్టర్ ప్రావీణ్య

వడ్డెపల్లి, సెప్టెంబరు 27: విద్యార్థులు సమాజం, ఆర్థిక, సంస్కృతిపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో తెలంగాణలో 12వ శతాబ్దం నుంచి 20వ శతాబ్దం వరకు సమాజం, ఆర్థికం, సంస్కృతి అనే అంశంపై ఏర్పాటు చేసిన జాతీయ సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. తాను ఇంజనీరింగ్ చదివినప్పటికీ సామాజిక, మానవీయశాస్త్రాలు, చరిత్ర అంటే అభిమానం ఉండేదని, సివిల్స్ సాధించడానికి అవి దోహదపడుతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళి గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉన్నత విద్యా మండలి సౌజన్యంతో, కళాశాల విద్య నేతృత్వంలో హిస్టరీ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో హిస్టరీ జాతీయ సదస్సు సమన్వయ కర్త డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, ప్రొఫెసర్ కె. విజయబాబు, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రాంచంద్రం, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, ప్రొఫెసర్లు సురేష్‌బాబు, అరుణ, హెప్సిబా, రత్నమాల, ప్రవీణ్‌కుమార్, పద్మ, శ్రీలత తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ప్రభుత్వ భూములు కాపాడాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

న్యూశాయంపేట, సెప్టెంబరు 27: కబ్జాకోరుల చెర నుంచి ప్రభుత్వ భూములను కాపాడి పేదలకు పంచాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హంటర్‌రోడ్‌లోని సైన్స్‌సెంటర్ ప్రాంతంలోని సర్వే నెంబర్ 964, 966లో ఉన్న భూములను సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సైన్స్ సెంటర్ ప్రాంతంలోని ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేశారని, బడా నేతల ఆధ్వర్యంలోనే ఇక్కడి భూమి కబ్జాకు గురవుతుందన్నారు. అన్యాక్రాంతమైన భూమిలో నిర్మాణాలు చేసిన భూమితో పాటు మిగులు ఖాళీగా ఉన్న సుమారు 49 ఎకరాల భూమిని ప్రభుత్వం పేదలకు పంచాలన్నారు.

కబ్జాకోరులకు సహకరించిన రెవె న్యూ, మునిసిపాలిటీ అధికారులతో పాటు, ప్రజాప్రతినిధులు ఎంతటి వారున్నా వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భూములు పరిశీలించిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు అశోక్ స్టాలిన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, నాయకులు కొట్టె పాక రవి, కర్రె లక్ష్మణ్, గుంటి రాజేందర్, అనుకారి అశోక్, రుద్రంగి శ్రీనివాస్, విజయ్‌కుమార్, శ్రీనివాస్ తదితర నాయకులు ఉన్నారు.

కోలాహలంగా క్రీడా పోటీలు

మూడు క్రీడాంశాలలో 1200మంది హాజరు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 27: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-17 బాలబాలికల ఖో-ఖో, కబడ్డీ వాలీబాల్ క్రీడాంశాలలో ఏర్పాటుచేసిన పోటీలను మండల విద్యా శాఖ అధికారి కె.రమేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడల నిర్వాహణ కార్యదర్శి టి.రాజేందర్ మాట్లాడుతూ.. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో హనుమకొండ మండల వ్యాప్తంగా 1200మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఇక్కడ మండల స్థాయిలో పలు క్రీడాంశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను త్వరలో జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఆదే విధంగా ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-14బాల బాలికలకు శనివారం ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎస్ మర్కజీ హెచ్ఎం రామరావు, ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాల హెచ్ఎం వి.జగన్నాథం, లయన్స్‌క్లబ్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి, జీటీఏ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశం, వి. శ్రీధర్‌రావు, వి.రాణి, కె.మల్లారెడ్డి, ఎం.కర్ణాకర్, శోభ, సరళ, మనోహర్, వెంకటేశ్వర్లు కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్, సతీష్ పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలి

వరంగల్ ఎడ్యు కేషన్, సెప్టెంబరు 27: అక్రమ డిప్యూ టేషన్లను రద్దు చేయాలని టీపీటీ ఎఫ్ నాయకులు శుక్రవారం డీఈవో వాసంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. వేలేరు మండలం నుంచి నిబంధనలకు విరుద్ధంగా పట్టణ ప్రాంత పాఠశాలల్లో పని చేస్తున్న ఇద్దరు ఎస్‌జీటీలను ఎలాంటి ఉత్తర్వులు లేకుండా పట్టణ ప్రాంత పాఠశాలలో అనధికారికంగా పని చేస్తున్న మరో ఎస్‌జీటీ డిప్యూటేషన్ వెంటనే రద్దు చేయాలన్నారు. గ్రామీణ పాఠశాలలను పరిరక్షించాలని వినతి పత్రంలో కోరారు. ఈకార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి రావులరమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రగిరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

కాజీపేట, సెప్టెంబరు 27: నిత్యావసర వస్తువులైన అల్లం, వెల్లుల్లి, వంటనూనెల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కాజీపేట చౌరస్తాలో సీపీఐ నాయకులు ధర్నా చేశారు. మండల కార్యదర్శి మునగాల భిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో కూరగాయలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ జిల్లా కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, కిట్టపాక రవి, మాలోతు శంకర్ నాయక్, ఆర్. దీన, కొట్టె వెంకటేశ్, పూర్ణ చందర్, తదితరులు పాల్గొన్నారు.

● హసన్‌పర్తి: బ్లాక్ మార్కెట్ వ్యవస్థను అరికట్టి నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూమండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువుల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకు లు మోతె లింగారెడ్డి, సీపీఐ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి నేదునూరి రాజమౌళి, మైనారిటీ నాయకులు షేక్ బాబు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేత

కాజీపేట, సెప్టెంబరు 27: కాజీపేట సమీపంలోని అయోధ్యపురం రైల్వే గేటు శనివారం నుంచి అక్టోబరు 4 వరకు వారం పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైలు ట్రాక్ మరమ్మతు దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఆర్‌పీఎఫ్ రక్తదానం

కాజీపేట, సెప్టెంబరు 27: కాజీపేట రైల్వే ప్రొటెక్షన్‌ఫోర్స్ కార్యాలయంలో శుక్రవారం ఆర్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్పీఎఫ్ సిబ్బంది రక్తదానం చేశారు. లయన్స్ క్లబ్, రెడ్‌క్రాస్ సమన్వయంతో ఇన్‌స్పెక్టర్ ఎం.సంజీవరావు ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో సిబ్బంది, పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వోగా శ్రీకృష్ణారావు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 27: హనుమకొండ జిల్లా డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ ఎ.శ్రీకృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేర కు జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం హనుమకొండ పబ్లిక్ హెల్త్ లేబ రేటరీలో డిప్యూటీ సివిల్ సర్జన్ హోదాలో విధులు నిర్వర్తిస్తున్నారు. దీనికి అదనంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, టీసీఎంసీ హాస్పిటల్ కోఆర్డినేషన్ విభాగానికి నియమించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, సిబ్బంది డాక్టర్ శ్రీకృష్ణారావును అభినందించారు.

పులిగుట్ట భూముల సర్వే

కబ్జాలు ఉంటే ఉపేక్షించేదిలేదు : తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 27: పులిగుట్ట భూముల కబ్జాను నిగ్గు తేల్చేందుకు రెవెన్యూ యం త్రాంగం రంగంలోకి దిగింది. 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన హనుమకొండ తహ సీల్దార్ కార్యాలయం సిబ్బంది శుక్రవారం హంటర్‌రోడ్డులోని సర్వే నెంబర్ 964, 966లోని 49 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించేందుకు పులిగుట్ట పరిసరాల చుట్టూ సర్వే చేశారు. హనుమకొండ తహ సీల్దార్ కర్ర శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పూర్తిగా సర్వేచేసి హద్దులు గుర్తించేందుకు ఇంకా ఒకటి లేదా రెండురోజుల సమయం పట్టొచ్చని, అనంతరం ప్రభుత్వ భూమి ఎక్కడి వరకు తేలితే అక్కడి వరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ భూమిలో కబ్జాలుంటే ఉపేక్షించేదిలే దని, కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సర్వేలో ఆర్ఐ శ్రీధర్, డీఐ పవన్, సర్వేయర్లు పాల్గొన్నారు.

రేపు అంబేద్కర్ యువజన సంఘం వార్షికోత్సవ సభ

వడ్డెపల్లి, సెప్టెంబరు 27: తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం 48వ వార్షికోత్సవ సభ ఈనెల 29న హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య, జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు తెలిపారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితో పాటు అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్రనేత బొమ్మల్ల అంబేద్కర్ మాట్లాడారు. డాక్టర్ బీఆర్. అంబేద్కర్ ఆలోచనలను ఆచరణలో చూపడంకోసం ఆవిర్భవించిన అంబేద్కర్ యువజన సంఘం బడుగు, బలహీన, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం, అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడుతోందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో షె డ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు ఏనుట్ల రవీందర్, రౌతు రమేష్, అంబేద్కర్ యువజన సంఘం నేతలు బంగారు బాబు, చాణుక్య కొమ్ముల కరుణాకర్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షలో భాగస్వాములు కావాలి

బాలసముద్రం, సెప్టెంబరు 26: పర్యావరణ పరిరక్షలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఐటీసీ వావ్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ పవన్ అన్నారు. వరల్డ్ టూరిజండే సందర్భంగా శుక్రవారం 30వ డివిజన్ బాలసముద్రంలోని పద్మాక్షి దేవాలయ ఆలయ సమీపంలో పరిసరాలను మునిసిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు మల్లికార్జున్, కిరణ్, శ్యాం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 27: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని నక్కలగుట్ట మెయిన్‌రోడ్డు, మార్కెట్ ఏరియా, అంబేద్కర్ సెంటర్, రమేశ్ డాక్టర్ ఆసుపత్రి ఏరియాలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సాంబరెడ్డి తెలిపారు.

నేడు ఉచిత పశు వైద్య శిబిరం

హసన్‌పర్తి, సెప్టెంబరు 27: మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో శనివారం ప్రపంచ రేబీస్ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేబీస్ వ్యాధి నివారణ కోసం పెంపుడు జంతువులకు, పశువులకి టీకాలను ఉచితంగా వేస్తామని తెలిపారు. హసన్‌పర్తి పశువైద్యశాలలో నిర్వ హించే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని జంతు ప్రేమికులు సద్వినియోగం చేసుకొని రేబీస్ వ్యాధి నివారణకు సహకరించాలని కోరారు.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ

హసన్‌పర్తి, సెప్టెంబరు 27:మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం హసన్‌పర్తి వాసవిక్లబ్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు టీషర్టులను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు శ్యాంసుందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి, వాసవి క్లబ్ ఐపీసీ కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు, క్లబ్ సభ్యులు నాగమల్ల సుదీర్, వెలగందుల భీష్మనాథం, శ్రీదేవి, రాములు, పార్థసారథి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేఆర్‌నాగరాజును ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలి

ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్‌మాదిగ

హసన్‌పర్తి, సెప్టెంబరు 27: మాదిగలపై అనుచిత వాఖ్యలు చేసిన కేఆర్.నాగరాజును ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎర్రగట్టు దేవస్థానం చైర్మన్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం మాలల ఓట్లతోనే గెలిచానని విర్రవీగుతున్న కేఆర్.నాగరాజు రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. మాదిగలనే టార్గెట్ చేసి అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే నాగరాజు మాదిగ జాతికి క్షమాపణ చెప్పాలన్నారు. మంద క్రిష్ణమాదిగ ఏనాడు మాలలకు టికెట్ ఇవ్వవద్దని చెప్పలేదని, కేవలం జనాభా దామాషా ప్రకారం మాత్రమే టికెట్లు ఇవ్వాలని కోరారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేస్తానని మాట ఇచ్చినా కూడా ఎమ్మెల్యే నాగరాజు బేఖాతరు చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో జరిగిన మాల ఉద్యోగుల మీటింగ్‌లో ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని కేవలం మాదిగలు వాడుకుంటూ దానిని నిర్వీర్యం చేస్తున్నారని మాట్లాడడాన్ని ఆయన ఖండించారు. సుప్రీం కోర్టు తీర్పును అవహేళన చేస్తూ మాట్లాడిన కేఆర్.నాగరాజు మాటలను తక్షణమే సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకొని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కేఆర్.నాగరాజును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు రాజారపు భిక్షపతి మాదిగ, ఉపాధ్యక్షుడు జన్ను దినేష్‌మాదిగ, ఎమ్మెస్పీ రాష్ట్ర సీనియర్ నాయకుడు పుట్ట రవి మాదిగ, బిర్రు మహేందర్‌మాదిగ, నాయకులు సుకుమార్, సురేందర్, నారాయణ, పవన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ టౌన్: అధికారం ఉందన్న అహంకారంతో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు మాదిగలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి డిమాండ్ చేశారు. కేయూ అతిథి గృహం ఎదుట కేయూ ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు శ్రీనాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. మాల ఉద్యోగస్తుల సమావేశంలో మాదిగలను కించేపరిచేలా, ఏబీసీడీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన ఎమ్మెల్యే నాగరాజు వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్నారు. సమావేశంలో యంఎస్ఎఫ్ కేయూ ప్రధాన కార్యదర్శి అరిస్టాటిల్, కార్తీక్, సృజన్, ఉమేశ్, సూర్య, ప్రకాశ్, శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్‌మాదిగ

అల్లం... అమృతం

తడిగా ఉన్న అల్లపు దుంపని ఆర్ద్రకం అంటారు. దీనినే శృంగవేరి అనికూడా పిలుస్తారు. ఎండిన అల్లానికి శొంఠి అని పిలుస్తారు. ఎండిన అల్లానికి కొమ్ములు ఉంటాయి కాబట్టి- దీనిని తెలుగులో శొంఠి కొమ్ము అనటమూ ఉంది. కర్ణాటకలోని శృంగేరీ ప్రాంతంలో అల్లం బాగా పండుతుంది కాబట్టి ఆ ప్రాంతాన్ని 'శృంగవేర గిరి' అన్నారు. శంకరాచార్యుల వారు తన పీఠాన్ని ఇక్కడే ప్రతిష్ఠించారు. అదే శృంగేరిగా ప్రసిద్ధి చెందిందని చెప్తారు.

లాభాలెన్నో...

అల్లానికి ఆయుర్వేదంలో ఒక ప్రత్యేకమైన స్థానముంది. స్థూలకాయం, వాపులు, అజీర్తి, మలబద్ధతలను తగ్గించటానికి దీనిని వాడతారు. గడ్డలు, ట్యూమర్లు ఏర్పడకుండా, రక్తం గడ్డకుండా రక్తప్రసారం మెరుగుపరచటంలో అల్లం కీలకమైన పాత్ర పోషిస్తుంది. అంతే కాదు.. మనం తినే పోషకాలు వంటబట్టడానికి.. వ్యాధినిరోధకశక్తి పెరగటానికి కూడా ఇవి ఉపకరిస్తాయి. ఇక అల్లాన్ని ఇతర పదార్థాలతో కలిపి తింటే ఆరోగ్యం మెరుగుపడుతుంది.



- అల్లం తురుమును బెల్లం పాకం పట్టి ఉండలుగా చేసి చప్పరిస్తే- శ్వాసకోశ వ్యాధులు తగ్గుతాయి. ఊపిరి తీసుకొనే పద్ధతిలో మార్పు వస్తుంది. నాలుకపై ఏర్పడే పలుచని జిగురు పొర తొలగిపోయి రుచి తెలుస్తుంది. గొంతు శ్రావ్యత కూడా పెరుగుతుంది.
- అల్లాన్ని పాలల్లో వేసి బాగా పొంగనిచ్చి.. ఉదయాన్నే తాగితే టీబీలాంటి జబ్బులు రావు.
- అల్లం రసం, నిమ్మరసం కలిపి దానిలో తగినంత ఉప్పు వేసి తాళింపు పెట్టుకోవాలి. ఇలా తయారయిన పలుచటి చట్నీని అన్నంతో కలుపుకొని క్రమం తప్పకుండా తింటే కడుపులో ఉండే నుసి పురుగులు పోతాయి. జీర్ణశక్తి మెరుగుపడుతుంది.

ఎలా తినాలి?

అల్లాన్ని ఎలా తినాలనే విషయాన్ని క్షేమశర్మ- తన క్షేమ కుతూహలంలో పేర్కొన్నాడు. క్షేమశర్మ చెప్పిన సూత్రం ప్రకారం- అల్లాన్ని- "భోజనాగ్రే సదాపథ్యం"లో తినాలి. అంటే భోజనంలో మొదటి ముద్దగా తినాలి. అంతే కాదు. వంకాయ, కంద వంటి కూరలు అరగటం కష్టమవుతుంది. అందువల్ల వాటిలో అల్లాన్ని తప్పనిసరిగా కలపాలి. తేలికగా అరిగే బీర, పొట్ల, సొర, పాలకూర, తోటకూర వంటి వాటిలో అల్లాన్ని కలపాల్సిన అవసరం లేదు. ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలి. అల్లానికి వేడి చేసే స్వభావం ఉంది. అందువల్ల వేడి శరీర తత్వం ఉన్నవారు అల్లాన్ని పరిమితంగా తీసుకోవాలి. శరీరానికి వేడి కలిగించే వెల్లుల్లితో అసలు కలపకూడదు. అల్లం, వెల్లుల్లి - ఈ రెండు ఔషధాలు కూడా! వీటిని మితంగానే వాడాలి. అతిగా వాడితే ప్రతికూల ఫలితాలు ఏర్పడతాయి.

• గంగరాజు అరుణాదేవి

వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు ఫుల్

శరీరం వ్యాధుల బారిన పడకుండా కాపాడేవి యాంటీ ఆక్సిడెంట్లే. ఇవి పండ్లు, నట్స్ వంటి వాటిలో పుష్కలంగా లభిస్తాయి. వీటిని రోజూ తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని అంటున్నారు పోషకాహార నిపుణులు.

బెర్రీలు: బ్లూబెర్రీ, రాస్ప్బెర్రీ, బ్లాక్‌బెర్రీలలో ప్రొయాంథోసియానిడిన్స్ అనే యాంటీఆక్సిడెంటు ఉంటుంది. ఇది గుండెజబ్బులు, క్యాన్సర్ రాకుండా కాపాడుతుంది. ఉదయాన్నే స్మూతీగా తీసుకోవచ్చు. యోగర్ట్ లేక తృణధాన్యాలతో కలిపి తీసుకోవచ్చు.



గ్రేప్స్ : వీటిలో సి విటమిన్‌తో పాటు మెగ్నీషియం లభిస్తుంది. సాధారణ కెరోటినాయిడ్‌గా పిలిచే బీటా కెటోరిన్ నుంచి రెస్వరట్రాల్ వరకు బోలెడు యాంటీ ఆక్సిడెంట్లు వీటిలో లభిస్తాయి.

వాల్‌నట్స్ : యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభించే వాల్‌నట్స్ పది, పదిహేను తీసుకుంటే చాలు. వంద గ్రాముల వాల్‌నట్స్‌లో 15.2 గ్రాముల ప్రొటీన్, 65.2గ్రాముల ఫ్యాట్, 6.7గ్రాముల ఫైబర్ ఉంటుంది. అంతేకాకుండా ముఖ్యమైన ఎమైనో యాసిడ్స్ లభిస్తాయి.

గ్రీన్ టీ : ఇందులో కెటచిన్ పాలిఫెనాల్స్ అనే మిశ్రమం ఉంటుంది. ఇది శరీరంలో ఇతర రసాయనాలతో కలిసి పని చేసి థర్మోజెనెసిస్ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. క్యాన్సర్, గుండెజబ్బులు దరిచేరకుండా చూస్తుంది. అధిక కొలెస్ట్రాల్ సమస్యకు పరిష్కారం చూపుతుంది.

కివీ పండు : విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. నీటిలో కరిగే యాంటీ ఆక్సిడెంటు ఉంటుంది. కణాలను డ్యామేజ్ చేసే ఫ్రీ రాడికల్స్‌ను ఇది న్యూట్రలైజ్ చేస్తుంది. విటమిన్ సి తగినంత తీసుకుంటే ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్తమా వంటి జబ్బుల తీవ్రత తగ్గుతుంది. కోలన్ క్యాన్సర్, ఎథెరోస్క్లెరోసిస్, డయాబెటిక్ హార్ట్ డిసీజ్ వంటి జబ్బులు రాకుండా నిరోధిస్తుంది.



రెడ్ యాపిల్స్ : ఇందులో ఫైటోన్యూట్రియెంట్స్, ఫ్లావనాయిడ్స్, పాలీఫెనొలిక్స్ వంటివి పుష్కలం. 100గ్రాముల యాపిల్‌లో యాంటీ ఆక్సిడెంట్ స్ట్రెంత్ (ఓఆర్ఏసీ వాల్యూ) 5900 టీఈగా ఉంటుంది. క్వెర్‌సెటిన్, ఎపికెటచిన్, ప్రొసినాడిన్ బి2 వంటి ముఖ్యమైన ఫ్లావనాయిడ్లు లభిస్తాయి. ఇవన్నీ ఫ్రీ రాడికల్స్ వల్ల జరిగే నష్టాన్ని తగ్గిస్తాయి.



స్ట్రాబెర్రీలు : వీటిలో యాంటీ ఆక్సిడెంట్లతో పాటు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ న్యూట్రియెంట్లు ఉంటాయి. ఇవి కార్డియోవాస్క్యులర్ జబ్బుల నుంచి కాపాడతాయి. డయాబెటిస్ రిస్క్ తగ్గుతుంది. బ్రెస్ట్, సెర్వికల్, కోలన్, ఇసియోఫేగల్ వంటి క్యాన్సర్లు రాకుండా రక్షిస్తాయి.

వంటిల్లు

పండుగల్లో పసందుగా

పండగ సీజన్ వచ్చేస్తోంది. పండగ కన్నా ముందే కొన్ని పిండి వంటలు ట్రై చేస్తే బావుంటుంది కదా! అందుకే కొన్ని స్పెషల్ పిండి వంటలు ఇస్తున్నాం.. ఆస్వాదించండి..



జిటాయ్ ఫిర్‌దౌస్

(గుమ్మడి పరమాన్నం)

కావాల్సిన పదార్థాలు

బాగా పండిన గుమ్మడికాయ (చిన్న ముక్కలు చేసుకోవాలి), వెన్న తీయని పాలు- 2 లీటర్లు, పంచదార- 200 గ్రాములు, ఏలకుల పొడి- ఒక స్పూను, సగం పైనాపిల్ (చిన్న ముక్కలు చేసుకోవాలి)

తయారీ విధానం

పాలలో గుమ్మడి ముక్కలను వేసి ఉడకపెట్టాలి. కొద్ది సేపటి తర్వాత మగ్గిన ముక్కలను గుజ్జుగా చేయాలి. రెండు లీటర్ల పాలు బాగా చిక్కపడిన తర్వాత పంచదార వేయాలి. పంచదార వేసిన తర్వాత 10 నిమిషాలు కలుపుతూ ఉండాలి. ఆ తర్వాత పొయ్యి మీద నుంచి కిందకు దింపి పైనాపిల్ ముక్కలు, ఏలకుల పొడి కలపాలి.

జాగ్రత్తలు

- బాగా పండిన గుమ్మడికాయ తియ్యగా ఉంటుంది. అందువల్ల ఎక్కువ పంచదార వేయాల్సి అవసరం లేదు.
- పంచదార బదులుగా బెల్లం పొడిని కూడా వేసుకోవచ్చు
- పైనాపిల్ ముక్కలను వేడిగా ఉన్నప్పుడు కలపకూడదు.

అనోఖి ఖీర్

కావాల్సిన పదార్థాలు

తెల్ల ఉల్లిపాయలు- వంద గ్రాములు, పంచదార- వంద గ్రాములు, పాలు- రెండు లీటర్లు, ఏలకుల పొడి- ఒక స్పూను, డ్రైఫ్రూట్స్- తగినన్ని

తయారీ విధానం

- తెల్ల ఉల్లిపాయలను చిన్న ముక్కలుగా తరగాలి. వాటిని నీళ్లలో బాగా కడగాలి. ఆ తర్వాత ఒక మూకుడులో నీళ్లు పోసి వాటిలో ఉల్లిపాయలను ఉడికించాలి. ఉల్లిపాయలు మగ్గిన తర్వాత స్టౌ మీద నుంచి దింపాలి. నీళ్లను పారబోసి ఉడికిన ఉల్లిపాయల ముక్కలను చల్లబర్చాలి.
- పాలను బాగా మరగనివ్వాలి. వాటిలో చల్లారిన ఉల్లిపాయల ముక్కలు వేయాలి. ఈ మిశ్రమం దగ్గరపడిన తర్వాత పంచదార, ఏలకుల పొడి వేయాలి.
- చల్లారిన తర్వాత సర్వ్ చేసేముందు డ్రై ఫ్రూట్స్ వేయాలి.

జాగ్రత్తలు

- కేవలం తెల్ల ఉల్లిపాయలను మాత్రమే వాడాలి. మామూలు ఉల్లిపాయలను వాడకూడదు.
- వాసన పోయేదాకా ఉల్లిపాయలను ఉడికించాలి.



కుబానీ ట్రిఫిల్



కావాల్సిన పదార్థాలు

ఒక స్పాంజ్ కేకు, యాప్రికాట్- 200 గ్రాములు, పాలు- ఒక లీటరు, కస్టర్డ్ పౌడర్- నాలుగు టీ స్పూనులు, పంచదార- 200 గ్రాములు, పళ్ల ముక్కలు- ఒక కప్పుడు, ఫాంటా- 200 ఎంఎల్ బాటిల్, జామ్- తగినంత, ఫ్రెష్ క్రీమ్- ఒక కప్పుడు, డ్రై ఫ్రూట్స్- తగినన్ని

తయారీ విధానం

కస్టర్డ్: ఒక గ్లాసులో కొద్దిగా పాలను తీసుకొని కస్టర్డ్ పౌడర్‌ను కలపాలి. మిగిలిన పాలను బాగా మరగనివ్వాలి. దానిలో పంచదార, కస్టర్డ్ పాల మిశ్రమాన్ని వేసి చిక్కపడేదాకా ఉడికించాలి. ఆ తర్వాత స్టౌ మీద నుంచి కిందకు దింపి చల్లబరచాలి.

యాప్రికాట్ ప్యూరీ: యాప్రికాట్‌లు నీళ్లలో 24 గంటలు నానబెట్టాలి. వాటిలో నుంచి గింజలు తీసేయాలి. ఆ తర్వాత యాప్రికాట్‌లను చిన్న చిన్నముక్కలుగా తరగాలి. ఒక గిన్నెలో నీళ్లు పోసి.. వంద గ్రాముల పంచదార వేయాలి. ఉడుకుతున్న పంచదార నీళ్లలో యాప్రికాట్ ముక్కలు వేసి మగ్గనివ్వాలి. బాగా మగ్గిన తర్వాత స్టౌవ్ మీద నుంచి దింపి చల్లబరచాలి.

ట్రిఫిల్ తయారీ: కేకును రెండు ముక్కలుగా చేయాలి. ఈ రెండు ముక్కలకు జామ్‌ను రాయాలి. ఆ తర్వాత కేకును చిన్న చిన్న ముక్కలుగా కోయాలి. ఆ తర్వాత ముక్కల్లో ఫ్యాంటా పోయాలి. ఆ ముక్కలపై పళ్లముక్కలు పరచాలి. దానిపైన యాప్రికాట్ ప్యూరీని సరిసమానంగా ఉండేలా రాయాలి. ఆ పైన కస్టర్డ్‌ను కూడా వేయాలి. ఆ తర్వాత పైభాగంలో క్రీమ్, డ్రైఫ్రూట్స్‌ను కూడా వేయాలి. దీనిని ఫ్రిజ్‌లో పెట్టి చల్లబరచి తింటే బావుంటుంది.

జాగ్రత్తలు

- కస్టర్డ్‌ను కొద్దిగా చిక్కగా చేయాలి.
- ఫ్యాంటా బదులుగా తియ్యటి నారింజరసాన్ని కూడా వాడవచ్చు
- స్పాంజ్ కేకు తాజాగా ఉంటే రుచి బావుంటుంది.

వాళ్లకు ఆమే గ్రాండ్‌మాస్టర్

ఇద్దరు పిల్లలు గ్రాండ్‌మాస్టర్లు. వారి ఆటోగ్రాఫ్‌ల కోసం అభిమానులు ఎగబడుతుంటే ఆ తల్లి కళ్ల వెంట ఆనందభాష్పాలు వస్తున్నాయి. న్యూస్ ఛానళ్లు పోటీ పడి ఇంటర్వ్యూలు తీసుకుంటుంటే ఆ తల్లి మనసు ఆనందంతో నిండిపోతోంది. అక్కాతమ్ముడు ఇద్దరూ గ్రాండ్‌మాస్టర్ హోదాలు పొందడం చరిత్రలో ఇదే మొదటిసారి. చెన్నైకు చెందిన ప్రజ్ఞానంద, వైశాలిల విజయం వెనక వారి తల్లి **నాగలక్ష్మి** కృషి ఎంతో ఉంది.



పిల్లలు ఆటల్లో రాణించాలంటే మంచి శిక్షణ ఒక్కటే సరిపోదు. పిల్లల కెరీర్‌ను తీర్చిదిద్దడంలో పేరెంట్స్ పాత్ర కీలకం. నిత్యం వారి వెంటే ఉంటూ వాళ్లకు కావలసినవన్నీ సమకూర్చి పెట్టాలి. ఆ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చి పిల్లలిద్దరినీ ఉన్నత శిఖరాల్లోకి చేర్చింది నాగలక్ష్మి. బాల్యంలో ప్రజ్ఞానంద చేయిపట్టుకుని క్లాసులకు తీసుకువెళ్లేది. ఇప్పటికీ అంతర్జాతీయ మ్యాచుల కోసం విదేశాలకు వెళుతుంటే తోడుగా ఉంటోంది. ఒత్తిడి దరిచేరకుండా చూస్తూ విజయాలు సాధించేలా చేస్తోంది. ఎక్కడికి వెళ్లినా ఇంటి దగ్గర తయారుచేసిన ఆహారాన్ని మాత్రమే కుమారుడికి అందిస్తుంది. ఇందుకోసం ఒక ఇండక్షన్ స్టవ్, రైస్‌కుక్కర్, కొన్ని మసాల పదార్థాలను తన వెంట తీసుకెళుతుంది. ఎక్కడ ఆడేందుకు వెళ్లినా ఇంటి భోజనం తప్పక అందేలా చూస్తుంది ఆ తల్లి. బయటి ఆహారం తింటే ఆరోగ్యం చెడిపోతుందనేది ఆమె భయం. "మంచి ఆహారం అందిస్తేనే మెదడు చురుకుగా పనిచేస్తుంది" అని అంటారామె. పిల్లలు సైతం అమ్మ చేతి వంటను మాత్రమే తినడానికి ఇష్టపడతారు. అందుకే కష్టం అనుకోకుండా సామగ్రిని తరలించి వంట చేసి పెడుతూ ఉంటుంది. "ప్రోటీన్ ఆహారం అందించడంపై ఎక్కువ దృష్టి పెడతాను. పిల్లలిద్దరూ వెజిటబుల్ సాంబార్‌ను బాగా ఇష్టపడతారు" అని చెబుతారు నాగలక్ష్మి.

> **పిల్లలకు ఆటల పట్ల ఆసక్తి ఉంటే బాగా ఆడమని ఒత్తిడి పెట్టకూడదు. కేవలం పేరెంట్స్‌గా మనం ఎంకరేజ్ చేయాలి. సపోర్టు అందించాలి. వాళ్లు గెలిస్తే మనకు సంతోషం. ఒకవేళ గెలవకపోయినా ఎంకరేజ్ చేయాలి. నెక్స్ట్ టైమ్ బాగా ఆడటానికి ప్రయత్నించు అని చెప్పాలి.**

బాధ్యతంతా తనపైనే...

నాగలక్ష్మి గృహిణి. ఆమె భర్త బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఉద్యోగ బాధ్యతలతో బిజీగా ఉండేవారు. దాంతో పిల్లల బాధ్యతలను ఆమె తీసుకున్నారు. ఎక్కడ టోర్నమెంట్ జరిగినా పిల్లలను తీసుకుని వెళ్లిపోతారు. ఆమె కష్టం వృథా పోలేదు. పిల్లలిద్దరూ చదరంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. వారిని చూసి దేశం మొత్తం గర్విస్తోంది. వైశాలి ముందుగా చదరంగం నేర్చుకునేందుకు ఆసక్తి చూపింది. ఆ తరువాత ప్రజ్ఞానంద సైతం చెస్‌పై ఆసక్తి పెంచుకున్నారు. ఇద్దరూ ఒకే ఆటను కెరీర్‌గా ఎంచుకోవడం పట్ల కుటుంబ సభ్యులు మొదట్లో అభ్యంతరం చెప్పారు. తరువాత వాళ్లే గొప్ప మద్దతును అందించి పిల్లల విజయంలో కీలక పాత్ర పోషించారు. "ప్రజ్ఞానందను శిక్షణ కోసం రోజూ తీసుకొచ్చే వారు. అతను ఆడుతున్నప్పుడు ఒక మూలన కూర్చుని ప్రార్థన చేస్తుండేవారు. కొడుకు ఆట పూర్తయ్యే వరకు ఆమె ప్రేయర్ చేసే వారు. ప్రజ్ఞానంద ఆడటానికి కూర్చుంటే చాలు తను ప్రేయర్ చేసేది" అని చెన్నైకి చెందిన బ్లూమ్ చెస్ అకాడమీ కోచ్ త్యాగరాజన్ చెప్పుకొచ్చారు. త్యాగరాజన్ ప్రజ్ఞానందకు మొదటి కోచ్‌గా ఉన్నారు. ప్రజ్ఞానంద ప్రపంచ ప్రసిద్ధ చెస్ ఆటగాడు మాగ్నస్ కార్ల్‌సెన్‌తో ఫైనల్ మ్యాచ్ ఆడుతున్నప్పుడు ఆమె పక్కనే నిలుచుని ఉంది. ప్రతి పురుషుడి విజయం వెనక ఒక మహిళ ఉంటుంది అన్న నానుడిని నిజం చేస్తూ, ప్రజ్ఞానంద వెంట ఉండి ఎలాంటి ఒత్తిడి లేకుండా చేసి, విజయతీరాలకు చేరుకునేలా చేసింది. హంగేరీలో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో వైశాలి, ప్రజ్ఞానందలిద్దరూ బంగారు పతకాలు గెలుచుకున్న టీమ్‌లో భాగంగా ఉన్నారు. ఇది ఎంతో ఆనందాన్నిచ్చిందని అంటారు నాగలక్ష్మి. "పిల్లలిద్దరూ బంగారు పతకాలు గెల్చుకోవడం చాలా సంతోషంగా ఉంది. నా ఆనందాన్ని పంచుకోవడానికి మాటలు రావడం లేదు" అని మ్యాచ్ అనంతరం తన సంతోషాన్ని పంచుకున్నారు నాగలక్ష్మి.



అమేజింగ్ చెస్ మామ్

పిల్లలతో హంగేరీ వెళ్లిన నాగలక్ష్మి అక్కడ లెజెండరీ చెస్ ప్లేయర్ సుసాన్ పొల్గర్‌ను కలుసుకున్నారు. ఈ విషయాన్ని పొల్గర్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. "ఇద్దరు చెస్ సూపర్‌స్టార్ల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన 'అమేజింగ్ చెస్ మామ్'ని కలుసుకున్నాను" అని పొల్గర్ రాసుకొచ్చారు. పిల్లల కెరీర్ కోసం తన చిన్న చిన్న సంతోషాలను కూడా వదులుకున్నారు. "ఇంట్లో పిల్లలు చెస్ ఆడుకుంటే డిస్టర్బ్ కాకూడదని టీవీ కూడా పెట్టే దాన్ని కాదు. ఇంట్లో పిన్ డ్రాప్ సైలెంట్ ఉండేలా చూసే దాన్ని. ఇంటికి ఎవరైనా వస్తే పార్కింగ్ ప్రదేశానికి వెళ్లి మాట్లాడి పంపే దాన్ని. అలాంటి వాతావరణం వాళ్లకు కల్పించేదాన్ని. అప్పుడే ఏకాగ్రతతో ఆడేవారు" అని అంటారు నాగలక్ష్మి. ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తోన్న నాగలక్ష్మిని మనమూ అభినందిద్దామా!

మేకప్

అందం.. అప్రమత్తంగా...

మనం పాటించే చిన్నపాటి నియమాలు, జాగ్రత్తలు మేకప్ ప్రభావాన్ని ఇనుమడింపజేస్తాయి. కాబట్టి మేకప్ వేసుకోవడం మొదలుపెట్టిన తొలినాళ్లలో సాధారణంగా దొర్లే వీలున్న పొరపాట్ల పట్ల అప్రమత్తంగా నడుచుకోవాలి. అవేంటంటే...

అన్నీ అవసరం లేదు: కాస్మటిక్స్ షాప్‌లోకి అడుగు పెట్టగానే అంతులేనన్ని ఉత్పత్తులు కళ్లను కట్టిపడేస్తాయి. ఏం కొనాలో అర్థం కాని పరిస్థితిలో, అమోమయానికి లోనై అవసరం లేని అప్లికేటర్స్ అన్నిటినీ కొనేయడం సరి కాదు. నిజానికి ఐల్యాష్ కర్లర్, భిన్నమైన మేకప్ స్పాంజ్‌లను కొనవలసిన అవసరం లేదు. అలాగే పలు రకాల బ్లష్‌లూ, లిప్‌స్టిక్‌లూ కొనవలసిన అవసరం ఉండదు. ప్రారంభంలో బేసిక్ మేకప్ కిట్ కొనుక్కుంటే సరిపోతుంది. ఆ తర్వాత అవసరాన్ని బట్టి ఒక్కొక్క ప్రొడక్ట్ జోడించుకుంటూ వెళ్లాలి. మస్కారా, లిప్‌స్టిక్, ఐబ్రో పెన్సిల్, ఫౌండేషన్‌లతో మేకప్ మొదలుపెట్టుకోవాలి. ఈ ఉత్పత్తులుండే మేకప్ కిట్‌ను ఎంచుకోవాలి.

శుభ్రమైన ముఖానికే మేకప్: సాధారణంగా చాలా మంది మేకప్‌కు ముఖం ఎలా ఉన్నా ఫరవాలేదనుకుంటారు. మేకప్ చాటున అన్నిటినీ దాచేయవచ్చనుకుంటారు. కానీ మేకప్‌కు ముఖాన్ని సిద్ధం చేసుకోవాలంటే, ముందుగా ముఖాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. గంటల తరబడి ముఖం మీద ఉండిపోయిన మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ మీద మేకప్ అప్లై చేసుకోవడం సరి కాదు. ఈ నియమం లిప్‌స్టిక్‌కు మాత్రమే మినహాయింపు. లిప్‌స్టిక్ లేదా గ్లాస్‌ను తేలికగా రీఅప్లై చేసుకోవచ్చు. అయితే కాస్త ఖాళీ సమయం దొరికినా న్యాప్కిన్‌ను నీళ్లలో ముంచి, పెదవుల మీది లిప్‌స్టిక్ పూర్తిగా తొలగించి తిరిగి అప్లై చేసుకుంటే, మరింత ఆకర్షణీయంగా కనిపిస్తాం.

మురికి బ్రష్‌లతో తంటా: మురికి మేకప్ బ్రష్షులతో చర్మ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఇందుకోసం వారాంతాల్లోని తీరిక సమయాలను కేటాయించాలి. గోరువెచ్చని నీళ్లను గిన్నెలో నింపి, ఒక టీస్పూన్ షాంపూ కలిపి, బ్రష్ కుంచెలన్నీ మునిగేలా పది నిమిషాలు నానబెట్టి, వేళ్లతో సున్నితంగా రుద్ది శుభ్రం చేసి, తాజా నీళ్లలో కడగాలి. తర్వాత బ్రష్‌లను టవల్ మీద ఆరబెట్టి, దాచుకోవాలి. మేకప్ బ్రష్‌లు అదనంగా కొని పెట్టుకుంటే, అత్యవసరమైన సమయాల్లో అక్కరకొస్తాయి. పైగా ఖరీదైన బ్రష్‌లనే ఎంచుకోవాలనే నియమమేమీ లేదు. నాణ్యత విషయంలో రాజీ పడినా మేకప్‌లో అంతగా మార్పులుండవు.

కనుబొమలు ప్రధానమే: చాలా మంది ముఖంలోని అన్ని అంశాలకూ ప్రాధాన్యం ఇచ్చి, కనుబొమలను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. అలాగని వాటిని అవసరానికి మించి దిద్దుకున్నా, ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. కాబట్టి తీర్చిదిద్దిన కనుబొమల కోసం, మ్యాట్ ఐషాడోతో కనుబొమలు దిద్దుకోవాలి. కనుబొమల రంగుకు దగ్గరగా లేదా అంతకంటే లేత రంగులో ఉండే ఐబ్రో పెన్సిల్‌నే ఉపయోగించాలి.



మేకప్‌తో నిద్ర: ఇది సరి కాదు. ఎంత అలసటతో పక్క మీద వాలిపోయినా, మేకప్ తొలగించడం మర్చిపోకూడదు. లేదంటే చర్మ రంధ్రాలు పూడుకుపోయి, ఇన్‌ఫెక్షన్లు తలెత్తుతాయి. తర్వాతి రోజు ముఖం తాజాగా వెలిగిపోవాలంటే ముందు రోజు వేసుకున్న మేకప్ పూర్తిగా తొలగించి, చర్మానికి గాలి సోకేలా చూసుకోవాలి. మేకప్ తొలగించడానికి క్లీన్సింగ్ మిల్క్ లేదా స్వచ్ఛమైన కొబ్బరినూనె ఉపయోగించవచ్చు. మేకప్ తొలగించి, సబ్బుతో ముఖాన్ని శుభ్రం చేసుకున్న తర్వాత, తప్పనిసరిగా నాణ్యమైన మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి.

బాల్కనీ... డెకరేట్ చేసుకోండిలా...

నగరజీవులు ఇంట్లో కాసేపు సేదతీరాలంటే బాల్కనీయే దిక్కు. సాయంకాలం కాఫీ సిప్ చేసేందుకు అది కరెక్ట్ ప్లేస్. రాత్రుళ్లు ప్రశాంతంగా ఒక పుస్తకాన్ని చదువుకోవాలంటే దీని కంటే మంచి ప్రదేశం దొరకదు. మరి అలాంటి బాల్కనీని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవాలంటే ప్లానింగ్ ఉండాలి. బాల్కనీ అలంకరణలో నిపుణులు సూచిస్తున్న సలహాలు ఇవి..

పూలకుండీలు, మొక్కలు: బాల్కనీ ఆకర్షణీయంగా కనిపించాలన్నా, కాసేపు సేదతీరేందుకు కూర్చోవాలని అనిపించాలన్నా పూలకుండీలు, మొక్కలతో అలంకరించుకోవాలి. మీ అభిరుచికి తగినవిధంగా పూల మొక్కలను, తీగ మొక్కలను ఎంచుకోవచ్చు. అయితే వాటి అమరిక నీట్‌గా ఉండాలి. బాల్కనీలో ఉన్న కొద్దిపాటి స్థలాన్ని ఆక్రమించేదిగా ఉండకూడదు. స్థలం తక్కువగా ఉంటే కుండీలు వేలాడదీసుకోవచ్చు. షెల్ఫ్‌లు ఏర్పాటు చేసుకుని వాటిలో పూల కుండీలు అమర్చుకోవచ్చు. విస్తీర్ణాన్ని బట్టి స్టాండ్‌ను పెట్టుకోవచ్చు. రాత్రివేళ బాల్కనీ లుక్ ట్రెండీగా కనిపించాలంటే హ్యాంగింగ్ లైట్స్, ఫైరీ లైట్స్ అమర్చుకోవాలి. అయితే ఎక్కువ వెలుతురు ఉండకూడదు. డిమ్ లైటింగ్ ఉండాలి. అలా అమర్చుకుంటే రాత్రుళ్లు కాసేపు సేదతీరడానికి ఇంతకన్నా మంచి ప్రదేశం దొరకదు.

స్థలాన్ని బట్టి: బాల్కనీ విస్తీర్ణం పెద్దగా ఉంటే పర్వాలేదు. కానీ చిన్నగా ఉంటేనే సీటింగ్ ఏర్పాటుకు కాస్త ఇబ్బంది ఉంటుంది. అలాంటప్పుడు ఫోల్డబుల్ కుర్చీలు, టేబుళ్లను సెట్ చేసుకోవాలి. అనవసరమైన వస్తువులకు బాల్కనీలో చోటు ఇవ్వొద్దు. స్థలం ఎక్కువగా ఉంటే సోఫా ఏర్పాటు చేసుకుని రంగురంగుల దిండ్లు పెట్టుకుంటే రిలాక్స్ కావడానికి పర్‌ఫెక్ట్ ప్లేస్‌గా మారుతుంది. చిన్నక్యాబినెట్ పెట్టుకుంటే స్టోరేజ్ ప్లేస్‌గా ఉపయోగపడుతుంది. అదే సమయంలో కూర్చోవడానికి పనికొస్తుంది.

ఆర్ట్ వర్క్, ఫ్రేమ్స్: బాల్కనీ గోడలకు ఆర్ట్ వర్క్‌ని, ఫ్రేమ్స్‌ని వేలాడదీయడం ద్వారా ఆకర్షణీయంగా కనిపించేలా తీర్చిదిద్దుకోవచ్చు. ఆర్ట్ వర్క్ అందుబాటులో లేకపోతే మొజాయిక్ మిర్రర్స్‌ని పెట్టుకోవచ్చు. బాల్కనీ ఫ్లోరింగ్ మార్చుకోవడం ద్వారా న్యూ లుక్‌ను తీసుకురావచ్చు. గ్రాస్ మ్యాట్ ఏర్పాటు చేస్తే గ్రీనరీ లుక్ వస్తుంది. బాల్కనీ ప్రకృతికి దగ్గరగా ఉన్న అనుభూతిని



అందించేలా ఉంటే బాగుంటుంది. లివింగ్‌రూమ్‌లో కన్నా బాల్కనీలో ఎక్కువ సమయం గడపటానికి ఇష్టపడే వారైతే ఒక కాఫీ టేబుల్, కొన్ని కుషన్లు, క్యాండిల్స్‌లు లాంటివి ఏర్పాటు చేసుకోవాలి. ఈ అలంకరణ వైబ్స్‌ని క్రియేట్ చేస్తుంది. బాల్కనీలో ఏర్పాటు చేసుకునే ఫర్నిచర్ వెదర్‌ప్రూఫ్ అయితే బాగుంటుంది. ఆకాశహర్మ్యాల్లో నివసిస్తున్నట్లయితే బాల్కనీలో నుంచి సిటీ వ్యూ చక్కగా ఉంటుంది. ఇలాంటి వారు బాల్కనీలో గ్లాస్ రెయిలింగ్ ఏర్పాటు చేసుకోవాలి. ఫాల్స్ సీలింగ్ ఏర్పాటు చేసుకుంటే ఫ్యాన్, ఫోకస్ లైట్లు అమర్చుకోవచ్చు. వుడెన్ డిజైన్ ఎంచుకుంటే కాంటెంపరరీ లుక్ వస్తుంది. అభిరుచిని బట్టి వాల్ పెయింటింగ్స్‌ను వేసుకోవచ్చు. వేలాడే ఊయలను అమర్చుకున్నా సింప్లీ సూపర్బ్‌గా ఉంటుంది. స్థలం, అవసరాలను బట్టి ప్లానింగ్‌తో డెకరేట్ చేసుకుంటే సేదతీరడానికి పర్‌ఫెక్ట్ ప్లేస్‌గా ఉంటుంది.

నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ అంటున్నారు



కొరటాల శివ

'మా అందరి నాలుగేళ్ల కష్టమే 'దేవర' చిత్రం. ఆదరిస్తున్న ప్రేక్షకులకు, ఇస్తున్న రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లకు ధన్యవాదాలు. నందమూరి అభిమానులకు మేమెప్పుడూ రుణపడి ఉంటాం. 'దేవర' కోసం దర్శకుడు కొరటాల శివ చాలా కష్టపడ్డారు. ఎన్టీఆర్ ఇరగదీశాడు. తను వన్ మ్యాన్ షో చేశాడు. నాకెంతో గర్వంగా ఉంది' అన్నారు కల్యాణ్‌రామ్. ఎన్టీఆర్ ద్విపాత్రాభినయంతో ఆయన నిర్మించిన 'దేవర' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెలబ్రేషన్స్‌లో ఆయన మాట్లాడారు. ఆ తర్వాత కొరటాల శివ మాట్లాడుతూ 'ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. మూడేళ్ల కష్టం 'దేవర. నా కెరీర్‌లోనే బెస్ట్ ఫిల్మ్ అంటున్నారు. ఈ అవకాశం ఇచ్చిన ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్, సుధాకర్‌లకు ధన్యవాదాలు. చివరి నిముషం వరకూ అందరూ కష్టపడ్డారు. అందుకే ఇంత పెద్ద విజయం దక్కింది' అన్నారు. 'దేవర' చిత్రాన్ని తెలంగాణలో విడుదల చేసిన దిల్ రాజు మాట్లాడుతూ ' స్టార్ హీరో సినిమా రిలీజ్ అనగానే పండగ వాతావరణం ఉంటుంది. నేను రాత్రి సినిమా చూశా. ఈ చిత్రం ఇంత పెద్ద విజయం సాధించిందంటే కారణం ఎన్టీఆరే. వన్ మ్యాన్ షోతో సినిమాను నిలబెట్టారు' అన్నారు.



వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.25 లక్షల చెక్కు అందజేస్తున్న మంచు మోహన్‌బాబు, విష్ణు

'ఢిల్లీలో మీ స్నేహితులు...' అనకుండా ఉండాల్సింది'

● ప్రకాశ్‌రాజ్ ఉద్దేశం నాకు అర్థమైంది - ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



'ప్రకాశ్‌రాజ్ సోషల్ మీడియా ద్వారా వెలిబుచ్చిన అభిప్రాయాన్ని నేను తప్పుగా అర్థం చేసుకోలేదు. ఆయన ఉద్దేశం నాకు సరిగానే అర్థమైంది' అని పవన్ కల్యాణ్ వెల్లడించారు తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో పెట్టిన ఓ పోస్టులో పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి 'మీ వ్యాఖ్యలు మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా ఉన్నాయి... కేంద్రంలోని మీ స్నేహితులకు ధన్యవాదాలు' అని ప్రకాశ్ రాజ్ ట్వీట్ చేయడం దుమారం రేపింది. దీనిపై తాజా ఇంటర్వ్యూలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దోషులకు శిక్ష పడాలనే ఉద్దేశంతో నేను స్పందిస్తే... 'దిల్లీలో మీ స్నేహితులు...' అంటూ కామెంట్ చేయాల్సిన అవసరం ప్రకాశ్‌రాజ్‌కు లేదు. ఆయన పోస్ట్‌ను నేను తప్పుగా అర్థం చేసుకోలేదు. ఆయన ఉద్దేశం నాకు సరిగానే అర్థమైంది' అని చెప్పారు. 'ప్రకాశ్‌రాజ్ నాకు మంచి మిత్రుడు. రాజకీయంగా దారులు వేరైనా మా మధ్యన ఒకరంటే ఒకరికి గౌరవం ఉంది. ఆయనతో కలసి పనిచేయడం ఇష్టం' అని కూడా పవన్ చెప్పారు.

మనకేం కావాలి.... ప్రకాశ్‌రాజ్ తాజా ట్వీట్

తిరుపతి లడ్డూ కల్తీ వివాదంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకున్న ప్రకాశ్‌రాజ్ శుక్రవారం మరోసారి సోషల్ మీడియా వేదికగా విమర్శలకు దిగారు. అందులో 'మనకేం కావాలి... ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి... తద్వారా రాజకీయ లబ్ధిని సాధించడమా? లేక ప్రజల మనోభావాలు గాయపడకుండా...పరిపాలనా సంబంధమైన... అవసరమైన తీవ్రమైన చర్యలతో... సున్నితంగా సమస్యను పరిష్కరించుకోవడమా?' అంటూ పవన్ కల్యాణ్ పేరును ప్రస్తావించకుండా ప్రకాశ్ రాజ్ ట్వీట్ చేశారు.

మూల్యం చెల్లించుకోకతప్పదు - ఖుష్బూ

లడ్డూ వివాదంపై నటి ఖుష్బూ స్పందించారు. తిరుమల లడ్డూను కల్తీ చేసినవాళ్లు ఎవరైనా మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. 'ఆ వేంకటేశ్వర స్వామి అంతా చూస్తున్నాడు. లడ్డూను కల్తీ చేయడం అంటే కోట్లాది మంది ప్రజల విశ్వాసాలు, మనోభావాలు దెబ్బతీయడమే. అని ఖుష్బూ చెప్పారు.

ఆంధ్రజ్యోతి

నవ్య చిత్రజ్యోతి

శనివారం • 28 సెప్టెంబరు 2024

cinema@andhrajyothy.com



వంద రోజుల్లో విజయాలెన్నో...

ఆరు హిట్స్.. అనేక ఫ్లాపులతో చిత్రసీమ ప్రథమార్థాన్ని ముగించింది. అతి కీలకమైన ద్వితీయార్థంలో ఇప్పటి వరకు వచ్చిన సినిమాలలో.. భారీ చిత్రాలు అంచనాలను అందుకోవడంలో విఫలమయ్యాయి. ఇప్పటికే మూడు నెలలు ముగిశాయి. ఇక ఉన్నది మూడు నెలలే.. ఈ మూడు నెలల్లో అరడజను భారీ చిత్రాలు క్యూలో ఉండటం విశేషం. వాటిలో అలరించేవి ఎన్ని.. చరిత్ర సృష్టించేవి ఏవి.. అంచనాలను తారుమారు చేసేవి ఎన్నో తెలియాలంటే ఏడాదిలోని ఆఖరి వారం వరకూ వేచి చూడాల్సిందే.

పుష్పరాజ్ కోసం ఎదురుచూపులు

2021లో విడుదలైన 'పుష్ప' సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఏ రేంజ్‌లో సత్తా చాటిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాకు కొనసాగింపుగా పార్ట్ 2 ఉంటుందని దర్శకుడు



సుకుమార్ మంచి హైప్‌తో క్లైమాక్స్‌ను ముగించారు. మొదటి భాగానికి మించిన హిట్ కొట్టాలనే లక్ష్యంతో మేకర్స్ ఈ సీక్వెల్‌ను చాలా జాగ్రత్తగా తీర్చిదిద్దుతున్నారు. మొదటి భాగంలో పుష్పరాజ్‌గా అందరినీ అలరించిన అల్లుఅర్జున్.. రెండో భాగం 'పుష్ప:ద రూల్'లో ఏ రేంజ్‌లో చెలరేగుతాడో అని అభిమానులు ఆసక్తిగా కోసం ఎదురుచూస్తున్నారు. డిసెంబరు 6న సినిమా విడుదల కానుంది.

గేమ్ చేంజర్‌గా...

రామ్‌చరణ్, డైరెక్టర్ శంకర్ కలయికలో తెరకెక్కుతోన్న మాగ్నమ్ ఆపస్ ఎంటర్టైనర్ 'గేమ్ చేంజర్'. ఈ సినిమాలో రామ్‌చరణ్ రెండు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారని టాక్. అందులో ఒక పాత్ర అవినీతితో పోరాటం చేస్తుందని సమాచారం. ఈ సినిమాపై అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. డిసెంబరు 20న ఈ సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

దసరాకి వేట మొదలు

'జై భీమ్' ఫేమ్ టీ.జే.జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (ద హంటర్). ఇందులో అమి





తాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజువారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషించారు. రజనీకాంత్, అమితాబ్ 33 ఏళ్ల తర్వాత కలసి నటిస్తున్న చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. ఇందులో ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా రజనీ కనిపించనున్నారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది. 'జైలర్'తో సూపర్ హిట్ కొట్టి మంచి ఫామ్‌లో ఉన్న రజనీకాంత్‌కు ఈ సినిమా అంతకుమించిన సక్సెస్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కన్నప్ప కనువిందు...

మంచు విష్ణు నటిస్తున్న మైథలాజికల్ చిత్రం 'కన్నప్ప'. అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకుడు. ఇందులో ప్రభాస్, అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్ సహా పలువురు తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను కేన్స్ చిత్రోత్సవంలో విడుదల చేయడం విశేషం. డిసెంబర్ 20న విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

పోరాట యోధుడి పాత్రలో...

తమిళ హీరో సూర్య పోరాట యోధుడిగా.. నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. నవంబర్ 14న దాదాపు పది



భాషల్లో త్రీడీలో, 2డీలో విడుదలవుతోంది. ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌కు 'వేదాలమ్', 'వీరుడొక్కడే', 'వివేకం' వంటి చిత్రాలు తీసిన శివ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతో సూర్యకు పాన్ ఇండియా గుర్తింపు ఖాయం అని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

గోపీచంద్ విశ్వం

గోపీచంద్ నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'విశ్వం'. శ్రీనువైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. వరుస ఫ్లాపుల్లో ఉన్న గోపీచంద్‌కు, శ్రీనువైట్లకు ఈ సినిమా రిజల్ట్ కీలకం కానుంది. దసరా కానుకగా అక్టోబర్ 11న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి: ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వినూత్న ఆవిష్కరణలతో విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ నుంచి ఆవిర్భవించిన స్టార్టప్‌లు ప్రపంచ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇస్కీ)లో జరుగుతున్న ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్‌లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఆవరణలో ఏర్పాటు చేసిన స్టార్టప్ స్టాళ్లను విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ అధ్యక్షుడు జేఏ చౌదరితో కలిసి సందర్శించారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ.. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను టెక్నాలజీ సహకారంతో పరిష్కరించాలన్న లక్ష్యంగా యువత స్టార్టప్‌లు ప్రారంభించాలన్నారు. స్టార్టప్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని, వినూత్న ఆలోచనలకు పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు.

డిక్లరేషన్ ఇచ్చేందుకు జగన్‌కు మనసు ఒప్పుకోలేదు

- జగన్ తిరుమల పర్యటన రద్దు అందుకేనన్న మెదక్ ఎంపీ రఘునందన్
- క్రైస్తవ మత పెద్దలనుంచి అభ్యంతరాలు వస్తాయని జగన్‌కు భయం
- విదేశాలనుంచి వచ్చే పైసల పంచాయతీలకు భయపడి పర్యటన వాయిదా
- హిందూ సంప్రదాయాలను అన్యమతస్తులు గౌరవించాల్సిందే
- పొంగులేటి ఇంటిపై ఈడీ సోదాలతో బీజేపీకి సంబంధం లేదు

ఖమ్మం, నిజామాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి టీటీడీలో డిక్లరేషన్ ఇచ్చేందుకు మనస్సు ఒప్పుకోక తిరుమల పర్యటన రద్దుచేసుకున్నారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. జగన్ మాట మార్చాడని, హిందూ దేవాలయ సంప్రదాయాలను ఎవరైనా గౌరవించాల్సిందేనని రఘునందన్ సూచించారు. ప్రతి మతానికి నియమావళి, కట్టుబాట్లు ఉంటాయన్నారు. టీటీడీలో కూడా అన్యమతస్తులు వస్తే డిక్లరేషన్‌పై సంతకం చేసి స్వామివారిని దర్శించుకోవాలని నిబంధన ఉన్నప్పుడు అన్యమతస్తుడైన జగన్ రెడ్డి నిబంధన పాటించాలన్నారు. ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రఘునందన్‌రావు మాట్లాడారు. తిరుమల వస్తానని చెప్పిన జగన్ రెడ్డికి ఎవరూ అభ్యంతరం చెప్పలేదని, ఆలయ నిబంధనల ప్రకారం డిక్లరేషన్ ఇవ్వాలని మాత్రమే హిందూ బంధువులు కోరారని ఆయన గుర్తుచేశారు. ఎక్కడ డిక్లరేషన్ ఇస్తే క్రైస్తవ మత పెద్దలనుంచి అభ్యంతరాలు వస్తాయోనని, విదేశాలనుంచి వచ్చే పైసల పంచాయతీలకు భయపడి జగన్ పర్యటన వాయిదా వేసుకున్నారని రఘునందన్‌రావు ఆరోపించారు.

పొంగులేటి ఇంటిపై ఈడీ సోదాలతో బీజేపీకి సంబంధం లేదు

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంటిపై ఈడీ సోదాల విషయంలో బీజేపీకి ఎలాంటి సంబంధమూ లేదని, చట్టం ముందు అందరూ సమానమేనని రఘునందన్‌రావు అన్నారు.

తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై కేంద్రం సీరియస్: అర్వింద్

తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. లడ్డూ కల్తీపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. హిందూ సమాజ ఐక్యతను దెబ్బతీసే కుట్ర జరుగుతుందన్న ఆయన సనాతన ధర్మస్థాపన కోసం బోర్డు గతంలోనే ఏర్పాటు కావాల్సిందన్నారు.

కాళేశ్వరం ఎవరి మానస పుత్రిక?

(మొదటి పేజీ తరువాయి)

కొన్నిటికి సమాధానాలు దాటవేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సబ్ కాంట్రాక్టర్ల వివరాలను కోరగా.. రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు సమాచారం ఇవ్వలేదని బదులిచ్చారు. బ్యారేజీల వైఫల్యానికి నిర్మాణ స్థలాలు మార్చడమే కారణమా? మేడిగడ్డ బ్లాక్-7 కుంగుబాటుకు కారణమేంటి? అని ప్రశ్నించగా 'నేనేమీ చెప్పలేను' అని జవాబిచ్చారు. అయితే, వరద ప్రవాహ వేగాన్ని అంచనా వేయకపోవడం? గేట్లను మ్యానువల్ ప్రకారం ఎత్తకపోవడంతో సీసీ బ్లాకులు దెబ్బతిన్నాయని, రక్షణ వ్యవస్థలపై ప్రభావం పడిందని మీరు అఫిడవిట్‌లో పేర్కొన్నది వాస్తవమేనా అని కమిషన్ అడగ్గా ఔను అని హరిరామ్ బదులిచ్చారు.

తాను ఎవరినీ రక్షించే ప్రయత్నం చేయడం లేదన్నారు. కాళేశ్వరంలో మీ పాత్ర ఏమిటి? బ్యారేజీలతో ఎలాంటి సంబంధాలు ఉన్నాయని ఆరా తీయగా, మధ్య మానేరు (ప్యాకేజీ 10) నుంచి బస్వాపూర్ రిజర్వాయర్ (ప్యాకేజీ-16) దాకా నిర్మాణ పనులను పర్యవేక్షించినట్లు తెలిపారు. 2017లో తానే డీపీఆర్ దాఖలు చేశానని హరిరామ్ చెప్పారు. మీరెందుకు చేశారు? లిఖితపూర్వక ఆదేశాలున్నాయా? అని కమిషన్ కోరింది. ఈఎన్‌సీ (జనరల్) సి.మురళీధర్ మౌఖిక ఆదేశాలతో డీపీఆర్ దాఖలు చేశానని పేర్కొన్నారు. కమిషన్ ప్రశ్నలకు హరిరామ్ జవాబులిలా..

కమిషన్: రామగుండం ఈఎన్‌సీ కింద ఎంత విలువైన పనులు చేశారు? బ్యారేజీ తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ఎందుకు మారింది? సీఎంల సమావేశ మినిట్స్‌లో మీరు కూడా సంతకాలు చేశారా.?

హరిరామ్: రూ.20 వేల కోట్లపైన పనులు చేశారు. 2014లో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పలు సమీక్షల అనంతరం ప్రాణహిత-చేవెళ్లలో హెడ్‌వర్క్స్‌లను మార్చారు. 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణ ప్రతిపాదనలు ఉండగా.. తెలంగాణ సీఎంతో సమావేశం అనంతరం ముంపు లేకుండా 148 మీటర్లకు తగ్గించుకోవాలని మహారాష్ట్ర సీఎం కోరారు. చర్చల అనంతరం ప్రత్యామ్నాయాల్లో భాగంగా హెడ్‌వర్క్స్‌ల మార్పు జరిగింది. సీఎంల సమావేశ మినిట్స్‌లో నా సంతకాలపై రికార్డులను పరిశీలించి చెబుతా.

కమిషన్: కార్పొరేషన్ నుంచి తొలి రుణం దేని కోసం, ఎంత తీసుకున్నారు? మీకు ఆర్థిక నేపథ్యం ఉందా? నాలుగేళ్ల బ్యాలెన్స్ షీట్స్ ఏవీ?

హరిరామ్: 10 బ్యాంకులతో కూడిన యూబీఐ (పూర్వ ఆంధ్రా బ్యాంకు) కన్సార్షియం నుంచి లింక్-1 (మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణం) కోసం తొలి రుణం తీసుకున్నాం. నాకు ఆర్థిక నేపథ్యం లేదు. 2021-22లో మాత్రమే ఆడిట్ జరిగింది. బ్యాలెన్స్ షీట్స్ అందిస్తాం.

> **కమిషన్:** కార్పొరేషన్ ఎప్పుడు ఏర్పాటైంది? అప్పటికి బ్యారేజీలు ఏ దశలో ఉన్నాయి? సీఈవో ఎవరు? మిమ్మల్ని ఎవరు నియమించారు?
>
> **హరిరామ్:** ప్రాజెక్టు నిర్మాణానికి రుణాల కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. అప్పటికి బ్యారేజీల నిర్మాణం ప్రాథమిక దశలోనే ఉంది. ఎండీగా నన్ను నీటి పారుదల శాఖ కార్యదర్శి నియమించారు.

> **కమిషన్:** ప్రాజెక్టు ఖర్చు-ప్రయోజన నిష్పత్తి ఎలా ఉంది? కార్పొరేషన్ వార్షిక నివేదికలను చట్టసభల ముందు ఉంచారా?
>
> **హరిరామ్:** ఖర్చు-ప్రయోజన నిష్పత్తి 1:1.51గా (రూపాయి వెచ్చిస్తే.. రాబడి రూ.1.51) ఉంది. 2016-17 నుంచి 2020-21 మధ్య ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాం. వీటిని సభలో ప్రవేశపెట్టలేదు.

కమిషన్: కార్పొరేషన్ బై లాస్ ఉన్నాయా? ఎంత రుణం తీసుకున్నారు? ఆస్తులు కుదువపెట్టారా? నెలకు ఎంత కడుతున్నారు?

హరిరామ్: నిర్మాణం పూర్తయిన వెంటనే బ్యారేజీలు, టన్నెల్స్ రిజర్వాయర్లు, భూములు, పంప్‌హౌస్‌లను తాకట్టు పెట్టేలా ఒప్పందం ఉంది. బ్యాంకులు/ఆర్థిక సంస్థలు రూ.74,718 కోట్లు మంజూరు చేయగా.. రూ. 62,825 కోట్లు అందాయి. కాళేశ్వరం కార్పొరేషన్‌కు పాలమూరు ఎత్తిపోతల నిర్మాణం బాధ్యతలు కూడా ఇవ్వడంతో మరో రూ.10 వేల కోట్లు తీసుకున్నాం. ఇందులో రూ.7,725 కోట్లు విడుదలయ్యాయి. ఈ నెల 25 వరకు అసలు, వడ్డీ కలిపి రూ.29,737 కోట్లు చెల్లించాం. ప్రతి నెల రూ.950 కోట్లు చెల్లిస్తున్నాం.

బాస్మతి ముసుగులో పారాబాయిల్డ్ బియ్యం!

గుజరాత్‌లో రూ. 7 కోట్ల విలువైన తెలంగాణ బియ్యం పట్టివేత

- 40 కంటైనర్ల బియ్యం సీజ్ చేసిన డీఆర్ఐ

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి బాస్మతి ముసుగులో దొడ్డిదారిన దుబాయ్‌కి ఎగుమతి అవుతున్న పారాబాయిల్డ్ బియ్యాన్ని గుజరాత్ అధికారులు పట్టుకున్నారు. తెలంగాణ నుంచి వెళ్తున్న ఈ బియ్యం గాంధీధామ్ ఓడరేవులో పట్టుబడ్డాయి. రూ.7 కోట్ల విలువైన 40 కంటైనర్ల నాన్ బాస్మతి పారాబాయిల్డ్ బియ్యాన్ని డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని, సీజ్ చేశారు. ఈ 40 కంటైనర్లను టర్మినల్ నుంచి సీఎఫ్ఎస్ (కంటైనర్ ఫ్రైట్ స్టేషన్)కు తరలించి, కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఒక కన్సల్టెన్సీ ఎగుమతిదారుడు, బినామీ సుధాకర్‌తో సహా ముగ్గురిపై డీఆర్ఐ అధికారులు కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపారు. ఇటీవల జరిగిన ఈ ఘటనపై రాష్ట్ర అధికారులకు సమాచారం రావడంతో తాజాగా వెలుగులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం బాస్మతి బియ్యానికి ఎగుమతి సుంకం విధించడంలేదు. దేశీయ ఆహార ధాన్యాల ధరలను, ఎగుమతులను నియంత్రించడానికి పారా బాయిల్డ్ రైస్‌పై 20 శాతం ఎగుమతి సుంకాన్ని వసూలు చేస్తోంది. 2023 ఆగస్టు 25 నుంచి ఈ పన్ను వ్యవస్థ అమలులో ఉంది. అయితే పారా బాయిల్డ్ రైస్‌ను దుబాయ్, యూఏఈ తదితర గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తున్న వ్యాపారులు, దళారులు, మిల్లర్లు.. ప్రభుత్వానికి 20 శాతం అదనపు సుంకం ఎగ్గొట్టడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. ఈ క్రమంలోనే ఎగుమతి సుంకం లేని బాస్మతి బియ్యం ముసుగులో పారా బాయిల్డ్ రైస్‌ను విదేశాలకు పంపిస్తున్నారు. బియ్యం కంటైనర్లలో కింది భాగంలో పారాబాయిల్డ్ రైస్, పైభాగంలో బాస్మతి బియ్యం నింపి అధికారుల కళ్లుకప్పి ఎగుమతి చేస్తున్నారు. ఇదే పద్ధతిలో హైదరాబాద్‌కు చెందిన ఓ కన్సల్టెన్సీ.. 40 కంటైనర్ల పారాబాయిల్డ్ రైస్‌ను గుజరాత్‌లోని గాంధీధామ్ ఓడరేవు నుంచి దుబాయ్‌కి పంపించేందుకు ఏర్పాట్లు చేసింది. రూ.7 కోట్ల విలువైన బియ్యానికి 20 శాతం ట్యాక్స్ ఎగ్గొట్టి లబ్ధిపొందేందుకు ప్రయత్నించి అడ్డంగా దొరికిపోయింది. డీఆర్ఐ అధికారులు.. హైదరాబాద్ నుంచి దుబాయ్‌కి ఎగుమతి అవుతున్న బియ్యాన్ని ఓడరేవులో పట్టుకొని సీజ్ చేశారు. తక్షణ చర్యగా రూ.65 లక్షల జరిమానా విధించినట్లు సమాచారం. 20% ఎగుమతి సుంకం కూడా వసూలు చేసినట్లు తెలిసింది. అదేక్రమంలో బ్యాంకు గ్యారెంటీ కూడా అడిగినట్లు సమాచారం. కాగా, బియ్యం నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. నివేదిక వచ్చిన తర్వాత ఏం చర్యలు తీసుకుంటారనేది తెలుస్తుంది. రిమాండ్ రిపోర్టులో కూడా తెలంగాణ నుంచి బియ్యం అక్రమ రవాణా ఎలా జరుగుతోంది? వ్యాపారులు, దళారులు, మిల్లర్లు ఎగుమతి సుంకం ఎగ్గొట్టడానికి ఎలాంటి వక్రమార్గాలను ఎంచుకుంటున్నారు? అనే అంశాలను ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై రాష్ట్ర అధికారులు కూడా విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా టెండర్లలో విక్రయించిన ధాన్యానికి, గుజరాత్‌లో పట్టుబడిన పారాబాయిల్డ్ రైస్‌కు లింకు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. 35 లక్షల టన్నుల ధాన్యాన్ని 12 లాట్లుగా విభజించి టెండర్లు పిలవగా.. అందులో ఒక (3.50 లక్షల టన్నుల) లాట్ దక్కించుకున్న ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచే పారాబాయిల్డ్ రైస్ ఎగుమతి అయినట్లు తెలుస్తోంది.

కాంగ్రె‌స్‌కు పోయే కాలం దగ్గర పడింది

- ఓట్లు వేసిన ఖర్మానికి ఇళ్లు కూలగొడతారా?
- పేదలతో పెట్టుకున్న ఏ సర్కారూ బాగుపడదు: ఈటల

అల్వాల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అప్పట్లో ఇందిరాగాంధీ పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తే.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి సర్కార్ ఇళ్లు కూలగొడుతుందని.. తెలంగాణలో నిజాం సర్కారు కంటే దుర్మార్గమైన పాలనను రేవంత్ రెడ్డి చేస్తున్నారని, హైడ్రా పేరుతో డ్రామాలు ఆడుతున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. పేదలతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా బాగుపడినట్లు చరిత్రలోనే లేదని, పేదలకు కళ్లనీళ్లు పెట్టించిన వారికి ఎప్పుడూ మంచి జరగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటే పేదల కోసమే ఉంటుందని, పేదలకు ఇళ్లు కట్టిస్తారని ఒకవైపు చెబుతూనే ఓట్లు వేసిన ఖర్మానికి పేదల ఇళ్లు కూలగొడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాని పోయే కాలం వచ్చిందని.. కేసీఆర్ నైజం బయటపడటానికి ఆరేళ్లు పడితే.. రేవంత్ సర్కార్ నైజం తెలవడానికి ఆరు నెలలు కూడా పట్టలేదన్నారు. అల్వాల్ జొన్నబండ పరిసర ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకున్న 70 మంది పేదల ఇళ్లకు అల్వాల్ తహసీల్దార్ నోటీసులిచ్చారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం జొన్నబండను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

మూలధన వ్యయం తగ్గింది!

(మొదటి పేజీ తరువాయి)

చేయగలిగింది. ఇది అంచనా వేసిన రూ.33,486 కోట్లలో 24.87 శాతమే. గత ఏడాది కంటే ఈసారి రూ.10 వేల కోట్ల వరకు తక్కువగా ఖర్చు చేసింది. ఈ వివరాలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) శుక్రవారం విడుదల చేసిన ఆగస్టు నెల ఆదాయ వ్యయాల నివేదికలో వెల్లడించింది. సాధారణంగా మూలధన వ్యయం కింద సాగునీటి ప్రాజెక్టులు, భవనాలు, రోడ్ల నిర్మాణం వంటి వాటి కోసం నిధులు కేటాయిస్తారు. కానీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులపై కాస్త వ్యయం తగ్గించడంతో మూలధన వ్యయంలో వృద్ధి నమోదు కావడం లేదు. ఇక స్టాంపులు-రిజిస్ట్రేషన్ల కింద రాబడి పెరగడం గమనార్హం. గత ఏడాది ఇదే ఐదు నెలల కాలానికి స్టాంపులు-రిజిస్ట్రేషన్ల కింద రూ.5,852 కోట్లు వచ్చాయి. అప్పట్లో అంచనా వేసిన రూ.18,500 కోట్లలో ఇది 31.63 శాతం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇదే పద్దు కింద రూ.18,228 కోట్లు వస్తాయని అంచనా వేయగా.. ఆగస్టు నాటికి రూ.6,390 కోట్లు సమకూరాయి. ఇది 35 శాతంగా నమోదైంది.

ఆగస్టు నాటికి రాబడులు ఇలా..

ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి ఐదు నెలల్లో రాష్ట్ర రెవెన్యూ రాబడుల కింద రూ.61,618 కోట్లు సమకూరాయి. అంచనా వేసిన మొత్తం రాబడులు రూ.2,21,242 కోట్లలో ఇది 27.85 శాతం. ఈ రెవెన్యూ రాబడుల్లో పన్ను ఆదాయం కింద రూ.1,64,397 కోట్లను అంచనా వేయగా.. రూ.57,722 కోట్లు(35.11%) సమకూరాయి. పన్నేతర రాబడి కింద రూ.1,449 కోట్లు, కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద రూ.2,447 కోట్లు వచ్చాయి. ఇక మూలధన రాబడి కింద మొత్తం రూ.52,815 కోట్లను అంచనా వేయగా.. రూ.29,466 కోట్లు సమకూరాయి. ఇందులో అప్పుల రూపంలో రూ.49,255 కోట్లను అంచనా వేయగా.. ఆగస్టు నాటికి రూ.29,449 కోట్లు(59.79%) వచ్చాయి. అంటే.. లక్షిత అప్పులో ఐదు నెలల్లోనే 60 శాతం మేర అప్పులు తీసుకున్నట్లయింది. ఇలా రెవెన్యూ, మూలధన రాబడుల కింద మొత్తం రూ.91,085 కోట్లు వచ్చాయి. ఇది ఆర్థిక సంవత్సరంలో అంచనా వేసిన రూ.2,74,057 కోట్లలో 33.24 శాతం కావడం గమనార్హం. కాగా, ఆగస్టు నాటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.85,467 కోట్ల(33.59%)ను ఖర్చు చేసింది.

ఇదేం దేశం.. ఇదేం హిందుత్వం!?

(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆ నిబంధననే తప్పుపట్టారు. 'ఎలాంటి లౌకికవాదంలో, ఎలాంటి లౌకిక దేశంలో మనం నివసిస్తున్నాం. ఇదెక్కడి హిందూత్వం.. ఇదేం హిందూయిజం' అని ప్రశ్నించారు. నాలుగ్గోడల మధ్య తాను బైబిల్ చదువుతానని.. బయట హిందూ, ముస్లిం, పార్శీ సిక్కు మతాలనూ గౌరవిస్తానని చెప్పారు. తిరుమల వేంకటేశ్వరుడిని దర్శించుకుంటానంటే తన మతమేమిటని అడుగుతారా అని మండిపడ్డారు. తన మతం మానవత్వమని.. డిక్లరేషన్‌లో రాసుకోవాలంటూ టీటీడీకి సూచించారు. దేవాలయానికి వెళ్తే మతమేమిటని అడుగుతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడికి వెళ్తే మతమేంటో చెప్పాలనడమే హిందూత్వమా అని ప్రశ్నించారు. తాను ఎప్పటి నుంచో వెంకన్న దర్శనానికి వెళ్తున్నానని.. ఏనాడూ కోరని డిక్లరేషన్ ఇప్పుడే ఎందుకు అడుగుతున్నారని అడిగారు. హిందూత్వకు టార్చ్ బేరర్లమని చెప్పుకొనే బీజేపీ.. దేవాలయాలకు వెళ్తే.. మతాన్ని అడుగుతుంటే సమర్థిస్తుందా అని ప్రశ్నించారు. లడ్డూలో కల్తీ నెయ్యి వాడకపోయినా.. వాడినట్లుగా అబద్ధాలు చెబుతుంటే చంద్రబాబును ఆ పార్టీ ఎందుకు నిలదీయడం లేదన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన తనలాంటివాడినే డిక్లరేషన్ అడుగుతుంటే.. సామాన్యులు, ఎస్సీ, ఎస్టీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో ఐదేళ్లపాటు వెంకన్నకు వస్త్రాలు సమర్పించానన్నారు. దేవాలయానికి వెళ్తే మత ప్రస్తావనతో అడ్డుకోవడం దేశంలో ఎక్కడా ఉండదని చెప్పారు. తిరుమల లడ్డూపై చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనని తేలిపోవడంతో.. దానిని పక్కదోవ పట్టించడానికే డిక్లరేషన్ అంశాన్ని తీసుకొచ్చారని చెప్పారు. జంతువుల కొవ్వుతో తిరుమల లడ్డూ తయారుచేశారంటూ బాబు చెబుతున్నవి అబద్ధాలేనని తాను నిరూపిస్తానన్నారు. టీడీపీ హయాంతోపాటు తన హయాంలోనూ నెయ్యి కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలూ జరుగలేదని చెప్పారు. ప్రసాదం తయారీ కోసం కొనుగోలు చేసే నెయ్యి నాణ్యతను పరిశీలించేందుకు మూడంచెల పరీక్షలు ఉంటాయని.. కల్తీ ఉంటే వెంటనే ఆ నేతి లారీని వెనక్కు పంపేస్తారని తెలిపారు. ఈ ఏడాది జూలైలో వచ్చిన నాలుగు లారీలను అదేవిధంగా వెనక్కి పంపేశారన్నారు.

వెళ్లొద్దని మేంచెప్పామా?:చంద్రబాబు

తిరుమల వెళ్లవద్దని మాజీ సీఎం జగన్‌కు తామెవరం చెప్పలేదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆయనే సాకులు వెతుక్కుని వెళ్లకపోతే తామేం చేస్తామని ప్రశ్నించారు. తాను ఆగిపోయి ఆ నెపం మరొకరి మీద వేయాలని చూస్తే మౌనంగా వింటూ ఉండలేమని స్పష్టం చేశారు. తిరుమల పర్యటనకు సంబంధించి జగన్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. 'స్వామిపై భక్తి ఉన్నవారు ఎవరైనా తిరుమలకు వెళ్లవచ్చు. వేరే మతాల వారు వెళ్లాలనుకుంటే అక్కడి ఆచార సంప్రదాయాలు పాటిస్తూ నిశ్చింతగా వెళ్లిరావచ్చు. జగన్‌ను తిరుమల పోవద్దని ఎవరూ చెప్పలేదు. తిరుమల హిందువులకు పెద్ద పుణ్యక్షేత్రం. ఆ ఆలయంలో కొన్ని ఆచార సంప్రదాయాలు ఉన్నప్పుడు దానిని పాటించడం సందర్శించేవారు పాటించాల్సిన కనీస ధర్మం. ఆలయ సంప్రదాయాలు పాటించకపోతే భక్తులు బాధపడతారు. ఇంతకు ముందు కూడా డిక్లరేషన్ ఇవ్వకుండా వెళ్లాను కాబట్టి మళ్లీ వెళ్తాననడం ఏం పద్ధతి" అని చంద్రబాబు మండిపడ్డారు.

నీట్ కౌన్సెలింగ్‌కు అర్హులందరినీ అనుమతించాలి

- న్యాయస్థానాన్ని ఆశ్రయించిన వారికే కౌన్సెలింగ్ సరికాదు
- విద్యార్థులకు న్యాయం చేయండి
- స్థానికత అంశంపై సుప్రీంకోర్టులో వాదనలు
- విచారణ ఎల్లుండికి వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానికత వ్యవహారంలో అర్హులందరినీ నీట్ కౌన్సెలింగ్‌కు అనుమతించాలని.. కేవలం హైకోర్టును ఆశ్రయించినవారినే కౌన్సెలింగ్‌కు అనుమతించడం సరికాదని.. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. దీనిపై గత తీర్పును సవరించి అర్హులైన విద్యార్థులందరికీ న్యాయం చేయాలని కోరారు. వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతకు సంబంధించి తెలంగాణ సర్కారు జీవో నంబర్ 33 తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. నీట్‌కు ముందు నాలుగు సంవత్సరాలు స్థానికంగా చదవాలని ఆ జీవోలోని నిబంధన 3 (ఏ)లో స్పష్టం చేసింది. దీనిని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి నాగ నరసింహ అభిరామ్, మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. సుదీర్ఘ వాదనల అనంతరం.. హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం సెప్టెంబర్ 5న తీర్పు చెప్పింది. ఒక విద్యార్థి తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలేవీ రూపొందించలేదని తీర్పులో అభిప్రాయపడిన ధర్మాసనం.. తొలుత మార్గదర్శకాలు, నిబంధనలను రూపొందించాలని స్పష్టం చేసింది. వాటి మేరకు ప్రతి విద్యార్థికీ స్థానిక కోటా వర్తింపజేయాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌పై.. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కిందటి శుక్రవారం విచారణ చేపట్టింది. ఒకసారి మినహాయింపు కింద హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలపడంతో.. ఆ విషయాన్ని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనితో హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవకాశం కల్పించడంతోపాటు హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. అలాగే ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. ఆ పిటిషన్ మళ్లీ శుక్రవారం సీజేఐ చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. గతంలో హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులతోపాటు మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్లన్నింటిపై ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. విద్యార్థుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులనే కౌన్సెలింగ్‌కు అనుమతించడం సరికాదని, అర్హులందరినీ కౌన్సెలింగ్‌కు అనుమతించాలని కోరారు. దీనికి సీజేఐ స్పందిస్తూ.. ఆ తీర్పును సవరించాలంటే గతంలో తీర్పు ఇచ్చిన ధర్మాసనం మళ్లీ విచారణ చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం.. జస్టిస్ పార్దీవాలా అందుబాటులో లేరని, అందుకే సోమవారం విచారణ చేపడతామని స్పష్టం చేశారు.

ఏసీబీ వలలో ఆర్అండ్‌బీ అధికారులు

- రూ.14 వేలు లంచం తీసుకున్న ఈఈ, ఏటీవో
- రూ.5 వేలు తీసుకుంటూ చిక్కిన గ్రామ కార్యదర్శి
- జనగామ, సంగారెడ్డి జిల్లాల్లో ఘటనలు

జనగామ/కొండాపూర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ జనగామ జిల్లాలో ఇద్దరు ఆర్అండ్‌బీ అధికారులు ఏసీబీకి చిక్కారు. అలాగే సంగారెడ్డి జిల్లాలో ఓ పంచాయతీ కార్యదర్శి అడ్డంగా దొరికిపోయాడు. జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం బండ్లగూడెం గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి చిర్ర సత్యపాల్‌రెడ్డి సతీమణి నీల పేరు మీద లింగాల ఘనపురంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ మంజూరయింది. బంక్ ఏర్పాటు చేసేందుకు జిల్లా పంచాయతీ అధికారి, ఆర్అండ్‌బీ ఈఈ, జనగామ ఏసీపీ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంది. ఎన్‌వోసీ కోసం ఆర్అండ్‌బీ ఈఈ చిలుకపాటి హుస్సేన్‌ను చిర్ర సత్యపాల్ రెడ్డి ఇటీవల కలిశారు. ఎన్‌వోసీకి రూ.17 వేలు ఇవ్వాలని హుస్సేన్ డిమాండ్ చేశారు. దీంతో సత్యపాల్‌రెడ్డి వరంగల్ ఏసీబీ అధికారులను కలిశారు. వారి సూచన మేరకు సత్యపాల్ శుక్రవారం మధ్యాహ్నం జనగామ కలెక్టరేట్‌లోని రెండో అంతస్థులో ఉన్న ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ హుస్సేన్‌కు రూ.12 వేలు ఇచ్చారు. ఈఈ సూచన మేరకు కార్యాలయంలో పనిచేసే అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ రవీందర్‌కు రూ.2 వేలు ఇచ్చారు. ఈ క్రమంలో అక్కడే మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు హుస్సేన్, రవీందర్‌పై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టుకు తీసుకెళ్లారు. మరోవైపు, సంగారెడ్డి జిల్లా కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి షకీల్ రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కొండాపూర్ గ్రామానికి చెందిన మాచేపల్లి అఫ్సర్.. తన సోదరుడి పేరున ఉన్న ఇల్లు, విద్యుత్ కనెక్షన్‌ను తన పేరు మీదకు మార్చాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు పంచాయతీ కార్యదర్శి రూ.25 వేలు డిమాండ్ చేశాడు. రూ.7 వేలు ఇస్తానని చెప్పిన అఫ్సర్.. ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం అఫ్సర్.. షకీల్‌కు ఎంఈవో కార్యాలయం వద్ద రూ.5 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

అటవీ అధికారులపై ఇనుపరాడ్లతో దాడి

- ఇద్దరికి గాయాలు.. ములుగు జిల్లా తాడ్వాయిలో ఘటన

తాడ్వాయి, సెప్టెంబరు 27: అటవీ భూమిలో చెట్లు నరికి చదును చేశారంటూ జేసీబీని సీజ్ చేయబోయిన అటవీ అధికారులపై ఆ జేసీబీ యజమాని, అతని అనుచరులు ఇనుప రాడ్లతో దాడి చేశారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం దామెరవాయి సమీపంలో గురువారం అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ తీవ్రంగా గాయపడ్డారు. గురువారం రాత్రి అటవీ భూమిలో చెట్లను నరికేస్తున్నారన్న సమాచారంతో ఫారెస్ట్ సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, ఫారెస్ట్ బీట్ అధికారులు శరత్‌చంద్ర, సుమన్, బేస్‌క్యాంపు ఉద్యోగి ఎట్టి శ్రీను, డ్రైవర్ రాజేందర్ ఆ ప్రాంతానికి బయలుదేరారు. ఈ క్రమంలో జేసీబీతో సహా ఎదురువచ్చిన యజమాని గంట సూరజ్‌రెడ్డిని విచారించి యంత్రాన్ని స్వాధీనపర్చుకున్నారు. జేసీబీని తాడ్వాయి రేంజ్ కార్యాలయానికి తరలిస్తుండగా సూరజ్‌రెడ్డి అనుచరులు అడ్డగించి దాడి చేశారు. దీంతో వినోద్‌కుమార్, శరత్‌చంద్రల తలలకు తీవ్రగాయాలయ్యాయి. చేతివేళ్లు విరిగాయి. అటవీ శాఖకు చెందిన జీపును కూడా నిందితులు ధ్వంసం చేశారు. తాడ్వాయి పోలీసులు అటవీ అధికారులను ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడ్డ గంట సూరజ్‌రెడ్డి, గంట శశిధర్, పాండవుల సాయి, నీరటి శ్రీకాంత్, మాదరి చంటిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సంఘటనలో శశిధర్‌కు కూడా గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జేసీబీని పోలీసులు సీజ్ చేశారు.

స్కూల్ బాగా నడవాలని 11 ఏళ్ల బాలుడిని బలిచ్చారు!

ఆగ్రా, సెప్టెంబరు 27: తమ స్కూలు అడ్మిషన్లతో కళకళలాడాలని ఆ బడిలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని బలిచ్చారు ఓ ప్రైవేటు పాఠశాల యజమానులు. యూపీలోని హత్రాస్‌లో ఈ ఘోరం వెలుగు చూసింది. డీఎల్ పబ్లిక్ స్కూల్ ఓనర్ జశోధన్ సింగ్‌కు తాంత్రిక పూజలపై విశ్వాసం మెండు. బడి విజయవంతంగా నడిచేందుకుగాను ఓ పిల్లాడిని బలివ్వాలని స్కూల్ డైరెక్టర్ అయిన తన కుమారుడు దినేశ్ బాఘెల్‌కు సూచించగా సరేనన్నాడు. ఈ మేరకు జశోధన్, దినేశ్‌తో పాటు ప్రిన్సిపల్ లక్ష్మణ్ సింగ్ మరో ఇద్దరు ఉపాధ్యాయులు కలిసి సెప్టెంబరు 23న హాస్టల్‌లో నిద్రిస్తున్న కృతార్థ్ (11) అనే బాలుడిని అపహరించారు. తాంత్రిక పూజల కోసం బడి ప్రాంగణంలోకి తీసుకెళ్లగా అక్కడ నిద్రలేచిన బాలుడు బిగ్గరగా ఏడుస్తుండటంతో గొంతు నులిమి చంపారు. తర్వాత బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని, ఆస్పత్రికి తీసుకెళుతున్నామంటూ తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పగా.. వారొచ్చి దినేశ్ కారును అడ్డుకున్నారు. ఆ కారులోంచి బాలుడి మృతదేహం స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, సెప్టెంబరు 6న తొమ్మిదేళ్ల బాలుడిని బలిచ్చేందుకు వీరు ప్రయత్నించారని పోలీసుల దర్యాప్తులో తేలింది.

రక్షణశాఖ కమిటీలో ప్రతిపక్ష నేత రాహుల్

(మొదటి పేజీ తరువాయి)

చైర్మన్‌గా రాధామోహన్ సింగ్, కమ్యూనికేషన్స్ అండ్ ఐటీ కమిటీ చైర్మన్‌గా నిశికాంత్ దూబే, హోం కమిటీ చైర్మన్‌గా రాధామోహన్ దాస్, ఆర్థిక వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా భర్తృహరి నియమితులయ్యారు. వీరందరూ అధికారపక్షమైన బీజేపీ ఎంపీలు. నాలుగు కమిటీలకు ప్రతిపక్ష కాంగ్రెస్ సారథ్యం వహించనుంది. వాటిలో మహిళలు, విద్య, యువజన క్రీడా వ్యవహారాల కమిటీ (దిగ్విజయ్ సింగ్), విదేశీ వ్యవహారాల కమిటీ (శశిథరూర్), గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కమిటీ (సప్తగిరి శంకర్ ఉలాకా), వ్యవసాయం, పశుపోషణ, ఆహార ఉత్పత్తి కమిటీ (చరణ్‌జిత్ సింగ్) ఉన్నాయి. కాగా తెలంగాణ, ఏపీకి చెందిన పలువురు ఎంపీలకు వివిధ కమిటీల్లో సభ్యత్వంతోపాటు సారథ్య బాధ్యతలు కూడా లభించాయి. టీడీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా, బీజేపీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ రైల్వే కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. విదేశీ వ్యవహారాల కమిటీలో డీకే అరుణ, కే లక్ష్మణ్, అసదుద్దీన్ ఒవైసీలకు, వాణిజ్య కమిటీలో రేణుకాచౌదరికి, రసాయనాలు, ఎరువుల కమిటీలో ఈటల రాజేందర్, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కమిటీలో కడియం కావ్యకు సభ్యత్వం లభించింది.

కమిటీల్లో తెలుగు ఎంపీలు

వాణిజ్యశాఖ- రేణుకా చౌదరి,శ్రీ భరత్; హోంశాఖ, రక్షణ శాఖ కమిటీలు- కేశినేని శివనాథ్; మహిళలు, పిల్లలు, యువజనులు, క్రీడలు- దగ్గుబాటి పురంధేశ్వరి; పరిశ్రమలు- గొల్లబాబూరావు, అరవింద్ ధర్మపురి, మల్లురవి, కొండావిశ్వేశ్వర్ రెడ్డి; సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ, అటవీ శాఖ- వంశీకృష్ణ గడ్డం, దామోదర రావు దివకొండ, పరిమళ్ నత్వానీ; రవాణా, పర్యాటక రంగం, సాంస్కృతికం- తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, సురేశ్ షెట్కర్, వి. విజయసాయిరెడ్డి; ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం- డాక్టర్ కడియం కావ్య, బైరెడ్డి శబరి, బి. పార్థసారథి రెడ్డి; సిబ్బంది, ప్రజాసమస్యలు, న్యాయశాఖ- ఎం.రఘునందన్ రావు, కె. ఆర్ సురేశ్‌రెడ్డి; కమ్యూనికేషన్లు, ఐటీ- రామసహాయం రఘురాం రెడ్డి, ఎస్.నిరంజన్ రెడ్డి, కలిశెట్టి అప్పలనాయుడు; ఇంధన శాఖ- కుందూరు రఘువీర్; విదేశీ వ్యవహారాలు- డీకే అరుణ, అసదుద్దీన్ ఒవైసీ, వైఎస్ అవినాశ్ రెడ్డి, కే లక్ష్మణ్; ఆర్థిక మంత్రిత్వశాఖ కమిటీ- లావు శ్రీ కృష్ణదేవరాయలు, సీఎం రమేశ్, పీవీ మిధున్ రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వల్లభనేని బాలశౌరి, వైవీ సుబ్బారెడ్డి; కార్మిక, జౌళి, నైపుణ్యాభివృద్ధి- జీఎం హరీశ్ బాలయోగి, జి.లక్ష్మీనారాయణ; పెట్రోలియం, సహజవాయువు- వల్లభనేని బాలశౌరి, వద్దిరాజు రవిచంద్ర, ఎం గురుమూర్తి, పుట్టా మహేశ్‌కుమార్; రైల్వే కమిటీ- సీఎం రమేశ్, కే లక్ష్మణ్, గృహ, పట్టణ వ్యవహారాలు- మాగుంట శ్రీనివాసులు రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అయోధ్య రామిరెడ్డి; రసాయనాలు, ఎరువులు - ఈటల రాజేందర్, దగ్గుమళ్ల ప్రసాదరావు, మేడా రఘునాథ రెడ్డి, బలరాం నాయక్; బొగ్గు, గనులు, ఉక్కు - బీకే పార్థసారథి, అనిల్ కుమార్ యాదవ్ మండాడి; సామాజిక న్యాయం, సాధికారికత- గోడం నగేశ్; హోంశాఖ- తెన్నేటి కృష్ణ ప్రసాద్.

వరుణుడిదే ఆధిపత్యం

ఆడింది 35 ఓవర్లే..
బంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్ 107/3

తొలి రోజు ఆటకు ఆటంకం

రెండో టెస్టు



కాన్పూర్: ఊహించినట్టుగానే జరిగింది.. భారత్-బంగ్లాదేశ్ జట్ల మధ్య శుక్రవారం మొదలైన రెండో టెస్టును వరుణుడు కాస్త గట్టిగానే అడ్డు నిలిచాడు. మొదటి రోజు ఆట 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. మ్యాచ్ ఆరంభ సమయానికి మైదానం పూర్తి చిత్తడిగా మారడంతో గంట ఆలస్యంగా ఇరు జట్లు బరిలోకి దిగాయి. తొలి సెషన్ సజావుగానే సాగినా.. ఆ తర్వాత రెండో సెషన్ ప్రారంభమైన కాసేపటికే వెలుతురు లేమితో మ్యాచ్‌ను నిలిపివేయాల్సి వచ్చింది. దీనికి తోడు భారీ వర్షం కురవడంతో మధ్యాహ్నం మూడుగంటలకు అంపైర్లు తొలి రోజు ఆటను ముగిస్తున్నట్టు ప్రకటించారు. అప్పటికి బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లలో మూడు వికెట్లకు 107 పరుగులు చేసింది. క్రీజులో మోమినుల్ హక్ (40 బ్యాటింగ్), ముష్ఫికర్ రహీమ్ (6 బ్యాటింగ్) ఉన్నారు. కెప్టెన్ షంటో (31) ఫర్వాలేదనిపించాడు. పేసర్ ఆకాశ్‌దీప్‌నకు రెండు, అశ్విన్‌కు ఓ వికెట్ దక్కాయి. ఇదిలావుండగా అంతా అంచనా వేసినట్టు భారత జట్టు ముగ్గురు స్పిన్నర్లతో కాకుండా, తొలి టెస్టు మాదిరి ఇద్దరితోనే బరిలోకి దిగడం గమనార్హం.



రాత్రి నుంచే వర్షం: ప్రస్తుతం కాన్పూర్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తగ్గట్టుగానే మ్యాచ్‌కు మొదటి మూడు రోజులు ఇబ్బందేనని అంచనా వేశారు. గురువారం రాత్రి నుంచే కురిసిన వర్షంతో గ్రీన్‌పార్క్ అంతా చిత్తడిగా మారింది. దీంతో నిర్ణీత సమయం కంటే గంట ఆలస్యంగా 10.30కి మ్యాచ్ ఆరంభమైంది. ఆకాశం మేఘావృతంగా ఉండడంతో అంతకుముందు టాస్ గెలిచిన కెప్టెన్ రోహిత్ బౌలింగ్ ఎంచుకున్నాడు.

చెలరేగిన ఆకాశ్: కొత్త బంతితో పేసర్లు బుమ్రా, ఆకాశ్, సిరాజ్ కట్టుదిట్టంగా బంతులు వేశారు. దీంతో 24 బంతులు ఎదుర్కొన్న ఓపెనర్ జకీర్.. యశస్వీ మెరుపు క్యాచ్‌తో డకౌట్‌గా వెనుదిరిగాడు. పేసర్ ఆకాశ్ ఈ వికెట్ తీశాడు. కాసేపటికే అతడు షాద్‌మన్ ఇస్లాం (24)ను కూడా ఎల్బీ చేశాడు. అంపైర్ నాటౌట్‌గా ప్రకటించినా.. ఆకాశ్ ఒత్తిడి మేరకు డీఆర్ఎస్‌కు వెళ్లిన రోహిత్ ఫలితం సాధించాడు. అయితే ఈ దశలో షంటో, మోమినుల్ చక్కటి ఫోర్లతో ఎదురుదాడికి దిగారు. అలాగే మరో వికెట్ కోల్పోకుండా ఈ జోడీ తొలి సెషన్‌ను పూర్తి చేసింది. ఆ వెంటనే చిరు జల్లులు కురవడంతో మైదానాన్ని కవర్లతో కప్పేశారు. చివరకు మరో 15 నిమిషాలు ఆలస్యంగా రెండో సెషన్ ఆరంభమైంది. చక్కగా కుదురుకున్న షంటోను అశ్విన్ ఎల్బీ చేయడంతో బంగ్లా షాక్‌కు గురైంది. ఈ నిర్ణయంపై షంటో రివ్యూకు వెళ్లినా ఫలితం లేకపోయింది. మూడో వికెట్‌కు ఈ జోడీ 51 పరుగులు జత చేసింది. అయితే 35వ ఓవర్ తర్వాత వెలుతురు తగ్గిపోవడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. మరో పావుగంటకు భారీ వర్షం తోడవ్వడంతో చేసేదేమీ లేక తొలి రోజును ముగిస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు.

స్కోరుబోర్డు

బంగ్లా తొలి ఇన్నింగ్స్: జకీర్ హసన్ (సి) జైస్వాల్ (బి) ఆకాశ్ దీప్ 0; షాద్‌మన్ (ఎల్బీ) ఆకాశ్ దీప్ 24; మోమినుల్ (బ్యాటింగ్) 40; షంటో (ఎల్బీ) అశ్విన్ 31; ముష్ఫికర్ (బ్యాటింగ్) 6; ఎక్స్‌ట్రాలు: 6; **మొత్తం: 35 ఓవర్లలో 107/3.** వికెట్ల పతనం: 1-26, 2-29, 3-80. **బౌలింగ్:** బుమ్రా 9-4-19-0; సిరాజ్ 7-0-27-0; అశ్విన్ 9-0-22-1; ఆకాశ్ దీప్ 10-4-34-2.

1 ఆసియాలో ఎక్కువ వికెట్లు (420) తీసిన భారత బౌలర్‌గా అశ్విన్. అనిల్ కుంబ్లే (419)ను అధిగమించాడు. మొత్తంగా అతను రెండో స్థానంలో ఉండగా మురళీధరన్ (612) టాప్‌లో ఉన్నాడు.

బంగ్లా అభిమానిపై దాడి?



కాన్పూర్: భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో బంగ్లాదేశ్ వీరాభిమాని టైగర్ రాబీపై దాడి జరిగిందనే కథనం కలకలం రేగింది. మ్యాచ్ సాగుతున్న సమయంలో పులి వేషధారణలో ఉన్న అతడు ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే భద్రతా సిబ్బంది అతడిని 'సి' స్టాండ్ నుంచి బయటికి తెచ్చి ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ తర్వాత కోలుకున్నాక అతడు తనపై దాడి కథనాన్ని ఖండించాడు. విరేచనాలతో పాటు కడుపులో తిప్పినట్టు అనిపించడంతోనే అస్వస్థతకు గురయినట్టు, ప్రస్తుతం అంతా బానే ఉందని తేల్చాడు.

సెమీస్‌కు గాయత్రి జోడీ

మకావు ఓపెన్ నుంచి శ్రీకాంత్ అవుట్

మకావు: భారత డబుల్స్ స్టార్ జోడీ పుల్లెల గాయత్రీ గోపీచంద్, ట్రీసా జాలీ మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళుతోంది. ఇక కిడాంబి శ్రీకాంత్‌కు ఇక్కడా నిరాశే ఎదురైంది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో మూడోసీడ్ గాయత్రి/ట్రీసా జంట 21-12, 21-17తో చైనీస్ తైపీకి చెందిన ఆరోసీడ్ ద్వయం సూ యిన్ హుయి/లాన్ జియున్‌ను వరుసగేముల్లో ఓడించి సెమీఫైనల్ చేరింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో మాజీ ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్, ఆరోసీడ్ కిడాంబి శ్రీకాంత్ 16-21, 12-21తో హాంకాంగ్ ఆటగాడు ఎంగ్ కా లాంగ్ ఆగ్నస్ చేతిలో పరాజయం పాలయ్యాడు.

కేకేఆర్ మెంటార్‌గా బ్రావో



కోల్‌కతా: కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీ మెంటార్‌గా విండీస్ మాజీ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో వ్యవహరించనున్నాడు. తాజా కరీబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్)లో ఆడుతున్న బ్రావో ఇటీవల గాయ పడ్డాడు. దీంతో వెంటనే అన్ని రకాల క్రికెట్ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించాడు. ఆ వెంటనే అతడికి కేకేఆర్ కీలక బాధ్యతలు అప్పగించింది. బ్రావో అనుభవం, నిబద్ధత తమ జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని ఫ్రాంచైజీ సీఈవో వెంకీ మైసూర్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ నియామకంపై అటు బ్రావో సంతోషం వ్యక్తం చేశాడు. ఈ ఏడాది జరిగిన ఐపీఎల్‌లో గంభీర్ మెంటార్‌గా కేకేఆర్ చాంపియన్‌గా నిలువగా, అటు బ్రావో సీఎస్‌కే బౌలింగ్ కోచ్‌గా పనిచేసిన విషయం తెలిసిందే.



అర్జున్, హారికకు చెరో రూ. 25 లక్షలు

చెస్ విజేతలను సన్మానించిన సీఎం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో గతవారం జరిగిన ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో విజేతగా నిలిచిన భారత పురుషులు, మహిళల జట్లలో తలపడిన తెలంగాణ ప్లేయర్లు అర్జున్ ఇరిగేసి, ద్రోణవల్లి హారికలకు చెరో రూ. 25 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కలిసిన ఈ ఇద్దరు ప్లేయర్లను సీఎం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, శాట్జ్ చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12 ఏళ్ల క్రితం పోటీపడింది.. ఇప్పుడు పతకం సొంతమైంది



లండన్: అదృష్టం అంటే ఇదేనేమో! అప్పుడెప్పుడో 12 ఏళ్ల క్రితం ఒలింపిక్స్‌లో పోటీపడింది. కానీ, ఆనాడు కనీసం పోడియం ఫినిష్ కూడా చేయలేకపోయింది. కానీ, ఆ విశ్వక్రీడల్లో పాల్గొన్నందుకు ఇప్పుడు పతకం ఆమె సొంతమైంది. ఎలాగంటే... అమెరికాకు చెందిన ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ షనోన్ రోబురీ పన్నెండేళ్ల క్రితం 2012 లండన్ ఒలింపిక్స్‌లో 1500 మీటర్ల రేసులో పోటీపడింది. ఆ ఈవెంట్‌లో ఆమె ఆరోస్థానంలో నిలిచింది. అయితే, ఆ ఒలింపిక్స్ సందర్భంగా చేసిన డోప్ పరీక్షల్లో.. ఆ రేసులో పోటీపడ్డ మొత్తం 13 రన్నర్లలో ఐదుగురు డోపీలుగా తేలారు. వీరిలో స్వర్ణం, రజతం నెగ్గిన టర్కీ అథ్లెట్లు అస్లీ కాకిర్ అల్ప్‌టెకిన్, గేమ్జ్ బులుట్ ఉన్నారు. అప్పట్లో వీరిద్దరి నిష్క్రమణతో మూడోస్థానంలో నిలిచిన రష్యా రన్నర్ తాత్యానా తొమషోవా పతకం రజతానికి అప్‌గ్రేడ్ అయింది. అయితే, మరోసారి శాంపిల్స్ పున:పరీక్షలు, విచారణ అనంతరం తాజాగా తాత్యానా కూడా డోపీగా రుజువైంది. దీంతో నిన్నటిదాకా నాలుగో స్థానానికి అప్‌గ్రేడ్ అయిన 40 ఏళ్ల షనోన్.. ఇప్పుడు మూడోస్థానంతో కాంస్య పతకధారిగా నిలిచింది.

మమ్మల్ని వదిలేసి.. అతనితో సెల్ఫీలా!

అభిమానుల తీరుపై హాకీ స్టార్ల ఆవేదన



న్యూఢిల్లీ: హర్మన్‌ప్రీత్ సింగ్, మన్‌దీప్ సింగ్, హార్దిక్ సింగ్..వంటి ముగ్గురూ భారత హాకీ స్టార్లు. కానీ ఫ్యాన్స్ వారిని ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా..ఎయిర్‌పోర్టులోనే ఉన్న సోషల్‌మీడియా ద్వారా పాపులరైన నాగ్‌పూర్‌కు చెందిన టీ విక్రేత డోలీ చాయ్‌వాలాతో సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. ఇటీవల జరిగిన ఈ సంఘటనపై భారత జట్టు ఏస్ మిడ్ ఫీల్డర్ హార్దిక్ సింగ్ ఆవేదన చెందాడు. 'హర్మన్, మన్‌దీప్, నేను మరో నలుగురు ఆటగాళ్లం ఎయిర్‌పోర్టులో ఉన్నాం. అదేసమయంలో డోలీ చాయ్‌వాలా అక్కడ ఉన్నాడు. కానీ ప్రజ లు అతడితో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు తప్ప మమ్మల్ని పట్టించుకోలేదు. ఆ సంఘటన మాకు ఇబ్బందిగా అనిపించింది' అని హార్దిక్ వాపోయాడు.

బ్రాడ్‌మన్ సరసన కమిందు మెండిస్

లంక తొలి ఇన్నింగ్స్ 602/5 డిక్లేర్

గాలె: శ్రీలంక బ్యాటర్ కమిందు మెండిస్ (182 నాటౌట్) భారీ శతకంతో చెలరేగిపోయాడు. ఈ క్రమంలో బ్రాడ్‌మన్ రికార్డును సమం చేశాడు. దీంతో న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో లంక తొలి ఇన్నింగ్స్‌ను 602/5 వద్ద డిక్లేర్ చేసింది. కుశాల్ మెండిస్ (106 నాటౌట్) సైతం సెంచరీ సాధించడంతో ఆరో వికెట్‌కు అజేయంగా 200 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. తర్వాత కివీస్ రెండో రోజు ఆట చివరికి 22/2 స్కోరు చేసింది.

కాగా టెస్టుల్లో అతి తక్కువ ఇన్నింగ్స్ (13)లో వెయ్యిపరుగులు దాటిన మూడో బ్యాటర్‌గా కమిందు మెండిస్ లెజెండరీ ఆటగాడు డాన్ బ్రాడ్‌మన్‌ను సమంచేశాడు. 12 ఇన్నింగ్స్‌లోనే 1000 రన్స్ చేసిన సట్‌క్లిఫ్ (ఇంగ్లండ్), ఎవర్టన్ వీక్స్ (వెస్టిండీస్) ముందున్నారు. వినోద్ కాంబ్లీ 14 ఇన్నింగ్స్‌లో ఈ ఘనత సాధించాడు.

కొత్త నియామకాలు ఆగవు..

ఫ్రెషర్స్‌పైనే ఎక్కువ దృష్టి
జెనరేటివ్ ఏఐపై ప్రత్యేక ఫోకస్
యాక్సెంచర్ సీఈఓ జూలీ స్వీట్



న్యూఢిల్లీ: ఐటీ కంపెనీలు మళ్లీ నియామకాలకు సిద్ధమవుతున్నాయి. తమ కంపెనీలో కొత్త నియామకాలు ఏ మాత్రం ఆగవని ప్రముఖ ఐటీ సేవలు, కన్సల్టింగ్ సంస్థ యాక్సెంచర్ స్పష్టం చేసింది. ఈ నియామకాల్లో ఫ్రెషర్స్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని కంపెనీ గ్లోబల్ చైర్‌పర్సన్, సీఈఓ జూలీ స్వీట్ ఇన్వెస్టర్స్ కాల్స్‌కు సమాధానం ఇస్తూ తెలిపారు. కొత్త నియామకాల్లో ఎక్కువ భాగం భారత్‌లోనే ఉంటాయని ఆమె చెప్పారు. 'మేము భారత్‌లో నియామకాలు పెంచుతున్నాం. ఇందులో ఎక్కువ నియామకాలు టెక్నాలజీకి సంబంధించిన నియామకాలు. అక్కడ ఇప్పటికే ఉన్న ఉద్యోగుల నైపుణ్యాలు పెంచేందుకూ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నాం' అన్నారు. అయితే భారత్‌లో ఎంత మంది ఉద్యోగులను కొత్తగా తీసుకునేది యాక్సెంచర్ సీఈఓ వెల్లడించలేదు. ప్రస్తుతం అంతర్జాతీయంగా యాక్సెంచర్ కేంద్రా ల్లో 7.74 లక్షల మంది పనిచేస్తుంటే అందులో మూడు లక్షల మందికి పైగా భారత్‌లోనే పని చేస్తున్నారు.

జెన్ ఏఐపై 80,000 మందికి శిక్షణ

ఇతర ఐటీ కంపెనీల్లానే యాక్సెంచర్ కూడా జెనరేటివ్ ఏఐపై ప్రత్యేక దృష్టి పెడుతోంది. తమ క్లయింట్లలో ఎక్కువ మంది టెక్, డేటా, ఏఐ, పనితీరుకు సంబంధించి కొత్త విధానాలకు మారినందున తాము కూడా అందుకు అనుగుణంగా మారక తప్పడం లేదని యాక్సెంచర్ సీఈఓ జూలీ స్వీట్ అన్నారు. 'మా ఉద్యోగుల్లో ఇప్పటికే దాదాపు 57,000 మందికి ఏఐ, డేటా టెక్నాలజీపై శిక్షణ ఇచ్చాం. 2026 ఆర్థిక సంవత్సరం చివరినాటికి 80,000 మందికి ఈ టెక్నాలజీల్లో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని ఆమె తెలిపారు. యాక్సెంచర్ ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటికే దాదాపు 4.4 కోట్ల గంటల పాటు తన ఉద్యోగులకు ఏఐతో సహా వివిధ టెక్నాలజీలపై శిక్షణ ఇచ్చింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 10 శాతం ఎక్కువ.

భారత మార్కెట్లోకి రోల్స్ రాయిస్ కలినాన్ సిరీస్-2

ప్రారంభ ధర రూ.10.50 కోట్లు



న్యూఢిల్లీ: అల్ట్రా లగ్జరీ కార్ల దిగ్గజం రోల్స్ రాయిస్.. భారత మార్కెట్లోకి కలినాన్ సిరీస్-2 కార్లను తీసుకువచ్చింది. రెండు కొత్త వేరియంట్లలో కలినాన్ సిరీస్ 2, బ్లాక్ బ్యాడ్జ్ కలినాన్ సిరీస్ 2 పేరుతో వీటిని విడుదల చేసింది. ఈ కార్ల ప్రారంభ ధరలు వరుసగా రూ.10.50 కోట్లు, రూ.12.25 కోట్లు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి. 6.75 లీటర్ వీ12 ఇంజన్‌తో కూడిన ఈ సూపర్ లగ్జరీ ఎస్‌యూవీ కార్ల డెలివరీలు ఈ ఏడాది చివరి (క్యూ4)లో ప్రారంభించనున్నట్లు రోల్స్ రాయిస్ వెల్లడించింది. ఆసియా పసిఫిక్ రీజియన్‌లో రోల్స్ రాయిస్‌కు భారత్ ఎంతో కీలకమైన మార్కెట్ ఉందని, దీంతో ఈ మోడల్స్‌ను ఇక్కడ విడుదల చేసినట్లు రోల్స్ రాయిస్ మోటార్ కార్స్ రీజినల్ డైరెక్టర్ ఇరేన్ నిక్కిన్ తెలిపారు.

ప్రస్తుతం భారత్‌లో రోల్స్ రాయిస్ కార్లను కొనుగోలు చేసిన వారిలో 90 శాతం మంది సొంతంగా డ్రైవింగ్ చేసుకుంటూ వెళుతుండగా కేవలం పది శాతం మంది మాత్రమే డ్రైవర్ సేవలు పొందుతున్నారని ఇరేన్ చెప్పారు. కాగా 2010లో తమ కార్లను కొనుగోలు చేసే వారి సగటు వయసు 56 ఏళ్లుగా ఉండగా ప్రస్తుతం ఇది 43 సంవత్సరాలకు తగ్గిందని తెలిపారు.

జీఆర్‌టీ మెన్ సరికొత్త కలెక్షన్



హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్.. పురుషుల కోసం జీఆర్‌టీ మెన్ పేరుతో సరికొత్త కలెక్షన్‌ను తీసుకువచ్చింది. ఆధునిక జీవనశైలికి తగ్గట్టుగా పురుషుల కోసం బ్రాస్‌లెట్స్, ఉంగరాలు, గొలుసులు ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు వెల్లడించింది. అంతేకాకుండా ఈ కొత్త కలెక్షన్‌కు విస్తృత ప్రాచుర్యం కల్పించేందుకు ప్రముఖ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్‌ను ప్రచారకర్తగా జీఆర్‌టీ జువెలర్స్ నియమించుకుంది. జీఆర్‌టీ మెన్స్ కలెక్షన్‌లోని ప్రతి ఆభరణాన్ని పురుషుల జీవనశైలి, ఆధునికతను ప్రతిబింబించే విధంగా డిజైన్ చేసినట్లు జీఆర్‌టీ జువెలర్స్ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. నాణ్యత విషయంలో ఎక్కడా కూడా రాజీపడకుండా అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తూ రూపొందించిన ఈ ఆభరణాలు అన్ని జీఆర్‌టీ జువెలర్స్ షోరూమ్స్‌లో అందుబాటులో ఉంటాయని ఎండీ జీఆర్ రాధాకృష్ణన్ తెలిపారు.

జీఎంఆర్ చేతికే నాగ్‌పూర్ విమానాశ్రయం

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టుపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ ఎయిర్‌పోర్టును ఆధునీకరించి, నిర్వహించే హక్కు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌కు ఉందని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి గతంలో తాము ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) దాఖలు చేసిన క్యురేటివ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నాయకత్వంలోని నలుగురు సభ్యుల ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది.

వారాంతంలో లాభాల స్వీకరణ

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు శుక్రవారం ప్రారంభ ట్రేడింగ్‌లో సరికొత్త గరిష్ఠాలకు ఎగబాకినప్పటికీ.. ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ కారణంగా చివరికి నష్టాల్లో ముగిశాయి. ఉదయం సెషన్‌లో 142.13 పాయింట్లు ఎగబాకి 85,978.25 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసిన సెన్సెక్స్.. ఆ తర్వాత క్రమంగా నష్టాల్లోకి మళ్లింది. వారాంతం ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 264.27 పాయింట్ల నష్టంతో 85,571.85 వద్దకు జారుకుంది. నిఫ్టీ సైతం తొలుత 61.3 పాయింట్ల వృద్ధితో 26,277.35 సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివర్లో 37.10 పాయింట్ల నష్టంతో 26,178.95 వద్ద స్థిరపడింది. దాంతో సూచీ ఆరు రోజుల వరుస ర్యాలీకి తెరపడినట్లైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 14 నష్టపోయాయి.

బీఎస్ఈ, ఎన్ఎస్ఈ లావాదేవీ రుసుము సవరణ

అక్టోబరు 1 నుంచి అమలు

క్యాష్, ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ లావాదేవీల రుసుమును సవరిస్తున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ శుక్రవారం ప్రకటించాయి. సవరించిన రుసుము అక్టోబరు 1 నుంచి అమలులోకి రానుంది. ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్లో సెన్సెక్స్, బ్యాంకెక్స్ ఆప్షన్స్ కాంట్రాక్టుల లావాదేవీలపై కోటి ప్రీమియం టర్నోవర్‌కు రూ.3,250 రుసుము వసూలు చేయనున్నట్లు బీఎస్ఈ తన సర్క్యులర్‌లో వెల్లడించింది. ఇదే విభాగంలోని ఇతర కాంట్రాక్టుల ఫీజును మాత్రం యథాతథంగా కొనసాగించింది. సెన్సెక్స్ 50 ఆప్షన్స్, స్టాక్ ఆప్షన్స్ లావాదేవీలకు కోటి ప్రీమియం టర్నోవర్‌పై రూ.500 రుసుము వసూలు చేయనుంది. ఎన్ఎస్ఈ విషయానికి వస్తే, క్యాష్ మార్కెట్ విభాగంలో లక్ష విలువైన లావాదేవీపై రూ.2.97 రుసుము వసూలు చేయనుంది. ఈక్విటీ ఫ్యూచర్స్‌లో లక్ష విలువైన లావాదేవీపై రూ.1.73, ఈక్విటీ ఆప్షన్స్‌కు లక్ష ప్రీమియం వేల్యూపై రూ.35.03 వసూలు చేయనుంది. కరెన్సీ డెరివేటివ్ సెగ్మెంట్లో ఫ్యూచర్స్ కాంట్రాక్టులకు లక్ష విలువైన ట్రేడ్‌పై రూ.0.35 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆప్షన్స్ కాంట్రాక్టులకు లక్ష ప్రీమియం విలువపై రూ.31.10 రుసుము వసూలు చేయన్నుట్లు ఎన్ఎస్ఈ తెలిపింది.

మ్యూచువల్ ఫండ్ల రిస్క్‌కు కలర్ కోడింగ్!

సెబీ కొత్త ప్రతిపాదన

మ్యూచువల్ ఫండ్లు తమ పథకాల్లో పెట్టుబడులపై రిస్క్‌ను తెలియపరిచే విధానాన్ని మరింత మెరుగుపరచాలని సెబీ యోచిస్తున్నది. ఇందుకోసం కలర్ కోడింగ్ రిస్క్ మీటర్‌ను ప్రవేశపెట్టాలని శుక్రవారం విడుదల చేసిన చర్చాపత్రంలో ప్రతిపాదించింది. ఫండ్లు అతి తక్కువ రిస్క్‌ను ఆకుపచ్చ రంగు, అత్యధిక రిస్క్‌ను ఎరుపు రంగు ద్వారా తెలియజేయాలని సూచించింది. ఈ కలర్ కోడ్‌లో మొత్తం ఆరు రిస్క్ స్థాయిలుంటాయి. వాటిని ఆరు వేర్వేరు రంగులతో తెలియజేయాల్సి ఉంటుంది. ఇన్వెస్టర్లకు తమ ఫండ్ పెట్టుబడుల రిస్క్‌పై మరింత సులువుగా అవగాహన కల్పించేందుకు ఇది దోహదపడనుందని సెబీ భావిస్తోంది. అంతేకాదు, మ్యూచువల్ ఫండ్లు పథకం రిస్క్ స్థాయిని తమ యూనిట్ హోల్డర్లకు ఎప్పటికప్పుడు తెలియజేయాల్సి ఉంటుంది. రిస్క్ స్థాయి మారినప్పుడల్లా నోటీస్, ఈ-మెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయాలని సెబీ ప్రతిపాదించింది. అలాగే, ఫండ్లు ప్రస్తుత రిస్క్ మీటర్‌తో పాటు సవరించిన రిస్క్ మీటర్‌ను సైతం ప్రదర్శించాలని సెబీ స్పష్టం చేసింది. ప్రస్తుత రిస్క్ మీటర్ కేవలం రిస్క్ స్థాయిల వివరాలతో నలుపు, తెలుపు రంగులో ఉంటుంది. అయితే, ఇప్పటికే పలు ఫండ్లు తమ పథకాల రిస్క్‌ను కలర్ కోడింగ్ ద్వారానూ తెలియజేస్తున్నాయి.

సీక్వెంట్ సైంటిఫిక్- వియాశ్ లైఫ్ ఒక్కటి కాబోతున్నాయ్

విలీనం విలువ రూ.8,000 కోట్లు!

ముంబై/హైదరాబాద్: పశు ఆరోగ్య సంరక్షణ మార్కెట్లో ప్రపంచ అగ్రగామిగా ఎదిగేందుకు తాము ఒక్కటి కాబోతున్నట్లు సీక్వెంట్ సైంటిఫిక్ లిమిటెడ్, వియాశ్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ శుక్రవారం ప్రకటించాయి. ఈ విలీనం విలువ రూ.7,000-8,000 కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా. ముంబై కేంద్రంగా 2002లో ఏర్పాటైన సీక్వెంట్ సైంటిఫిక్ యానిమల్ హెల్త్ కేర్ కంపెనీ. పశు సంరక్షణకు ఉపయోగించే ఔషధాల కోసం యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ), ఫార్ములేషన్స్‌ను తయారు చేస్తోంది. కాగా, హైదరాబాద్‌కు చెందిన వియాశ్ లైఫ్‌సైన్సెస్ ప్రత్యేక ఫార్ములేషన్స్, ఏపీఐ, అడ్వాన్స్‌డ్ ఇంటర్మీడియేట్స్ పోర్ట్‌ఫోలియోతో కూడిన ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటిక్ కంపెనీ. అంతర్జాతీయ ఔషధ కంపెనీ మైలాన్ (ప్రస్తుతం వయాట్రిస్)లో గతంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పనిచేసిన హరిబాబు బోడెపూడి 2019 ఫిబ్రవరిలో ఈ కంపెనీని ప్రారంభించారు. సీక్వెంట్‌తో పాటు వియాశ్ లైఫ్‌లోనూ అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం కార్లైల్ గ్రూప్ పెట్టుబడులను కలిగి ఉంది. కాగా విలీనం తర్వాత ఏర్పడే కంపెనీలో ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్ 62.4 శాతం వాటా కలిగి ఉండనుంది. వియాశ్ నిర్వహణ సామర్థ్యాలతో విలీనం తర్వాత ఏర్పడబోయే కంపెనీ వ్యాప్తి మరింత పెరగడంతో పాటు పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) సామర్థ్యం విస్తృతం కానుంది. సప్లయ్ చెయిన్ కూడా బలపడనుంది. వేగంగా వృద్ధి చెందుతున్న యానిమల్ హెల్త్‌కేర్ మార్కెట్ లీడర్‌గా అవతరించేందుకు ఈ సామర్థ్యాలు దోహదపడనున్నాయని ఇరు సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాయి.

చట్టపరమైన, నియంత్రణ మండళ్ల అనుమతులకు లోబడి ఈ విలీనం పూర్తి కానుంది. షేర్ల మార్పిడి ద్వారా జరగనున్న ఈ విలీనం అమలులోకి వచ్చాక, వియాశ్ లైఫ్‌సైన్సెస్ వాటాదారులకు ప్రతి 100 షేర్లకు గాను సీక్వెంట్ సైంటిఫిక్‌కు చెందిన 56 షేర్లు లభించనున్నాయి. సీక్వెంట్ జారీ చేయనున్న కొత్త షేర్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలో ట్రేడ్ కానున్నాయి. విలీన వార్తల నేపథ్యంలో సీక్వెంట్ సైంటిఫిక్ షేరు ధర శుక్రవారం 14.15 శాతం ఎగబాకి రూ.217.35కు చేరుకుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,450▲	70,100▲	1,02,000▲
ముంబై	75,640▼	69,286▼	91,448▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	530
వరంగల్	507	గోదావరి	530
చిత్తూరు	543	విశాఖపట్నం	530
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	125	విజయవాడ	121
వరంగల్	125	గుంటూరు	126
కరీంనగర్	125	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	126
కర్నూలు	125	నెల్లూరు	126
విశాఖపట్నం	107	అనంతపురం	126
గోదావరి	121		



భారత్ బయోటెక్.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.కోటి విరాళం అందించింది. శుక్రవారం నాడిక్కడ సచివాలయంలో ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రూ.కోటి చెక్‌ను భారత్ బయోటెక్ కో-ఫౌండర్, జేఎండీ సుచిత్రా ఎల్లా అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో మహిళ ఆత్మహత్య

- కూల్చివేతల భయంతోనేనని కుటుంబసభ్యుల ఆరోపణ
- హైడ్రాకు సంబంధం లేదన్న కమిషనర్ ఏవీ రంగనాథ్

కేపీహెచ్‌బీ కాలనీ, హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన గుర్రంపల్లి బుచ్చమ్మ(56) అనే మహిళ శుక్రవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుంది. హైడ్రా కూల్చివేతల భయంతోనే ఆమె బలవన్మరణానికి పాల్పడిందంటూ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. కూకట్‌పల్లి, యాదవబస్తీలో నివాసముండే శివయ్య, బుచ్చమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పాల వ్యాపారం చేసే ఆ దంపతులు పలు ప్రాంతాల్లో ప్లాట్లు కొనుగోలు చేశారు. ఆడపిల్లలకు పెళ్లి చేసిన తర్వాత ఒక్కొక్కరికి ఒక్కో ప్లాట్ ఇచ్చారు. నల్ల చెరువు పరిసరాల్లోని వెంకట్రావునగర్, శేషాద్రినగర్‌లోని ఆ స్థలాల్లో ఇళ్లు కట్టించి అద్దెకు ఇచ్చారు. ఇదిలాఉండగా నల్ల చెరువులోని ఆక్రమణలకు హైడ్రా అధికారులు ఇటీవల తొలగించారు. చెరువు పరిసరాల్లోని ఇతర నిర్మాణాలను కూడా హైడ్రా కూల్చేస్తుందని స్థానికంగా జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో తమ ఇళ్లు ఎక్కడ కోల్పోతామోనని బుచ్చమ్మ తీవ్ర మనోవేదనకు గురైంది. ఇళ్లు కూల్చేస్తే బిడ్డల పరిస్థితేంటి అని భర్త వద్ద పలుమార్లు వాపోయింది. ఈ క్రమంలో శుక్రవారం బలవన్మరణానికి పాల్పడింది. కాగా, బుచ్చమ్మ ఆత్మహత్య వివరాలు వెల్లడించేందుకు కూకట్‌పల్లి పోలీసులు నిరాకరించారు. కూకట్‌పల్లి మహిళ ఆత్మహత్యతో హైడ్రాకు సంబంధం లేదని, ఆ ప్రాంతంలో తాము ఎవరికి నోటీసులివ్వలేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి ఆత్మహత్య వివరాలు తీసుకున్నామని ప్రకటించారు. కూకట్‌పల్లిలోని చెరువు ఎఫ్‌టీఎల్‌కు దూరంగా వారి ఇళ్లు ఉన్నాయని, ఇళ్లు కూల్చివేస్తారన్న భయంతో కుమార్తెలు తల్లిని ప్రశ్నించినట్టు తెలిసిందన్నారు. ఈ క్రమంలోనే సదరు మహిళ ఆత్మహత్య చేసుకొని ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతోన్న ప్రతి కూల్చివేతను హైడ్రాకు ఆపాదించడం సరికాదన్నారు. హైడ్రాపై భయాందోళనలు సృష్టించేలా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడాన్ని మానుకోవాలని కోరారు.

త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ: సీఎం

హైదరాబాద్, రవీంద్రభారతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కోసం తన సర్వస్వం ధారబోసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి..బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే, మంత్రులు, బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు నివాళులర్పించారు. ఇక, రవీంద్రభారతిలో నిర్వహించిన వేడుకల్లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, సీతక్క.. కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పించారు.

పెట్టుబడులతో రండి..

- అమెరికా సంస్థలకు డిప్యూటీ సీఎం భట్టి పిలుపు

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐటీ, పునరుత్పాదక విద్యుత్తు, వస్తువుల ఉత్పత్తిలో ఎంతో ముందుచూపుతో పురోగమిస్తోన్న తెలంగాణ.. అమెరికా కంపెనీల భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గ్లోబల్ సిటీ హైదరాబాద్‌కు పెట్టుబడులతో తరలిరావాలని అమెరికా కంపెనీలకు ఆయన పిలుపునిచ్చారు. గురువారం అమెరికాలోని లాస్‌వేగాస్‌లో జరుగుతున్న 'మైన్ ఎక్స్‌పో-2024' అంతర్జాతీయ సదస్సులో భట్టి మాట్లాడారు. భారత ఆర్థిక పురోగతిలో అమెరికా కంపెనీలు కీలక పాత్ర పోషించాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్, ఆపిల్ వంటి దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. తద్వారా హైదరాబాద్ ప్రస్తుతం గ్లోబల్ ఐటీ కేంద్రంగా, ఇన్నోవేషన్ హబ్‌గా రూపుదిద్దుకుందని తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంతో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీగా ఆవిష్కృతమవుతోందని తెలిపారు. ఈ దృష్ట్యా అమెరికా కంపెనీలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని సూచించారు.

30 నుంచి వర్గీకరణపై అభిప్రాయాల స్వీకరణ

ఎస్సీ వర్గీకరణపై ఆయా కులాల ప్రతినిధులు, సంఘాలు, వ్యక్తులు తమ అభ్యర్థనలు, అభిప్రాయాలను అందజేయాలని ఎస్సీ అభివృద్ధి శాఖ కోరింది. ఆన్‌లైన్‌లో, వ్యక్తిగతంగా అభ్యర్థనలు అందజేయవచ్చునని తెలిపింది. ఎస్సీ కేటగిరిలో ఉప వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అమలుపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల రెండో దఫా భేటీ అయిన ఉప సంఘం క్షేత్రస్థాయి అభిప్రాయాలు సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు సూచనలను 30 నుంచి స్వీకరిస్తామని అధికారులు చెప్పారు. వ్యక్తిగతంగా అందజేయాలనుకునే వారు మాసబ్ ట్యాంక్‌లోని ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించవచ్చని పేర్కొన్నారు. అలాగే commr.scsubclassification@gmail.com కు ఈ-మెయిల్ పంపవచ్చు.


భట్టి ఇంట్లో చోరీ.. బెంగాల్‌లో నిందితుల అరెస్ట్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 27(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంట్లో చోరీ కలకలం రేపింది. ఇంటి వాచ్‌మన్ తన స్నేహితుడితో కలసి దొంగతనానికి పాల్పడి పారిపోగా.. పశ్చిమ బెంగాల్‌లో వారిని పట్టుకున్నారు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన తర్వాత భట్టి కుటుంబం ప్రజాభవన్‌కు మారడంతో బంజారాహిల్స్ రోడ్డు నంబరు 14లోని ఆయన ఇల్లు ఖాళీగానే ఉంది. ఆ ఇంటి బాగోగులు చూసేందుకు రోషన్ మండల్ అనే వ్యక్తిని వాచ్‌మన్‌గా నియమించారు. ఈనెల 21న డిప్యూటీ సీఎం పీఎస్‌వో భాస్కర్‌శర్మ వాచ్‌మన్‌కు ఫోన్ చేయగా కలవలేదు. అనుమానంతో ఆయన కార్యాలయ సిబ్బందిని ఇంటికి పంపించగా రోషన్ కనిపించలేదు. ఇటు ఇంటిలోపల పరిశీలించగా బెడ్రూం తలుపులు పగులగొట్టి ఉండగా.. కప్‌బోర్డులోని రూ.80 వేలు విలువ చేసే వెండి వస్తువులు మాయమైనట్లు గుర్తించారు. దీనిపై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ సిగ్నల్స్‌ను పరిశీలించారు. రోషన్‌మండల్ తన స్నేహితుడు ఉదయ్‌కుమార్ ఠాకూర్‌తో కలిసి చోరీ చేసి పశ్చిమ బెంగాల్‌కు పారిపోయినట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే అక్కడికెళ్లిన పోలీసులు.. ఖరగ్‌పూర్ రైల్వేస్టేషన్‌లో నిందితులుండగా రైల్వే పోలీసుల సాయంతో అదుపులోకి తీసుకున్నారు.

అయోధ్యకు విమాన సేవలు హర్షణీయం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి అయోధ్యకు శుక్రవారం నుంచి విమాన సర్వీసులు ప్రారంభం కావడంపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలో విమాన సర్వీసులను అందరికీ అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ ఒక్క నెలలోనే హైదరాబాద్ నుంచి ఏడు కొత్త విమాన సర్వీసులను ప్రారంభించినట్టు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి రాజ్‌కోట్, అగర్తలా, జమ్మూ సర్వీసులు ఇటీవలే ప్రారంభమయ్యాయని తెలిపారు. శుక్రవారం నుంచి కాన్పూర్, అయోధ్యకు విమాన సేవలను ప్రారంభించామని చెప్పారు. శనివారం నుంచి ప్రయాగ్ రాజ్, ఆగ్రాకు సర్వీసులు ప్రారంభం కానున్నాయని కిషన్‌రెడ్డి వివరించారు.



వరద బాధితుల సహాయార్థం రిలయన్స్ ఫౌండేషన్ తరఫున సీఎం చంద్రబాబుకు 20 కోట్ల చెక్కు అందజేస్తున్న సంస్థ ఈడీ పీఎంఎస్ ప్రసాద్, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మెంటార్ పీపీఎల్ మాధవరావు

సోమశిల, నిర్మల్‌కు జాతీయ అవార్డులు

- ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రాలుగా ఎంపిక... మంత్రి జూపల్లి హర్షం

న్యూఢిల్లీ/హైదరాబాద్/నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని సోమశిల, నిర్మల్‌కు జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రాలుగా అవార్డులు దక్కాయి. కేంద్ర పర్యాటక శాఖ ఎనిమిది కేటగిరీల్లో అవార్డులు ప్రకటించగా.. 'స్పిర్చువల్-వెల్‌నెస్' కేటగిరీలో నాగర్ కర్నూల్ జిల్లా లోని సోమశిల, 'క్రాఫ్ట్' కేటగిరీలో నిర్మల్ ఎంపికయ్యాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డులను ప్రదానం చేశారు. నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నిర్మల్ టాయ్స్, ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.పెంటయ్య, పర్యాటక శాఖ అధికారి టి.నర్సింహ ఈ అవార్డులను అందుకున్నారు. సోమశిల, నిర్మల్‌కు జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రాలుగా అవార్డులు దక్కడంపై పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో టూరిస్ట్ డెస్టినేషన్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

అట్టహాసంగా పర్యాటక దినోత్సవం

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథం) ఆవరణలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అట్టహాసంగా వేడుకలు నిర్వహించారు. యువ టూరిజం క్లబ్స్ ద్వారా పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్న, యువతకు ఉపాధి కల్పనలో విశేష కృషి చేస్తున్న మహబూబ్‌నగర్, వరంగల్, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు, ఆతిథ్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకులకు మంత్రి జూపల్లి అవార్డులను ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన శివప్రియం, కాకతీయం, పేరిణి నృత్య రూపకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలిలోని నిథంలో నిర్వహించిన వేడుకల్లో నృత్యకారిణికి అవార్డు అందజేస్తున్న మంత్రి జూపల్లి

చారిత్రక భవనాలకు పర్యాటక కళ

పాత అసెంబ్లీ భవనంలోకి శాసన మండలి.. పురాతన మెట్ల బావుల పునరుద్ధరణకు కృషి

- జూబ్లీహాల్, ఉస్మానియా, హైకోర్టు, సిటీ కాలేజీ నిర్మాణాల పరిరక్షణకు చర్యలు
- విద్యార్థుల కోసం తెలంగాణ దర్శిని
- సంక్షేమంతో పాటు పర్యాటకంపైనా ప్రత్యేక దృష్టి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మూసీ పరివాహక ప్రాంతంలోని చారిత్రక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలకు ఆయన సూచించారు. రాష్ట్రంలో సంక్షేమంతోపాటు పర్యాటక రంగాన్నీ ముందుకు తీసుకెళతామని తెలిపారు. హైదరాబాద్‌లోని పలు పురాతన, మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐతో రాష్ట్ర పర్యాటకశాఖ శుక్రవారం ఒప్పందం చేసుకుంది. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నగరంలోని అనేక చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ప్రస్తుతం పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామని, త్వరలోనే అందులో శాసన మండలిని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం శాసనమండలి ఉన్న జూబ్లీహాల్‌ను ప్రత్యేక టెక్నాలజీతో నిర్మించారని, చారిత్రక ప్రాధాన్యం ఉన్న భవనాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జూబ్లీ హాల్‌ను దత్తత తీసుకొని పరిరక్షించాలని సీఐఐకి సూచించారు. ఇప్పటికే చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్టు కొనసాగుతోందని, హైకోర్టు, సిటీ కాలేజీ, పురానాపూల్ బ్రిడ్జి, ఉస్మానియా ఆస్పత్రి పాత భవనం వంటి కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరముందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు రాష్ట్రంలోని పర్యాటక, చారిత్రక ప్రాంతాలను ఉచితంగా సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఇందుకోసమే తెలంగాణ దర్శిని తీసుకువచ్చామన్నారు.



హైదరాబాద్‌లోని మెట్ల బావుల పునరుద్ధరణకోసం సీఎం రేవంత్ సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకుంటున్న సీఐఐ ప్రతినిధులు. చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

పురాతన బావులను దత్తత తీసుకున్న సంస్థలు

నగరంలో పురాతన మెట్ల బావులను పునరుద్ధరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకువచ్చారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వారు ఒప్పంద పత్రాలు అందజేశారు. ఉస్మానియా వర్సిటీలోని మహలఖాబాయి మెట్ల బావి పునరుద్ధరణకు ఇన్ఫోసిస్ ఒప్పందం చేసుకుంది. మంచిరేవుల మెట్ల బావిని సాయిలైఫ్ సంస్థ దత్తత తీసుకుంది. భారత్ బయోటెక్ సంస్థ సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను పునరుద్ధరించనుంది. అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డెయిరీ, ఫలక్‌నుమా మెట్ల బావిని టీజీఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి ఉమెన్ కాలేజీ పునరుద్ధరించనున్నాయి. మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

స్కూళ్లలో అల్పాహారానికి రూ.6.4కోట్లు

వరంగల్ కల్చరల్/కొడంగల్: పైలట్ ప్రాజెక్టులో భాగంగా కొడంగల్ పరిధిలోని 312పాఠశాలల్లో 28వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించగా, సంబంధిత ఖర్చును భరించేందుకు వియాట్రీస్ సంస్థ, హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ ముందుకొచ్చాయి. ఈ మేరకు వియాట్రిస్ సీఎస్ఆర్ అడ్మినిస్ట్రేటివ్ హెడ్ మిషెల్ డొమినికా, చారిటబుల్ ఫౌండేషన్ సీఈవో కౌంతేయదాస సంబంధిత ఎంవోయూపై సంతకాలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రూ.6.4కోట్ల చెక్కును అందజేశారు. వచ్చే నెల నుంచి ఈ పథకాన్ని అమలు చేసే అవకాశం ఉంది. కాగా, వరంగల్‌లోని భద్రకాళి ఆలయంలో అక్టోబరు 3 నుంచి 12వరకు జరిగే శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను సీఎం ఆవిష్కరించారు. ఉత్సవాలకు రావాలని సీఎంను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆహ్వానించారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు రిలయన్స్ విరాళం రూ.20కోట్లు

- రూ.కోటి చెక్కు అందజేసిన భారత్ బయోటెక్ జేఎండీ

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం రిలయన్స్ ఫౌండేషన్ రూ.20కోట్ల విరాళాన్ని ప్రకటించింది. సంబంధిత చెక్కును రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ తరఫున ఆ సంస్థ ప్రతినిధులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని నివాసంలో కలిసి అందజేశారు. వీరి వెంట మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు. కాగా, భారత్ బయోటెక్ తరపున సంస్థ కో ఫౌండర్, జాయింట్ మేనేజింగ్ డైరక్టర్ సుచిత్ర ఎల్ల సీఎం రేవంత్‌ను కలిసి రూ.కోటి చెక్కును అందజేశారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డిని జపాన్ కాన్సుల్ జనరల్ టకాహషి మునియో సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

అధికార వికేంద్రీకరణతోనే సామాన్యులకు న్యాయం

- సీఎంకు మెదక్ జిల్లా రైతుల లేఖ

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధరణి అమల్లోకి వచ్చాక కలెక్టర్లు, సీసీఎల్ఏ వద్ద మాత్రమే అధికారాలు కేంద్రీకృతం అయ్యాయని, వాటిని వికేంద్రీకరించినప్పుడే సామాన్యులకు న్యాయం జరుగుతుందని మెదక్ జిల్లాలోని నర్సాపూర్ మండలానికి చెందిన రైతులు అభిప్రాయపడ్డారు. కొత్త ఆర్వోఆర్ చట్టంలో 1971 నాటి తెలంగాణ భూ హక్కులు, పట్టాదార్ పాస్‌పుస్తకం నిబంధనల ప్రకారం తహసీల్దార్లకు భూ పరిపాలనా అధికారాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. సామాన్య రైతులకు మేలు చేసే నిబంధనలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. పహానీ, 1బీ నకలు తీసుకోవాలంటే ప్రస్తుతం భారీగా ఫీజులు చెల్లించాల్సి వస్తోందని, దాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, అలంపూర్‌లోని జోగులాంబ అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు పంపాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు కోరారు.

250 కోట్లతో క్యాన్సర్ చికిత్స కేంద్రాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రథమ లక్ష్యం. ఇందుకోసం ఆయా కేంద్రాల్లో ఆంకాలజిస్టులను, రేడియాలజిస్టులను నియమించడంతోపాటు జిల్లా ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులకు, సిబ్బందికి శిక్షణ ఇస్తారు. అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచుతారు. ఇక వరంగల్‌లో ఇప్పటికే ఉన్న రీజినల్ క్యాన్సర్ సెంటర్‌ను.. హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రి తరహాలో పూర్తి స్థాయి వైద్య సేవలందేలా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. తెలంగాణలో క్యాన్సర్ మహమ్మారి ఏటేటా పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ రీజినల్ సెంటర్ల ఏర్పాటు నిర్ణయం తీసుకుంది. ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్(ఎన్‌సీఆర్‌పీ) అంచనా ప్రకారం తెలంగాణలో రోజూ సగటున 150-160 మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. 2016లో కొత్తగా 43,129 క్యాన్సర్ కేసులు నమోదు కాగా, 2018 నాటికి ఆ సంఖ్య 52 వేలకు చేరింది. కాగా, 2030 నాటికి ఏటా 65 వేల మంది క్యాన్సర్ మహమ్మారి బారిన పడే ప్రమాదం ఉందని ఎన్‌సీఆర్‌పీ హెచ్చరించింది. క్యాన్సర్ కారణంగా ఏటా 20వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మన దగ్గర 65 శాతం కేన్సర్లకు జీవనశైలి మార్పులు, కాలుష్యమే కారణమని నిపుణులు అంటున్నారు.

ప్రస్తుతం ఎంఎన్‌జే ఆస్పత్రి ఒక్కటే..

రాష్ట్రంలో ఓవైపు క్యాన్సర్ కేసులు పెరుగుతున్నా.. అందుకు తగ్గట్లుగా బాధితులకు వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండటం లేదు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1955లో ప్రారంభించిన ఎంఎన్‌జే ఆస్పత్రి ఒక్కటే ఇప్పటికీ క్యాన్సర్ రోగులకు చికిత్స అందిస్తోంది. ఆ తరువాత మరో క్యాన్సర్ ఆస్పత్రిని ప్రభుత్వాలు ఏర్పాటు చేయలేకపోయాయి. ఎంఎన్‌జే ఆస్పత్రిలో ప్రస్తుతం 750 పడకలున్నా.. రోగుల రద్దీకి అవి ఏమాత్రం సరిపోవడం లేదు. దాంతో డే కేర్ సిస్టమ్‌ను తీసుకొచ్చారు. కీమోథెరపీ చేసిన రోగులను ఒకటి రెండు గంటలపాటు అబ్జర్వేషన్‌లో ఉంచి, అదే రోజు సాయంత్రానికల్లా డిశ్చార్జ్ చేస్తున్నారు. తెలంగాణతోపాటు సరిహద్దు రాష్ట్రాలైన ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా ఇక్కడికి రోగులు వస్తున్నారు. రోజూ 650-750 వరకు ఓపీ సంఖ్య నమోదవుతోంది. వరంగల్‌లో రీజనల్ క్యాన్సర్ సెంటర్ ఉన్నప్పటికీ.. అక్కడ పూర్తి స్థాయిలో వైద్యం అందడం లేదు.

70 శాతం మందికి కీమోథెరపీ అవసరం

క్యాన్సర్ రోగుల్లో 70 శాతం మందికి కీమోథెరపీ అవసరమవుతుంది. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి మూడు వారాలకు ఒకసారి కీమోథెరపీ చేయాల్సి ఉంటుంది. దీంతో కనీసం నెలకు ఒక్కసారైనా బాధితులు ఆస్పత్రులకు రావాలి. ఈ మేరకు ఆరోగ్యశ్రీ కింద వారికి రవాణా చార్జీలు కూడా చెల్లిస్తున్నారు. ఇలా రోజుకు సుమారు రూ.20వేలు పేషెంట్ల రవాణా చార్జీలకే చెల్లిస్తున్నామని ఎంఎన్‌జే ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. పెరుగుతున్న కేసులను దృష్టిలో పెట్టుకుని రీజినల్ క్యాన్సర్ సెంటర్ల ఏర్పాటుకు గతంలోనే జాతీయ ఆరోగ్య మిషన్ కింద నిధులిచ్చేందుకు కేంద్రం ముందుకొచ్చింది. అయితే నాటి కేసీఆర్ సర్కారు దృష్టి పెట్టకపోవడంతో అడుగు ముందుకుపడలేదు.

హైటెక్‌సిటీలో

హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్

(మొదటిపేజీ తరువాయి)

ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఆమె శుక్రవారం సచివాలయంలో సీఎంను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. నూతన క్యాంపస్ ఏర్పాటుతో కొత్తగా ఐదువేల ఇంజినీర్లకు ఉద్యోగాలు లభించనున్నాయని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా ఎంచుకున్న విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై ప్రధానంగా చర్చించారు. విద్యార్థులకు మెరుగైన శిక్షణతో పాటు, విద్యా వనరులను విస్తరించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో హెచ్‌సీఎల్ భాగస్వామ్యం ఉండాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యువకులకు ప్రయోజనం చేకూర్చే నైపుణ్యాభివృద్ధికి హెచ్‌సీఎల్‌తో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉపాధి అవకాశాల కల్పనకు హెచ్‌సీఎల్-గువీ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. హెచ్‌సిఎల్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు. కంపెనీతో వ్యూహాత్మక భాగస్వామ్యం యువతకు ఉద్యోగాలను కల్పించటంతో పాటు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.



హెచ్‌సీఎల్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్‌ను సన్మానించి జ్ఞాపిక అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

స్కిల్ యూనివర్సిటీలో భాగస్వామ్యం

రాష్ట్రంలో యువతకు నైపుణ్యాలను నేర్పించి సాధికారత కల్పించేందుకు చేపట్టే కార్యక్రమాల్లో తమ భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందని రోష్నీ నాడార్ అన్నారు. ఉపాధి అవకాశాలతో పాటు సాంకేతిక సామర్థ్యాలను హెచ్‌సీఎల్-గువీ పెంపొందిస్తుందని ప్రకటించారు. ఆన్‌లైన్ శిక్షణ, నైపుణ్యాభివృద్ధి శిక్షణలో హెచ్‌సిఎల్-గువీ ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాయని ఆమె వివరించారు. తెలంగాణ ప్రభుత్వంతో తమ కంపెనీ భాగస్వామ్యం పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించి అభ్యాసకులకు సాధికారత కల్పిస్తుందని అన్నారు. ఔత్సాహిక సాంకేతిక నిపుణులను తయారు చేస్తుందని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీతో పాటు హెచ్‌సీఎల్ విద్యా కార్యక్రమాలను తెలంగాణలో ఉన్న ఇతర విశ్వవిద్యాలయాలకు విస్తరించే ప్రణాళికలు, దీంతో ఎక్కువ మంది లబ్ధి పొందుతారనే ఆలోచనలను కూడా ఈ సమావేశంలో పంచుకున్నారు. హెచ్‌సీఎల్ రెండేండ్ల కిందట తమ నైపుణ్య విభాగం గువీని ప్రారంభించింది. దీంతో దేశీయ భాషల్లో సాంకేతిక కోర్సులను అందిస్తోంది. ప్రధానంగా సాంకేతిక విద్యలో భాషా అవరోధాలు తొలగించేందుకు కృషి చేస్తోంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తదితరులు పాల్గొన్నారు.

నేను నిద్రపోను.. సీఎంను నిద్రపోనివ్వను

- రుణ మాఫీ పూర్తి చేసే వరకూ వదిలిపెట్టను
- రైతులతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తాం: హరీశ్



సిద్దిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నూటికి నూరు శాతం రైతు రుణ మాఫీ పూర్తయ్యే వరకూ తాను నిద్రపోనని, సీఎం రేవంత్‌రెడ్డిని నిద్రపోనివ్వనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తేల్చిచెప్పారు. అవసరమైతే రేవంత్‌రెడ్డి గుండెల్లో నిద్రపోతానని వ్యాఖ్యానించారు. సిద్దిపేట జిల్లాలోని నంగునూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిర్వహించిన రైతు ధర్నాకు ఆయన హాజరయ్యారు. రుణమాఫీ అందని రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ కష్టాలను చెప్పుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ రుణాలు పొందిన వారిలో చాలా మందికి మాఫీ కాలేదనడానికి ఈ ధర్నాకు వచ్చిన రైతులే నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే రుణ మాఫీ అందని రైతులతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తానని ప్రకటించారు. మరోవైపు.. వానాకాలం సీజన్ పంటలు చేతికొచ్చే సమయం వచ్చినా.. రైతు భరోసా డబ్బులు విడుదల చేయలేదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు అన్ని పంటలకు బోనస్ ఇస్తామన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడేమో సన్న వడ్లకు మాత్రమే ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సన్నాల బోనస్ కూడా పెద్ద బోగస్సే అని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలన్నీ ఎగ్గొట్టడమే రేవంత్ పాలసీ అని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి తన ఇంటి పేరును ఎనుములకు బదులు ఎగవేతలగా మార్చుకోవాలని సూచించారు.

రేషన్ కార్డుల కోసం గాంధీభవన్‌కు రావద్దు

- గ్రామాల్లోనే సమావేశాలు పెడతాం
- 'మంత్రితో ముఖాముఖి'లో ఉత్తమ్
- రెండో రోజూ వినతుల వెల్లువ
- 320 అర్జీలు స్వీకరించిన మంత్రి

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డుల కోసం ప్రజలు 'మంత్రితో ముఖాముఖి' కార్యక్రమానికి రావాల్సిన అవసరంలేదని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. వీటి మంజూరుకు సంబంధించి త్వరలోనే గ్రామాలు, వార్డుల్లో ప్రభుత్వం ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తుందని చెప్పారు. ఆ సమావేశాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టీపీసీసీ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో నిర్వహిస్తున్న 'మంత్రితో ముఖాముఖి'లో శుక్రవారం రెండోరోజు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. వివిధ సమస్యలపై కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, ప్రజల నుంచి 320 వరకూ అర్జీలను స్వీకరించారు. ప్రతి ఒక్కరినీ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాల్సిందిగా సూచించారు. కాగా, మంత్రినే నేరుగా కలిసి తమ సమస్య చెప్పుకొనే అవకాశం ఉండడంతో ప్రజలు పెద్ద ఎత్తున గాంధీభవన్‌కు వచ్చారు. వీరిలో ఇల్లు, రేషన్‌కార్డు కోసం వచ్చినవారే ఎక్కువ మంది ఉన్నారు. వీరితో పాటు భూసమస్యలపై, ఉద్యోగుల బదిలీలకు సంబంధించి జీవో 317 సమస్యపై, సహారా ఇండియాలో ముదుపరులు తమ సమస్యలపైన పలువురు వినతి పత్రాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నేతృత్వంలో మల్లన్నసాగర్ ముంపు బాధితులు వచ్చి తమకు న్యాయమైన పరిహారం ఇప్పించాలని మంత్రిని కోరారు. పలువురు దివ్యాంగులు తమకు ఉద్యోగం ఇప్పించాలని వేడుకున్నారు. వచ్చిన దరఖాస్తులను శాఖల వారీగా నమోదు చేసుకున్న గాంధీభవన్ సిబ్బంది.. వాటిని టీపీసీసీ చీఫ్ లెటర్‌తో పాటు సంబంధిత శాఖలకు పంపించారు. కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి





Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శనివారం 28 సెప్టెంబరు 2024



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చూరీస్ ఆఫ్ ఇండియా- స్టూడెంట్ నమోదు సహా తదుపరి యాక్చూరియల్ ఎగ్జామ్స్ రాసేందుకు ఉద్దేశించిన 'యాక్చూరియల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏసెట్) 2024 అక్టోబరు సెషన్‌కు దరఖాస్తులు కోరుతోంది. ఎగ్జామ్‌కు సంబంధించిన వివరాలను అభ్యర్థుల ఈ మెయిల్స్‌కు పంపుతారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం సంస్థ మాక్ టెస్టులు కూడా నిర్వహిస్తుంది. గత ఆరేళ్ల ప్రశ్న పత్రాలు, వాటి సమాధానాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఏసెట్ స్కోర్ వ్యాలిడిటీ మూడేళ్లు.

ఏసెట్ అక్టోబరు సెషన్ నోటిఫికేషన్

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా, డిగ్రీ కోర్సులు పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మేథ్స్, స్టాటిస్టిక్స్, ఎకనామెట్రిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా చదివిన వారికి; ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, చార్టర్డ్ అకౌంటెంట్, కాస్ట్ అకౌంటెంట్, కంపెనీ సెక్రటరీ కోర్సులు చేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ఏసెట్ వివరాలు: పరీక్ష సమయం మూడు గంటలు. ఇందులో మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఇంగ్లీష్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్ అంశాలనుంచి 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 100. ఒక మార్కు ప్రశ్నలు 45, రెండు మార్కుల ప్రశ్నలు 20, మూడు మార్కుల ప్రశ్నలు 5 అడుగుతారు. మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్‌లకు సంబంధించి ఒక్కోదానిలో 30 మార్కులకు; డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇంగ్లీష్‌లకు సంబంధించి ఒక్కోదానిలో 15 మార్కులకు; లాజికల్ రీజనింగ్ నుంచి 10 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. రుణాత్మక మార్కులు లేవు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి.

ఏసెట్ నిర్వహణ

- ఇది హోమ్ బేస్డ్ ఆన్‌లైన్ ఎగ్జామ్. ఈ పరీక్ష రాయదలచుకొన్న అభ్యర్థులు సంస్థ నిర్దేశించిన మేరకు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సాంకేతికతను అందుబాటులో ఉంచుకోవాలి.
- హార్డ్‌వేర్‌కు సంబంధించి పర్సనల్ ల్యాప్‌టాప్/ డెస్క్‌టాప్, 640x480 @ 15fps రిజల్యూషన్ ఉన్న వెబ్ కెమెరా, 1 ఎంబీపీఎస్ బ్యాండ్‌విడ్త్‌తో వైర్డ్/వైర్‌లెస్ ఇంటర్నెట్, 2 జీబీ ర్యామ్, 2 కోర్స్-4 థ్రెడ్స్-2.2 గిగా హెర్ట్జ్ ప్రాసెసర్, 64 ఎంబీ గ్రాఫిక్స్ మెమరీ, 1024x768 కంటే తక్కువ కాకుండా స్ర్కీన్ రిజల్యూషన్, మల్టీ మీడియా సపోర్ట్ ఉన్న సౌండ్ కార్డ్ ఏర్పాటు చేసుకోవాలి.
- సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి విండోస్ 10/8/7 ఆపరేటింగ్ సిస్టమ్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్, 4.5.2 నెట్ ఫ్రేమ్ వర్క్ సిద్ధం చేసుకోవాలి.
- పరీక్ష రాసే సమయంలో ఒరిజినల్ ఆధార్ కార్డ్/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్/ఓటర్ ఐడీ కార్డ్/పాన్ కార్డ్‌లను దగ్గర ఉంచుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 5
- **ఏసెట్ 2024 అక్టోబరు సెషన్ తేదీ:** అక్టోబరు 13
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 18
- **వెబ్‌సైట్:** www.actuariesindia.org

సీటీటీసీలో ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లు

భువనేశ్వర్‌లోని సెంట్రల్ టూల్ రూమ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్(సీటీటీసీ)- ఉచిత శిక్షణ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడు నెలలు. వీటిని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌డీసీ) స్పాన్సర్ చేస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

సీఎన్‌సీ ఆపరేటర్

- సీఎన్‌సీ ఆపరేటర్ టర్నింగ్ ప్రోగ్రామ్‌లో 300 సీట్లు, సీఎన్‌సీ ఆపరేటర్ వర్టికల్ ప్రోగ్రామ్‌లో 250 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** (ఐటీఐ/డిప్లొమా)(మెకానికల్/ఫిట్టర్/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

సీఎన్‌సీ ప్రోగ్రామర్

- ఇందులో 210 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** (డిప్లొమా/బీఈ/బీటెక్)(మెకానికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **అభ్యర్థుల వయసు:** 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** అక్టోబరు 22
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ట్రెయినింగ్ ఇన్‌ఛార్జ్, సెంట్రల్ టూల్ రూమ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్, బీ-36, చందక ఇండస్ట్రియల్ ఏరియా, భువనేశ్వర్-751024
- **వెబ్‌సైట్:** www.cttc.gov.in



లిటిల్స్

కష్టార్జితం విలువ

వెంకటాపురంలో శ్రీధర్ అనే యువకుడు ఉండేవాడు.అతను విద్యావంతుడే అయినా, ఏపనీ చేయకుండా సోమరిగా తిరిగేవాడు. అతని ఈడు స్నేహితులంతా పెళ్లి చేసుకుని స్థిరపడటం చూసి అతను తన తండ్రి వద్దకువెళ్లి తనకు కూడా పెళ్లి చేయమని అడిగాడు. దానికి అతని తండ్రి నువ్వు పదివేల రూపాయలు 'తీసుకువచ్చి, నాకు ఇస్తే, నీకు పెళ్లి చేస్తాను అని చెప్పాడు. ఓ.. అదెంత పని? అనుకున్న శ్రీధర్ ఆ రోజే ధనవంతుడైన తన మిత్రుని దగ్గరకు వెళ్లి పదివేల రూపాయలు తీసుకొచ్చి, తండ్రి చేతికి ఇచ్చాడు. అయితే, ఆయన ఆ డబ్బును తీసుకుని, ఇది పనికిరాదు అంటూ నీళ్లలోకి విసిరేశాడు. తండ్రి చేసిన పనికి బాధ పడిన శ్రీధర్ ఆ మర్నాడు తన తల్లిని అడిగి,మరో పదివేల రూపాయలు తెచ్చి, తండ్రి చేతికి ఇచ్చాడు. ఆయన అంతకు ముందు లాగే ఈ డబ్బు కూడా పనికిరాదు అంటూ ఆ డబ్బును నీళ్లలోకి విసిరేసాడు. ఆ తరువాత మరో పదిహేను రోజులకు మరలా పదివేల రూపాయలు తెచ్చి, తండ్రి చేతిలో పెట్టాడు. యధా ప్రకారం తండ్రి ఆ డబ్బును పారవేయబోతుంటే, వెంటనే తండ్రి చేయి పట్టుకుని ఆపి ఇలా అన్నాడు.




' ఆగండి నాన్నా.. పారవేయకండి, ఇది నేను రెండు వారాలు కష్టపడి పనిచేస్తే వచ్చిన డబ్బు అన్నాడు.

ఆ మాటలు విన్న అయన 'చూసావా ఇంతకు ముందు నేను డబ్బు పారవేసిన రెండు సార్లు నీకు ఇంత బాధ అనిపించలేదు కారణం ఆ డబ్బు నువ్వు కష్టపడి సంపాదించింది కాకపోవడమే. ఇపుడు డబ్బు పారవేయబోతుంటే నన్ను ఆపావు ఇది కష్టార్జితం కాబట్టి. ఈ విషయం నీకు తెలియాలనే నిన్ను పరీక్షించాను. ఇపుడు నాకు నమ్మకం కుదిరింది.


నువ్వు నీ కుటుంబాన్ని పోషించుకోగలవు.ఇక నీకు పెళ్లి చేస్తాను' అని చెప్పి, నెల తిరిగేలోగా శ్రీధర్ కు ఘనంగా వివాహం జరిపించాడు.

6 తేడాలను కనిపెట్టండి



మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాలలు అందిస్తున్న బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. వనపర్తి అగ్రికల్చరల్ కాలేజ్, కరీంనగర్ అగ్రికల్చరల్ కాలేజీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఒక్కో కాలేజీలో 120 సీట్లు ఉన్నాయి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 స్కోర్ ప్రకారం 85 శాతం సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన 15 శాతం సీట్లను పీజేటీఎస్ఏయూ అగ్రిసెట్ 2024 స్కోర్ ద్వారా భర్తీ చేస్తారు. అంటే తెలంగాణ ఈఏపీసెట్ 2024 అభ్యర్థులకు 102 సీట్లు, పీజేటీఎస్ఏయూ అగ్రిసెట్ 2024 అభ్యర్థులకు 18 సీట్లు కేటాయించారు. బీసీ అభ్యర్థులకు 75 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 5 శాతం, ఓసీ/ఈబీసీ అభ్యర్థులకు 2 శాతం, అనాథలకు 3 శాతం సీట్లు నిర్దేశించారు. రాష్ట్రానికి చెందిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు.

తెలంగాణ బీసీ మహిళా గురుకులాల్లో బీఎస్సీ(ఆనర్స్)అగ్రికల్చర్



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు లేదా పీజేటీఎస్ఏయూ నుంచి రెండేళ్ల డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ అగ్రికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ ఈఏపీసెట్ 2024(బైపీసీ స్ట్రీమ్) లేదా పీజేటీఎస్ఏయూ అగ్రిసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థి వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000; పట్టణాల్లో రూ.2,00,000 మించకూడదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 10
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్ విండో ఓపెన్:** అక్టోబరు 11 నుంచి 12 వరకు
- **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in

ఐసర్ భోపాల్‌లో పీహెచ్‌డీ

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐసర్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. విదేశీ విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు

- నేచురల్ సైన్సెస్ స్ట్రీమ్- బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఫిజిక్స్
- ఇంజనీరింగ్ సైన్సెస్ స్ట్రీమ్- కెమికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్
- హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ స్ట్రీమ్- ఎకనామిక్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్(కాగ్నిటివ్ సైన్స్, సోషల్ వర్క్ అండ్ సోషియాలజీ)

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎమ్మెస్సీ/ఎంఏ ఉత్తీర్ణులు; ఎంసీఏ/బీఈ/బీటెక్/బీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/యూజీసీ జేఆర్ఎఫ్/డీబీటీ జేఆర్ఎఫ్/ ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/ఇన్‌స్పైర్ జేఆర్ఎఫ్/రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్/సీఎస్ఐఆర్ ఎల్ఎస్/ యూజీసీ ఎల్ఎస్ అర్హత తప్పనిసరి. కనీసం 8 సీజీపీఏ స్కోర్‌తో ఐటీల నుంచి బీఈ/బీటెక్ అలాగే ఐసర్ల నుంచి బీఎస్ - ఎంఎస్ పూర్తిచేసినవారికి గేట్/ఫెలోషిప్ అర్హత అవసరం లేదు. మెడికల్ సంబంధిత స్పెషలైజేషన్‌లకు ఎంబీబీఎస్ పూర్తిచేసినవారు కూడా అర్హులే. అభ్యర్థుల వయసు దరఖాస్తు నాటికి 28 ఏళ్లు మించకూడదు. విదేశీ విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ, పీజీ స్థాయుల్లో 60 శాతం మార్కులు ఉండాలి. జీఆర్ఈ జనరల్ టెస్ట్‌లో 280 స్కోర్/గేట్ వ్యాలిడ్ స్కోర్, టోఫెల్‌లో 60 స్కోర్/ఐఈఎల్‌టీఎస్‌లో 6 స్కోర్ తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 14
- **వెబ్‌సైట్:** www.iiserb.ac.in/doaa/admission



నేషనల్ ఆర్కైవ్స్‌లో స్పెషల్ ట్రెయినింగ్

నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ ఆర్కైవల్ స్టడీస్- స్పెషల్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్ ఇన్ రిపైర్ ఆఫ్ రికార్డ్స్‌ను అందిస్తోంది. కోర్సు వ్యవధి 11 రోజులు. ఇందులో మొత్తం 25 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులో రికార్డులను అరేంజ్ చేయడం, రీ స్టోరేషన్, రిపైర్ చేయడం తదితర ప్రక్రియలను నేర్పిస్తారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 30 ఏళ్లు మించకూడదు. ఇంగ్లీష్, హిందీ బాషల్లో ప్రావీణ్యం తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- కోర్సు ఫీజు: రూ.300
- దరఖాస్తు ఫీజు: రూ.100
- దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ: సెప్టెంబరు 30
- వెబ్‌సైట్: nationalarchives.nic.in

నిట్ ఆంధ్రప్రదేశ్‌లో టీచింగ్ ఫ్యాకల్టీ

ఖాళీలు: 125

తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2(కాంట్రాక్ట్): **48 పోస్టులు**
2. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2(కాంట్రాక్ట్): **20 పోస్టులు**
3. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1: **20 పోస్టులు**
4. అసోసియేట్ ప్రొఫెసర్: **30 పోస్టులు**
5. ప్రొఫెసర్: **7 పోస్టులు**

విభాగాలు: బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, మేథమెటిక్స్, కెమిస్ట్రీ, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్.

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఎంబీఏ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 35 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు 45 ఏళ్లు, ప్రొఫెసర్ పోస్టులకు 55 ఏళ్లు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ: టీచింగ్ డిమాన్‌స్ట్రేషన్/రీసెర్చ్ ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 10

వెబ్‌సైట్: https://www.nitandhra.ac.in/

డీఆర్‌డీవోలో అప్రెంటిస్‌లు

ఖాళీలు: 200

హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో)కు చెందిన రీసెర్చ్ సెంటర్ ఇమారత్(ఆర్‌సీఐ)..కింద పేర్కొన్న అప్రెంటిస్‌షిప్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 40
2. టెక్నీషియన్ అప్రెంటిస్: 40
3. ట్రేడ్ అప్రెంటిస్: 120



విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, కెమికల్, కమర్షియల్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్ తదితరాలు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

అప్రెంటిస్‌షిప్ కాలం: ఒక సంవత్సరం

ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 15

వెబ్‌సైట్: https://www.drdo.gov.in/drdo/

బెల్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్లు

జాబ్ కార్నర్

బెంగళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్)...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ప్రాజెక్ట్ ఇంజనీర్-1(ఎలక్ట్రానిక్స్/మెకానికల్): **5 పోస్టులు**

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 1 నాటికి 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు మొదటి ఏడాది రూ.40,000; రెండో ఏడాది రూ.45,000; మూడో ఏడాది రూ.50,000; నాలుగో ఏడాది రూ.55,000 చెల్లిస్తారు.


దరఖాస్తు ఫీజు: రూ.400; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 2

వెబ్‌సైట్: https://bel-india.in/

సరైన నీడ ఏది?





దారి కనుక్కోండి

డైలీ సుడోకు - 421

	3	6	5	4				7
			7					
7	8	5				6		
		3		7		4	9	
9				2				5
	6	8		9		7		
		1				8	4	9
					9			
8				1	4	5	3	

సుడోకు - 420 సమాధానం

1	3	6	5	4	2	9	8	7
4	9	2	7	8	6	1	5	3
7	8	5	9	3	1	6	2	4
2	1	3	6	7	5	4	9	8
9	4	7	1	2	8	3	6	5
5	6	8	4	9	3	7	1	2
6	2	1	3	5	7	8	4	9
3	5	4	8	6	9	2	7	1
8	7	9	2	1	4	5	3	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.